శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



'మెహంగాయీ మానవ్'
మళ్లీ తన పని చూపించాడు...
పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు

పద్మ పురస్కారాల ప్రదానం 07
ధర్మేంద్ర తరఫున పద్మ విభూషణ్ అందుకున్న హేమమాలిని

ముగ్గురు ఎఐఎడిఎంకె
తిరుగుబాటు ఎమ్మెల్యేలు రాజీనామా



సంపుటి 09, సంచిక: 176 | మంగళవారం | 26-05-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములు

- సహచరులను కలుసుకున్న ఝూంగ్ యాంగ్ ఝూ, ఝూంగ్ ఘి యువాన్, లై కాయింగ్

**బీజింగ్:** ముగ్గురు వ్యోమగాములు చాలా విజయవంతంగా చైనాకు చెందిన సొంత తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. చైనా అంతరిక్షకేంద్రం ఈ ఏడాదిలో మొదటిసారి మానవసహిత ప్రయోగం చేసింది. దీంతో చైనా ఇప్పటివరకూ ఎనిమిదిసార్లు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపినట్లయింది. చైనా అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌లో ఇప్పటికే ముగ్గురు వ్యోమగాములున్నారు. సోమవారం తెల్లవారుజామున 2.45 గంటలకు షెన్‌ఝూ–23 వ్యోమనౌక విజయవంతంగా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమైందని చైనా మానవసహిత అంతరిక్ష కేంద్రం సిఎంఎస్ఎ తెలియజేసింది. ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తి కావడానికి మూడున్నర గంటల సమయం పట్టింది. ఝూంగ్ యాంగ్ ఝూ, ఝూంగ్ ఘి యువాన్, లై కాయింగ్ తరువాయి 8లో




## ఎన్‌టిఎ గుణపాఠాలు నేర్చుకోవడం లేదు

- నీట్ పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్‌యుజి 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గతంలో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టిఎ, సిబిఐలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ ఆరాధే నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో కూడా ఇదే అంశం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిందని, అప్పట్లో కోర్టు సూచనల మేరకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేసింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు అమలయ్యాయా లేదా అన్న విషయంపై ఎన్టీఏ పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. గురువారం లోపు ఆ నివేదికను తరువాయి 8లో


అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మహిళా శక్తి సూపర్ బజార్లు 03
- సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి


### సిఫారసులకు అనుగుణంగా

# కనీస వేతనం పెంచండి



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఐ విజ్ఞప్తి
- కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమే
- అయితే అవి ఏమాత్రం సరిపోవని ఆవేదన
- సచివాలయంలో సిఎంను కలిసిన సిపిఐ ప్రతినిధి బృందం
- ఏడు ప్రధాన సమస్యలపై వినతి పత్రం అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, అయితే అవి కార్మికులకు ఏమాత్రం సరిపోవని, కనీస వేతనాల కమిటీ సిఫార్సులకు అనుగుణంగా పెంచాలని సిపిఐ నేతల ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో సిపిఐ ప్రతినిధి బృందం భేటీ అయింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, ఈ.టి.నరసింహా, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం. బాలనరసింహ, వి.ఎస్.బోస్, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కూడిన ప్రతినిధి బృందం 7 ప్రధాన సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను ప్రభుత్వం పెంచినప్పటికీ, కనీస వేతనాల కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోక పోగా ప్రస్తుతం ఇస్తున్న వేతనాల కంటే ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు తక్కువగా ఉన్నాయని, వాటిని సవరించాలని కూనంనేని సాంబశివరావు సిఎంను కోరారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా వేతనాలను పెంచాలన్నారు. రైతు భరోసాను రబీ సీజన్‌లో రెండు ఎకరాల వరకే ఇచ్చారని, మళ్ళీ ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమవుతున్నందున తరువాయి 8లో






### అన్యాయం జరిగిన ప్రతి చోటుకూ

# కళాకారుడి గళం

- కళాకారులు ఆటా, పాటా, డప్పుదరువుతో ప్రజల్లో చైతన్యం నింపాలి
- దేశాన్ని కాపాడుకుందాం : కళాకారులు, సినీ రంగ ప్రముఖులు పిలుపు
- ప్రజా సమస్యలనే కళారూపాలుగా మలచి గొంతెత్తి నినదించిన నిత్యచైతన్య స్ఫూర్తి ప్రజానాట్యమండలి
- పతాకాన్ని ఆవిష్కరించిన సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి

**ఘనంగా ప్రారంభమైన తెలంగాణ ప్రజానాట్యమండలి నాలుగవ మహాసభలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశం కులాలు, మతాలుగా వీడిపోతున్న ఈ తరుణంలో సమ సమాజమే స్థాపన లక్ష్యంగా ఆవిర్భవించిన ప్రజా నాట్యమండలి కళాకారులంతా ఆట పాటలు, డప్పుదరువుతో ప్రజల్లో చైతన్యం నింపాలని, తద్వారా ఈ దేశాన్నికాపాకుందామని పలువురు కళాకారులు, సినీ రంగ ప్రముఖులు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలనే కళా రూపాలుగా మలిచి గొంతెత్తి నినదించిన నిత్య చైతన్య స్ఫూర్తి తెలంగాణ ప్రజా నాట్యమండలి అని వారు ప్రశంసించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజు ల పాటు జరగనున్న ఈ మహాసభలను సోమవారం తరువాయి 12లో

# హడలెత్తిస్తున్న వడగాడ్పులు

- చరిత్రలోనే తొలిసారి 'రెడ్ అలర్ట్'
- ఉష్ణోగ్రతలు, ఉక్కపోతలతో అల్లాడిపోతున్న జనం
- పగలే కాకుండా రాత్రి వేళల్లోనూ తీవ్ర వేడి
- రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బకు 100కు పైగా మృత్యువాత
- సాయంత్రాల్లో వర్ష సూచన !



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 నుంచి 47 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచే వాతావరణం నిప్పుల కొలిమిలా మారుతుండటంతో మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే జనం వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ కేంద్రం చరిత్రలోనే మొదటిసారిగా వడగాల్పులపై అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. గత వారం రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 100కు పైగా మరణాలు సంభవించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అత్యంత ప్రమాదకర స్థాయిలో వడగాలులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. వాతావరణ కేంద్రం రాబోయే 7 రోజులకు సంబంధించిన వాతావరణ సూచనలు, హెచ్చరికల బులెటిన్‌ను విడుదల చేసింది. రాబోయే 3 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలలో ఎటువంటి భారీ మార్పు ఉండదు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 మార్కును దాటే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లో 41 నుండి 44 వరకు నమోదవుతాయి. ఆ తర్వాత 4 రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 3 డిగ్రీల మేర తగ్గుముఖం పడతాయి. తీవ్రమైన వేడిగాలులు, 44 నుండి 47లతో మధ్యాహ్నం సమయంలో 'లూ'గాలులు వీచే అవకాశం ఉన్నందున వాతావరణ కేంద్రం జిల్లాలను అలర్ట్ చేసింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగాం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చారు. పగలే కాకుండా రాత్రి వేళల్లోనూ తీవ్రమైన ఉబ్బరపోత, వేడిగాలులు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, తరువాయి 8లో



# మరో విడత.. పెట్రో మోత

- లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై 2.71 పెంచిన కేంద్రం
- రెండు వారాల లోపు ధరలు పెరగడం నాల్గోవసారి
- మొత్తంగా వినియోగదారులపై రూ. 7.5 భారం

**న్యూఢిల్లీ :** భారత్‌లో పెట్రో ధరల మోత మోగింది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఇప్పటికే పలుమార్లు ఇంధన ధరలు పెంచిన సామాన్యుడి నడ్డి విరిచిన కేంద్ర సర్కార్ మరోసారి వారిని కోలుకోలేని దెబ్బతీసింది. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విడతల వారీగా పెరుగుతాయని ప్రతిపక్షాలు హెచ్చరించాయి. వారిని హెచ్చరికలు లెక్కచేయకుండా బిజెపి నేతృత్వంలోని కేంద్రం ధరలను పెంచుకుంటూ పోతోంది. ఇరాన్ వివాదం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావాన్ని ఆలస్యంగా వినియోగదారులపై మోపుతోంది. తాజాగా సోమవారం లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై 2.71 వడ్డించింది. రెండువారల లోపు ధరలు పెంచడం ఇది నాల్గోవసారి. ఈ నెల 15వ తేదీ ఇప్పటి వరకు నాలుగు ధరలు పెంచడంతో మొత్తంగా రూ. 7.5 పెరిగింది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఢిల్లీలో పెట్రోల్ ధరలు లీటరు రూ. 99.51 నుంచి రూ. 102.12కు, డీజిల్ ధరలు రూ. 92.49 నుంచి రూ. 95.20కు పెరిగాయి. ముంబైలో పెట్రోల్ ధర లీటరుకు రూ.111.21, డీజిల్ ధర రూ.97.83గా ఉండగా, కోల్‌కతాలో ధరలు వరుసగా రూ.113.51, రూ.99.82కు పెరిగాయి. చెన్నైలో పెట్రోల్ ధర లీటరుకు రూ. 107.77, డీజిల్ ధర లీటరుకు రూ. 99.55గా ఉంది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రల్ ధర 115.58, డీజిల్ ధర 103.74కు పెరిగింది. స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాల వారీగా ధరలు మారుతూ ఉంటాయి. రిటైల్ ఇంధన ధరలను మొదట మే 15న లీటరుకు రూ.3 పెంచారు. ఆ తర్వాత 19న 90 పైసలు, 23న మరోసారి పెట్రోల్ ధరలు లీటరుకు 87 పైసలు, డీజిల్ ధరలు 91 పైసలు పెరిగాయి. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ ఇంధన రిటైలర్లు కూడా ధరలను పెంచారు. నయారా ఎనర్జీ గతంలో మార్చిలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు వరుసగా రూ. 5, రూ. 3 పెంచగా, షెల్ పిఎల్‌సి ఏప్రిల్ 1 నుంచి పెట్రోల్ ధరలను రూ. 7.41, డీజిల్ ధరలను లీటరుకు ఏకంగా రూ. 25 వరకు పెంచింది. జాతీయ ఎన్నికలకు ముందు మార్చి 2024 లో లీటరుకు రూ. 2 కోత మినహా, రెండేళ్లకు పైగా దాదాపుగా స్తంభించిపోయిన ఇంధన ధరలు, ఇప్పుడు మే 2022 తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధాన్ని ముగించేందుకు ఒక ఒప్పందం కుదురుతుందనే తాత్కాలిక ఆశల మధ్య ప్రపంచ చమురు ధరలు తీవ్రంగా పడిపోయిన తరుణంలో ఇంధన ధరలు పెంచి వినియోగదారులపై తీవ్ర భారం మోపారు. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి అమెరికా, ఇరాన్‌లు సూత్రప్రాయంగా అంగీకరించిన తర్వాత, ప్రపంచ చమురు ధరలకు ప్రాథమిక ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ 5 శాతానికి పైగా తరువాయి 8లో

### కృష్ణా జలాల వినియోగంపై

# సమన్వయంతో ముందుకు

- తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కర్ణాటక రాష్ట్ర చిన్న తరహా నీటి వనరుల శాఖ మంత్రి బోసురాజు భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ – కర్ణాటక రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమన్వయంతో ముందుకు సాగుదామని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి కర్ణాటక మంత్రికి తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల తరువాయి 8లో

### ఒప్పందంపై తక్షణం

# 'సంతకాలు సాధ్యంకాదు'

- అనేక అంశాలపై అవగాహన కుదిరింది కానీ.. అమెరికా వైఖరులు మారుస్తోంది
- లెబనాన్ కూడా ఒప్పంద పరిధిలో ఉండాలి
- ఇజ్రాయెల్ తప్పుతోవ పట్టించే ప్రకటనలు
- ఇరాన్ ప్రతినిధి ఇస్మాయెల్ బఘాయీ ప్రకటన

**దోహా:** పశ్చిమాసియాలో యుద్ధ పరిష్కారానికి చర్చల్లో కొంత పురోగతి సాధించినప్పటికీ తక్షణం ఒప్పందం కుదరదని ఇరాన్ హెచ్చరిక చేసింది. అదేసమయంలో ట్రంప్ కూడా ఒక ప్రకటన చేస్తూ, ఒప్పందం కోసం తాము తహ తహ లాడటంలేదని, ఉరుకులు పరుగుల ఒప్పందాన్ని తాము కోరుకోవడంలేదని, ఒబామాకాలంనాటి ఒప్పందం కంటే భేషైన ఒప్పందాన్ని తాము సాధిస్తామన్నారు. "ఇరాన్‌తో ఒప్పందం చాలా గొప్పగా ఉంటుంది, అర్థవంతంగా ఉంటుంది లేకపోతే అసలు ఒప్పందమే ఉండదు" అని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. ఈ పరస్పర ప్రకటనల మధ్య ఒప్పందం కుదురుతుందా? లేదా?



అనే ఊగిసలాట మధ్య చర్చలకు సంబంధించిన అనుసంధాన కర్తలు ఖతార్ జాధాని దోహాకు చేరుకున్నారు. వీరిలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ ఘాలిబాఫ్, విదేశీ వ్యవహారాల మంత్రి అబ్బాస్ ఆరాఘ్చి ఇద్దరు తరువాయి 8లో

# కొత్త కోర్సుల 'పంచాయితీ'

- ఆధిపత్య పోరులో 'కోర్సులు''
- 'దోస్త్'రెండవ దశలో కొత్త కోర్సులా..?
- కమిషనరేట్ వర్సెస్ ఉన్నత విద్యమండలి..

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలో 'కొత్త కోర్సుల పంచాయితీ' కొనసాగుతోంది. కళాశాల కమిషనరేట్, ఉన్నత విద్యామండలి ఆధిపత్య పోరులో 'కొత్త కోర్సుల'అంశం చర్చనీయాంశంగా మారింది. ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన కొత్త కోర్సులకు పలు సాంకేతిక కారణాలతో కళాశాల కమిషనరేట్ అనుమతులు ఇవ్వకపోగా, కళాశాల కమిషనరేట్ మాత్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కొత్తగా 11 'ఎఇడిపి'కోర్సులను ప్రవేశపెట్టింది. కొత్త కోర్సులకు విశ్వవిద్యాలయాల నుంచి అనుమతులు ఉన్నాయని ఉన్నత విద్యామండలి చెబుతున్నప్పటికీ, కళాశాల కమిషనరేట్ మాత్రం పలు సాంకేతిక కారణాలు చూపుతున్నట్లు ఉన్నత విద్యమండలి అధికార యంత్రాంగం చెబుతుం ది. కొత్త కోర్సుల అనుమతులు విశ్వవిద్యాలయా లు పరిధిలోని అంశమని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టే క్రమంలో ఆయా కళాశాలకు యుజిసి, ఎఐసిటిఇ అనుబంధ అనుమతులు ఉన్నాయా? లేదా? అనుమతుల పునరుద్ధరణ జరిగిందా? లేదా?, సిలబస్, కళాశాల తనిఖీలు తదితర అం శాల బాధ్యత ఆయా విశ్వవిద్యాలయాలదే అని , అనుమతులు ఇవ్వాల్సింది తరువాయి 8లో

# రాజకీయాస్త్రంగా రైతు

రైతు గోస రైతుది – ప్రభుత్వం తిప్పలు ప్రభుత్వానివి – రైతును రాజకీయాస్త్రంగా ప్రయోగిస్తున్న ప్రధాన ప్రతిపక్షాలు. ఇదీ ఈ రోజున తెలంగాణ రాజకీయ రణ క్షేత్రం. అసలు ఏమి జరుగుతోంది?

ఈ రబీలో వరిధాన్యం, జొన్న, మొక్కజొన్న పంటలు పుష్కలంగా పండాయి. రైతు కంట ఆనందం వెల్లివిరిసింది. కేంద్రప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు (సన్న బియ్యం వడ్లకు క్వింటాలుకు రూ.500 రాష్ట్ర ప్రభుత్వ బోనస్) ఐకెపిల ద్వారా వరిధాన్యం కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. అయితే మార్కెట్ యార్డులకు వచ్చే ధాన్యం, కొనుగోలు సామర్థ్యం మధ్య వ్యత్యాసం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు ధాన్యంలో తేమ శాతం, తాలు తప్ప పేరుతో క్వింటాలుకు 5–6కిలోల కోత, ఆ పై కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యం రైతు మనోవేదనపై రోకటిపోటు అయింది. ఈ మధ్యలోనే హమాలీల కొరత, గోతాములు, లారీల కొరత, కొన్ని చోట్ల రైస్ మిల్లుల్లో వారంరోజులైనా లారీలనుంచి దించని ధాన్యం – ఈ సమస్యలతో ధాన్యం కొనుగోలు తగ్గింది. చివరి గింజ వరకు కొంటాం, తడిసిన ధాన్యం కూడా కొంటాం అని మంత్రులు చేస్తున్న భరోసా ప్రకటనలు రైతుల ఆందోళనను తొలగించలేకపోతున్నాయి. కొన్నిచోట్ల రైతులు రోడ్డెక్కారు. రాస్తారోకో, రాస్తాపై ధాన్యం దగ్ధం వంటి దృశ్యాలు సాక్షాత్కరించటం ఏ ప్రభుత్వానికైనా ఆందోళనకరం. ప్రతిపక్ష బిఆర్ఎస్ రోజువారీ ప్రకటనలు, క్షేత్రస్థాయి పర్యటనల వంటి కార్యక్రమాలతో రైతుల సానుభూతికోసం ప్రయత్నాలు, వారి ఆరోపణలకు మంత్రుల నుంచి తీవ్రమైన సమాధానం నిత్యకృత్యమైంది. తాము ఎక్కడ వెనకబడిపోతామో అని బిజెపి రాష్ట్ర నాయకులు కొనుగోలు కేంద్రాల సందర్శనకు బయలుదేరారు.

అయితే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నంత తీవ్రంగా ఉందా? రాష్ట్రంలో 141లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండినట్లు అంచనా. రాష్ట్రవ్యాప్తంగా 8575కొనుగోలు కేంద్రాల ద్వారా శనివారం నాటికి 51లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగింది. ధాన్య సేకరణ టార్గెట్ 75లక్షల ఎంటి. రైతులకు రూ.8,749 కోట్లు చెల్లించటం జరిగింది. కొనుగోలు కేంద్రాలలో కాంటాకు ఎదురు చూస్తున్న 8లక్షల 50వేల టన్నుల ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు పౌర సరఫరాల మంత్రి ఎన్.ఉత్తమకుమార్‌రెడ్డి ఆదివారం చెప్పారు. ఈ నెలాఖరుకు వరిధాన్యం కొనుగోలును పూర్తిచేయటానికి కలెక్టర్లకు పూర్తి అధికారం ఇచ్చారు. రైతుల ఇబ్బందులపట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బిఆర్ఎస్ నాయకులు, గతంలో తమ ప్రభుత్వకాలంలో ఏ సంవత్సరమైనా రబీ సీజన్‌లో ఇంత ధాన్యం కొన్నారా? డబ్బు వెనువెంటనే చెల్లించారేమో పాత ఫైళ్లు తిరగవేసుకుని ప్రజలకు చెబితే వారి సమర్థత తేటతెల్లమవుతుంది. ప్రభుత్వం వారి ప్రచారాన్ని వాస్తవ గణాంకాలతో తిప్పికొట్టటం మాత్రమే రైతుల్లోని ఆందోళన తొలగించదు. ఈ వారంరోజుల్లో మిగిలిన ధాన్యం కొనుగోలు పూర్తి చేయగలిగితే రైతులు సంతోషిస్తారు. మండుటెండలు లెక్కచేయకుండా ఈ పని పూర్తి చేయాలి.

వరిధాన్యం కొనుగోలుతో ప్రభుత్వ యంత్రాంగం సతమతమవుతుండగా జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు దిగుబడులు మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 16.13లక్షల ఎకరాలకు పెరిగింది. సగటు దిగుబడి ఎకరాకు 26.57 క్వింటాళ్ల చొప్పున మొత్తం 42.87 లక్షల మెట్రిక్ టన్నులు పంట పండింది. 354 కేంద్రాల ద్వారా ఇప్పటికే 2.33 లక్షల రైతులనుంచి 12.85 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగింది. ఇంతలో గోదాముల సమస్య ఎదురైంది.

మొక్కజొన్న, జొన్నలు, పొద్దుతిరుగుడు విత్తుల కొనుగోలుపై కేంద్రం నుంచి జవాబుకోసం ఎదురుచూడకుండానే ఈ మూడు పంటలు కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించటం హర్షించదగింది.

రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు వారి తరపున గళం వినిపించటం, అధికారులను అప్రమత్తం చేయటం ప్రతిపక్షాల బాధ్యత. అయితే రైతు ఉద్ధారకులం తామే అన్నట్లు దాదాపు పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన పార్టీ ఎన్నిసార్లు చెప్పుకున్నా రైతులు రెండు ప్రభుత్వాల రైతు విధానాలను బేరీజు వేసుకుని నిజనిర్ధారణ చేసుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతిపక్షం అతి చేస్తే వారికే నష్టం.

కేంద్రం తెలంగాణను ఉద్ధరిస్తున్నదని కొత్త ప్రచారబాణీ వినిపిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ధాన్యం కొనుగోలుకు కేంద్రం డబ్బు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో – పంటకోత మొదలు మార్కెట్‌లో కాంటావరకు ఎన్నో సమస్యలుంటాయి. గోతాలు, హమాలీలు అతిపెద్ద సమస్య. అందువల్ల అన్ని పార్టీలు రైతుల ఇబ్బందులు తొలగించేందుకు సహాయ పడితేనే రైతుకు సంపూర్ణ న్యాయం జరుగుతుంది. అలాకాకుండా ప్రభుత్వంపై గెద్దలు వేయటమే రాజకీయమనుకుంటే ఎదురుదెబ్బలు తప్పవు.



## రూ.50 వేల వరకు పంట రుణాలు మాఫీ

**తమిళనాడులో రైతులు కోఆపరేటివ్ బ్యాంక్ నుంచి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తున్నాం. రూ.50,000 వరకు పంట రుణాలు తీసుకున్న సన్నకారు రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేస్తాం. రూ.50 వేలకు పైబడి తీసుకున్న రుణాలకు 50 శాతం మాఫీని చేస్తాం. 2025, మే 1 నుండి 2026 ఫిబ్రవరి 28 మధ్యకాలంలో సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రమే తాజా రుణమాఫీ వర్తిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో 14.22 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. రాష్ట్ర ఖజానాపై రూ.2,044 కోట్ల భారం పడుతుంది.**

- తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్

# పోషకాహారంతో థైరాయిడ్ రుగ్మత నియంత్రణ

థైరాయిడ్ గ్రంథికి సంబంధించిన రుగ్మతలు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ ప్రజలకు ఓ ప్రధాన సమస్యగా నిలుస్తున్నాయి. స్వర పేటికకు కింది భాగాన ఇరువైపుల చిన్న సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న థైరాయిడ్ గ్రంథి ప్రధాన విధుల్లో శక్తి సంబంధ జీవ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, మానసిక ఆరోగ్యం, గుండె సక్రమంగా కొట్టుకోవడం, శరీర పెరుగుదలకు దోహదపడడం లాంటి ప్రధాన విధులు వస్తాయి. థైరాయిడ్ స్రవించే హార్మోన్ల మూలంగా శక్తి వినియోగ ప్రక్రియలు సక్రమంగా జరుగుతాయి. థైరాయిడ్ రుగ్మతల పట్ల సంపూర్ణ అవగాహన, ముందస్తు పరీక్షల నిర్వహణ, చికిత్స మార్గాల పరిజ్ఞానం, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించడానికి ప్రతి ఏట 25 మే రోజున ప్రపంచ థైరాయిడ్ దినం లేదా వరల్ థైరాయిడ్ డే పాటించడం ఆనవాయితీగా మారింది.

థైరాయిడ్ రుగ్మతల పట్ల సదస్సులు, ఉచిత థైరాయిడ్ క్యాంపులు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, థైరాయిడ్‌కు సంబంధించిన జాగ్రత్తలను వివరించడంతో వంటి పలు కార్యక్రమాలను ఈ వేదికగా చర్చిస్తారు. ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం–2026 ఇతివృత్తంగా థైరాయిడ్ మరియు పోషకాహారం అవగాహన అవసరం అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నా రు.

**థైరాయిడ్ రుగ్మతలకు కారణాలు, రోగ లక్షణాలు:**

శరీరంలో థైరాయిడ్ హార్మోన్లు సాధారణం కన్న తక్కువగా లేదా ఎక్కువగా స్రవించడం వల్ల థైరాయిడ్ రుగ్మతలు జనిస్తాయి. శరీరంలో అయోడిన్ లోపంతో గాయిటర్, థైరాయిడిటిస్, థైరాయిడ్ వాపు, క్యాన్సర్ కారక ట్యూమర్లు, జెనెటిక్ కారణాలు, ఆటోఇమ్యూన్ వ్యాధులు కలుగుతాయి. థైరాయిడ్ అతి చురుకుదనం వల్ల హైపర్ థైరాయిడిజమ్ రుగ్మత కలిగి చికాకు, అలసట, రుతుస్రావం తగ్గడం, మలబద్ధకం, చర్మం పొడిబారడం, కండరాల బలహీనత, చెమట పట్టడం, ఆకలి పెరగడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. థైరాయిడ్ చురుకుదనం తగ్గినపుడు హైపోథైరాయిడిజమ్ రుగ్మత కలిగి బరువు మారడం, ఒత్తిడి, అధిక రుతుస్రావం, మెడ వాపు, అలసిపోవడం, బలహీనత, కండరాల నొప్పి, వెంట్రుకలు ఊడిపోవడం, పొడి చర్మం దురద, ఏకాగ్రత లోపం లాంటి లక్షణాలు కలుగుతాయి.

**భారత్‌లో థైరాయిడ్ సమస్యలు – తీసుకోవలసిన జాగ్రత్తలు:**

థైరాయిడ్ రుగ్మతల భారం భారత్‌పై అధికంగా ఉండడం విచారకరం. మన దేశంలో దాదాపు 33 శాతం ప్రజలు రుగ్మతల వలయంలో చిక్కడం జరుగుతోంది. ప్రతి ఎనిమిది మందిలో ఒక్కరికి హైపోథైరాయిడిజమ్ రుగ్మత నమోదు అవుతున్నది. అయోడిన్‌లోపం కారణంగా 200 మిలియన్ల భారతీయులు గాయిటర్ రోగం బారిన పడుతున్నారు. అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో బుద్ధి మాంద్యం కూడా కలుగుతోంది. గర్భవతుల్లో థైరాయిడ్ సమస్యలు ఉత్పన్నం అయినపుడు తల్లికి, బిడ్డకు కూడా ప్రమాదం కావచ్చు.

ఈ ప్రత్యేక సందర్భాల్లో నెలలు నిండకముందే ప్రసవాలు లేదా అబార్షన్ పద్ధతులను ఆశ్రయించాల్సి వస్తుంది. పోషకాహారం తీసుకోవడం, తరుచుగా థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం, తగు వైద్య సలహాలు తీసుకోవడం, బరువు పెరగకుండా లేదా తగ్గకుండా చూసుకోవడం, విధిగా వ్యాయామం చేయడం, పాల ఉత్పత్తులు/చేపలు/గుడ్లు/బ్రెకోలి/నట్స్, బట్టర్/ఉల్లి/వెల్లుల్లి/బెర్రీస్/ఆంటీఆక్సిడెంట్లు ఉన్న ఆహారం లాంటివి అధికంగా తీసుకోవడం, అయోడిన్ లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి.

థైరాయిడ్ సమస్యలు పురుషుల్లో కన్న మహిళల్లో ఐదు రెట్లు అధికంగా కనిపిస్తాయి. థైరాయిడ్ రుగ్మతను నిర్ధారించడంలో ఆలస్యం అయితే సంతానలేమి, గుండె జబ్బులు, మానసిక రుగ్మతలు లాంటి ప్రమాదకర అనారోగ్యాలు కలుగుతాయి. థైరాయిడ్ రుగ్మతలకు దూరంగా ఉండడానికి కావలసిన జీవనశైలి మార్పులు చేసుకొని ఆయురారోగ్యాలతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

# 'బొద్దింక' దెబ్బతో అడ్డగోలు మాటలు



ఎం.కోటేశ్వరరావు

ఇప్పటి వరకు బొద్దింకలను చూసి కొంత మంది ఎలా భయపడతారో చూశాం గానీ ఇప్పుడు ఆ పేరును చూసి కళవళపడుతున్న రాజకీయ పార్టీలను చూస్తున్నాం. ఇలాంటి రోజు వస్తుందని ఎవరైనా ఊహించారా! ఫాసిజం మరోమా రు తలెత్తుతున్నదంటే హిట్లర్, ముస్సోలినీ, టోజో వంటి దుర్మార్గులే తిరిగి జన్మించారని కాదు. వారి వారసులు ప్రజాస్వామ్య వేషాలతో మన మధ్య తిరిగేవారే ఆపని చేస్తున్నారు. లేకపోతే బొద్దింకల జనతా పార్టీ (సిజెపి)ఎక్స్ ఖాతా నిలిపివేయటం ఏమిటి! దాని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఖరాబు చేశారు, చివరికి వెబ్‌సైట్‌లో ఇప్పుడు ఆ పేజీని కూడా కనపడకుండా చేశారు. అరచేతిని అడ్డపెట్టి సూర్యకాంతి ని ఎలా ఆపలేరో దీన్ని కూడా అంతే. ఇలాంటి చేష్టలతో యువతను మరింతగా రెచ్చగొట్టటం, సిజెపికి మద్దతుదార్లను పెంచటం తప్ప మరొకటి కాదు. ఇది నిరంకుశ చర్య అని ఉద్యమాన్ని ప్రారంభించిన అభిజిత్ డిప్కే వ్యాఖ్యానించాడు. సామాజిక ఉద్యమనినాదం రూపంలో ఉన్న ఆ పార్టీ ముందుకు తెచ్చిన ఐదు అంశాలు దేశంలో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేవిగా ఉన్నాయట, ఆ విషయాన్ని కేంద్ర ఇంటిలిజెన్స్ బ్యూరో (ఐబి) ప్రభుత్వానికి నివేదించిందట, దేశ రక్షణ కోసం సదరు సిజెపి సామాజిక మాధ్యమ ఎక్స్ ఖాతాను మోదీ సర్కార్ నిలిపివేయించిందట. నేపాల్లో అధికారంలో ఉన్న పార్టీ సామాజిక మాధ్యమాలపై విధించిన ఆంక్షలపై యువత ఎలా స్పందించిం దో, చివరికి అధికార మార్పిడికి దారితీయటాన్ని ప్రపంచం చూసింది. చరిత్రలో మోదీ మరొక పేజీకి నాంది పలికారా? భారత్‌లో నిషేధాలు, ఇతర చర్యలతో సిజెపి పేజీలను అడ్డుకోవచ్చు, కానీ విదేశాల్లో చేరే అనుచరులను మోదీ అడ్డుకోగలరా? ప్రపంచవ్యాపితంగా మోదీ పలుకుబడి గురించి బిజెపి గొప్పలు చెప్పుకుంటుంది. అలాంటి మోదీ పాలనలో యువత గురించి దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు, దేశంలో ఉన్న స్థితిగతుల గురించి విదేశాల్లో ఉన్నవారికి ఆసక్తి కలిగినట్లు ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. ఇదీ ఒకందుకు మంచిదే. మోదీ ప్రజాస్వామ్య బండారం ప్రపంచానికి తెలుస్తుంది. విమర్శకుల సంగతి సరే, మోదీని అభిమానించే వారందరూ మతోన్మాదులు లేదా మరొకరో అనుకోనవసరం లేదు. ప్రజాస్వామిక ప్రియులకు ఈ వార్త వీనుల విందుగా ఉందా? ఈ పరిణామాలను జీర్ణించుకోగలుగుతున్నారా!!

**సిజెపి ఎజండా**

ఇంతకూ సిజెపి తన అజెండాలో ప్రకటించిన అంశాలేమిటి? పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను రాజ్యసభకు పంపకూడదు, తొలగించిన ఓట్లకు గాను ఉపా చట్టం కింద కేంద్ర ఎన్నికల కమిషన్‌పై విచారణ, మహిళలకు 55శాతం రిజర్వేషన్లు, ఓట్ల తొలగింపును ఎన్నికల కమిషన్ నిర్ణీత వ్యవధిలో జరపాలి, భారతీయ యువతకు రాజకీయ విద్యగరపాలి. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిని దీర్ఘకాలం ఎన్నికల్లో పాల్గొననివ్వకూడదు. ఆసక్తి కలిగిన వారు ఆ పార్టీ వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తే లేదా వేరే రూపంలో తిరిగి ప్రారంభమైతే ఈ అంశాల మీద వారి వివరణను చదువుకోవచ్చు. ఈ అజెండాను ఎవరైనా అందరూ ఆమోదించాలనేమీ లేదు, అది వారికి ఉన్న హక్కు. అలాగే సమర్ధించటాని కీ హక్కు ఉంది. దానిలో రెచ్చగొట్టే అంశాలేమున్నాయి, వాటితో దేశ భద్రతకు వచ్చిన ముప్పేమిటి? కేంద్ర ప్రభుత్వం తలచుకుంటే ఏ నివేదిక కావాలంటే దాన్ని క్షణాల్లో తెప్పించుకోవచ్చు, ఇడి, ఐటి, సిబిఐతో పాటు దేశ భక్తిని గుత్తకు తీసుకున్నామని చెప్పేవారి దాడులు ఎవరిమీదైనా ఎప్పుడైనా జరగవచ్చు.

సిజెపి సృష్టికర్త అభిజిత్ దిప్కే గురించి టివి చర్చల్లో, సామాజిక మాధ్యమాల్లో బిజెపివారు ధ్వజమెత్తుతున్నారు. మూడు పదుల వయస్సున్న ఆ యువకుడి వెనుక బిజెపిని వ్యతిరేకించే అన్ని పార్టీలు, శక్తులు ఉన్నాయని, కుట్ర చేశాయని బిజెపి నేతలు దేశభక్తి గీతాలాపన ప్రారంభించారు. పందుగాడి దెబ్బ తగిలి మైండ్ బ్లాంక్ అయినవారు తప్ప మరొకరు ఇలా మాట్లాడరు. సిజెపి ఎక్స్ ఖాతాను అనుసరించేవారు కోట్లలో ఉండటంతో బిజెపి తట్టుకోలేకపోయింది. భారత్‌ను వ్యతిరేకించే దేశాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో అనుసరించుతున్నారని, వారంతా భారతీయులు కాదని ఇదం తా కుట్రలో భాగంగా జరుగుతోందని బిజెపి ప్రతినిధు లు టివి చర్చల్లో చెబుతున్నారు. తమ నేత, పార్టీకి విదేశాల్లో కూడా అనుచరులు పెద్దసంఖ్యలో ఉన్నారని కాషాయ నేతలు గొప్పలు చెప్పుకోవటాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. సామాజిక మాధ్యమ ఖాతా అంటే ఒక బ్యాంకు ఖాతా వంటిది కాదు. ప్రపంచంలో ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నవారెవరైనా ఎక్కడి నుంచైనా చేరవచ్చు. ఉచితం ఉన్నాయి, డబ్బు వసూలు చేసే వీ ఉన్నాయి. కుట్ర అంటే చేతి వేళ్లమీద లెక్కించదగిన వారు చేసేది తప్ప కోట్లాదిమంది భాగస్వాములు అవుతారా? మోడీ, బిజెపి, కాంగ్రెస్ సామాజిక మాధ్యమ ఖాతాను అనుసరించేవారిలో ఎక్కువమంది నకిలీలే అనే అభిప్రాయం ఉంది, గొప్పలు చెప్పుకొనేందుకు పార్టీలు, వ్యక్తులు అలాంటి చర్యలకు పాల్పడతారు. లోకోభిన్న రుచి అన్నట్లుగా సినిమాతారలు, ఇతర ప్రముఖులను అనుసరించేవారు పెద్ద సంఖ్యలో ఉండే సంగతి తెలిసిందే.

**సిజెపి ఒక వ్యంగాస్త్రం**

అసలు మే 15వ తేదీ ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వివాదాస్పద బొద్దింకలు, పరాన్న




జీవుల వ్యాఖ్యలు చేయటం, మరుసటి రోజునే అభిజిత్ బొద్దింకల జనతా పార్టీ అంటూ వ్యంగ్యాస్త్రంతో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టటం, లక్ష నుంచి కోట్ల సంఖ్యలో అనుచరులు చేరటం అంతా మూడు నాలుగు రోజుల్లోనే జరిగిపోయింది. బిజెపి వారు చెప్పేదాన్ని బట్టి కుట్ర ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలకు ముందే రూపొంది ఉండాలి. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేయటం కూడా కుట్రలో భాగం అయి ఉండాలి. లేకపోతే ఎలా సాధ్యం. ఒక నేత ఫలానా రోజు ఫలానా ప్రాంతం లో పర్యటిస్తారని ముందే ప్రకటిస్తారు గనుక తెలుస్తుంది తప్ప ఏమి సెలవిస్తారో ఊహించగలరా? ఆ రోజు ఫలానా కేసు విచారణకు వస్తుందని తెలియవచ్చు ప్రధాన న్యాయమూర్తి అలాంటి వివాదాస్పద మాటలు మాట్లాడతారని కుట్రదారులకు ముందే తెలుసా? బొద్దింకల జనతా పార్టీ పోస్టులను పెట్టగానే అనుచరులుగా మారండని కోట్లాదిమందికి ముందుగానే వర్తమానాలు పంపుతారా? ఆరోపణలు చేసే ముందు తర్కానికి అవి నిలిచేవి గా ఉండాలి. వారు చెప్పేదాని ప్రకారం సుప్రీం కోర్టు ప్రధాన న్యామూర్తి కూడా బిజెపి వ్యతిరేక కుట్రలో భాగమే అనుకోవాలి. నిజంగా కుట్ర జరిగిందని నమ్మితే కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపి నిజా నిజాలను నిగ్గుతేల్చాలి. ఆపని చేయలేదు. తాను అలాంటి వ్యాఖ్యలను యువతమొత్తాన్ని ఉద్దేశించి చేయలేదని ప్రధాన న్యాయమూర్తి వివరణ ఇచ్చుకున్నప్పటికీ ఎవరూ దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఆయన అంతరంగంలోంచి వచ్చిన అవాంఛనీయ వ్యాఖ్యలుగానే చూస్తున్నారు. ఎందుకంటే ఫిబ్రవరి నెలలో కార్మిక సంఘాలను కూడా ఆయన ఇదే విధంగా తూలనాడారు. ఇటీవలి కాలంలో హై కోర్టు, సుప్రీం కోర్టులలో అనేకమంది న్యాయమూర్తులు తీర్పులతో సంబంధం లేని వ్యాఖ్యలు చేస్తూ మీడియాలో సంచలనాలకు కారకులౌతున్నారు. గతంలో ఇలా ఉండేవారు కాదు. తాము నిరుద్యోగులుగా ఉన్నందున శారీరకంగా సోమరిపోతులం తప్ప మెదళ్లు పనిచేస్తూనే ఉన్నాయని కూడా సిజెపి వ్యంగ్యాస్త్రం విసిరింది. ఇది ఎంతమంది పెద్దలకు అర్థం అవుతుందో తెలియదు.

**హిందూత్వవాదుల వెర్రితనం**

సిజెపిని ముందుకు తెచ్చిన అభిజిత్ అమెరికాలో ఉండి ఇదంతా చేస్తున్నాడని, గతంలో ఆమ్ ఆద్మీపార్టీలో పనిచేశాడని బిజెపి నేతలు ధ్వజమెత్తుతున్నారు. ఎక్కడ ఉండి చేశారు, చేస్తున్నారని కాదు, ఏం చేశారనేదే ముఖ్యం. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ అమెరికాలో విద్యార్థిగా ఉండగానే రాజకీయాల్లోకి వచ్చారు. అక్కడే 1923లో అమెరికా హిందూస్థాన్ అసోసియేషన్ సభకు అధ్యక్షత వహించాడు. తరువాత ఆరేండ్లకు భారత్ వచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సంఘపరివార్ ఆరాధించే విడి సావర్కర్ లండన్‌లో చదువుకొనేందుకు వెళ్లి అక్కడ రాజకీయాల్లో పాల్గొన్నారు. ఇలా చెప్పుకుంటే ఎందరో. అభిజిత్ దిప్కే వయస్సు మూడు పదులు, 2023లో చదుకొనేందుకు అమెరికా వెళ్లాడు, అక్కడి నుంచే స్పందించాడు. తప్పేముంది, భారత్‌ను యావత్ ప్రపంచానికి విశ్వగురువుగా మారుస్తామని బిజెపి నేతలు చెబుతారు. ప్రపంచ కుగ్రామంలో అతను అమెరికా అనే పేటలో ఉండటం నేరం కాదు. అలా అనుకుంటే అనేకమంది అమెరికా, ఇతర దేశాల్లో ప్రవాస భారతీయులు హిందూ సంస్థలు, సంఘపరివార్ సంస్థలను ఏర్పాటుచేసి కోట్లాది డాలర్లను బిజెపికి అందిస్తున్నారు. వారంతా స్వదేశం వచ్చి ఆ పని చేయాలని బిజెపి వారు అడగటం లేదేం? దళితులు, రిజర్వేషన్ల సమస్యల గురించి ఒక నెటిజన్ అభిజిత్‌ను ప్రశ్నిస్తే తానే ఒక దళితుడనని చెప్పాడు. ఇంకేముంది ప్రతిభకు పట్టం గట్టటాన్ని వ్యతిరేకిస్తారని, దళితకార్డు వాడుకుంటున్నారంటూ కొందరు ధ్వజమెత్తుతున్నారు. బరాబర్ హిందూమతం కోసం పనిచేస్తాం, కరడు గట్టిన సనాతనవాదులం అంటూ వీరంగం వేస్తున్నమాదిరి అతను తన సామాజిక తరగతిని ముందుగా వెల్లడించలేదు. అన్నింటికీ మించి అతనేమీ రిజర్వేషన్ సౌకర్యంతో అమెరికా వెళ్లలేదు. తెలివితేటలు ఎవడబ్బ సొమ్ము కాదు, బలహీనవర్గాలకు తెలివితేటలు ఉండవా! స్వయంకృషితో ఎదిగిన అంబేద్కర్ జన్మించిన గడ్డమీద అభిజిత్ పుట్టాడు. ఒక మేధావి, సంస్కరణవాదిగా, మనుధర్మ వ్యతిరేకిగా అనేక మందికి అంబేద్కర్ స్ఫూర్తి ప్రదాతగా ఉన్నారు. దళితులను సామాజికంగా ఎలా వేధిస్తున్నారో నిత్యం చూస్తున్నాం, అలాంటి వారి భావజాల వారసులు ఇప్పుడు అభిజిత్‌ను కూడా అవమానించేందుకు పూనుకున్నారు. ఇది మనువాదులకు మరింతమంది వ్యతిరేకులను తయారు చేస్తుంది, తెలిసో తెలియకో వారిని అనుసరిస్తున్న దళితులు, అణచివేతకు గురైన గిరిజనులు, ఇతర బలహీనవర్గాలు కూడా తామెటు ఉండాలో నిర్ణయించుకొనేట్లు చేస్తుంది, ఇప్పటికిప్పుడు మార్పురాకపోవచ్చు, ఆలోచన మొదలైతే చాలు ఆచరణ ఎలా ఉండాలో తెలుస్తుంది. సిజెపిని వదలి బిజెపిలో చేరాలని లేకపోతే నీ తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నారో కూడా తెలుసు అంటూ బెదిరింపులు కూడా వచ్చాయి. ఇది అనూహ్యమేమీ కాదు. కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించటం, ప్రశ్నించటాన్ని దేశద్రోహంగా చిత్రించి దాడులు చేయటం తెలిసిందే, అభిజిత్ భారత్‌కు తిరిగి వస్తే అదే జరుగుతుందా? చూద్దాం!

బొద్దింకల జనతా పార్టీ ప్రస్తుతానికి సామాజిక మాధ్యమ ఉద్యమంలో భాగం తప్ప భౌతిక ఉనికిలో లేదు. పార్టీని నమోదు చేస్తారో లేదో తెలియదు. యువత మార్పును కోరుతున్నారు. సాంప్రదాయ పార్టీలు చేసిన మోసాలు, వాగ్దాన భంగాలతో విసిగిపోయి ఉన్నారు. తీవ్రమైన రాజకీయ, సామాజిక అంశాలను వ్యంగ్యంగా ముందుకు తెచ్చినట్లు కొందరు తప్పుపడుతున్నారు. పిల్లి నల్లదా తెల్లదా అని కాదు, ఎలుకలను పడుతుందా లేదా అన్నదే గీటురాయి. అందుకే ఇప్పటివరకు సినిమాలో పండుగాడి దెబ్బతో పోలిక బదులు ఇప్పుడు దేశవ్యాపితంగా రాజకీయంగా అభిషేక్ దెబ్బ గురించి చెప్పుకోవాల్సి వస్తోంది !

# సుప్రీంకోర్టు వ్యాఖ్యలు.. సామాజిక సమానత్వానికి కొత్త దిక్సూచి



వెంకగారి భూమయ్య
9848559863

భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ అనేది కేవలం ఒక చట్టపరమైన నిబంధన లేదా ప్రభుత్వ ఉద్యోగాల సాధన మాత్రమే కాదు. అది తరతరాలుగా సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా తీవ్ర అణచివేతకు, వివక్షకు గురైన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, సమాన అవకాశాలను కల్పించే ఒక గొప్ప సామాజిక సాధనం. రాజ్యాంగ నిర్మాతలు ఈ వ్యవస్థను ప్రవేశపెట్టినప్పుడు, సమాజంలో చిట్టచివరి వరుసలో నిలబడిన పేదవాడికి కూడా సమాన హోదా కల్పించాలనేది వారి పవిత్ర ఆశయం. దశాబ్దాలుగా ఈ రిజర్వేషన్ల సానుకూల ఫలితంగా దేశంలో ఎంతోమంది అట్టడుగు వర్గాల ప్రజలు ఉన్నత స్థానాలకు చేరుకున్నారు, సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అయితే, కాలక్రమేణా ఈ వ్యవస్థలో ఒక తీవ్రమైన లోపం అసమానత స్పష్టం గా కనిపిస్తోంది. రిజర్వేషన్ల ఫలాలు నిజంగా అందుకోవాల్సిన నిజమైన పేదలకు చేరడం లేదు. సమాజంలో ఒకసారి రిజర్వేషన్ల ద్వారా ఉన్నత స్థానానికి చేరుకున్న కుటుంబాలే, పదేపదే అదే ప్రయోజనాలను తరతరాలుగా అనుభవిస్తూ పోతున్నాయి. ఈ నేపథ్యంలోనే, 'తల్లిదండ్రులు ఐఏఎస్ అధికారులైతే వారి పిల్లలకు మళ్లీ రిజర్వేషన్లు అవసరమా?' అంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు సమాజంలో ఒక కొత్త మేధోమథనానికి తెరలేపాయి. ఈ వ్యాఖ్యలు కేవలం ఒక ప్రశ్న మాత్రమే కాదు, నిజమైన సామాజిక న్యాయాన్ని పునర్నిర్వచించే అద్భుతమైన మార్గదర్శి అని చెప్పవచ్చు.

**సామాజిక ఎదుగుదల తరువాత కూడా కోటా ఎంతవరకు సమంజసం :** ఒక వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తి తన స్వయం ప్రతిభతో లేదా మొదటి తరం రిజర్వేషన్ సహాయంతో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ సాధించినప్పుడు, లేదా గ్రూప్1, గ్రూప్2 వంటి ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడినప్పుడు, ఆ కుటుంబం ఒక్కసారిగా దేశంలోనే అత్యున్నత సామాజిక, ఆర్థిక స్థాయికి చేరుకుంటుంది. ఆ అధికారికి సమాజంలో విపరీతమైన గౌరవం లభిస్తుంది, అత్యుత్తమ ఆర్థిక భద్రత లభిస్తుంది, వారి పిల్లలకు నగరాల్లో ని అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్పొరేట్ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్య, వసతులు అందుబాటులోకి వస్తాయి. ఇటువంటి విలాసవంతమైన సదుపాయాలు, భోగభాగ్యాల మధ్య పెరిగిన ఒక ఐఏఎస్ లేదా ఐపీఎస్ అధికారి పిల్లల జీవనశైలి, మారుమూల గ్రామంలో సరైన కరెంట్ లేక, సరైన పాఠశాల లేక, కనీసం పుస్తకాలు కొనుక్కోవడానికి కూడా ఆర్థిక స్థోమత లేని ఒక సాధారణ పేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థి జీవనశైలి ఒక్కటే ఎలా అవుతుంది? ఉన్నతాధికారుల పిల్లలు అనుభవించే విలాసాలు, పొందే విద్యావకాశాలు వేరు, గ్రామాల్లోని పేదపిల్లల బతుకులు వేరు. ఇంతటి సామాజిక, ఆర్థిక వ్యత్యాసం స్పష్టంగా ఉన్నప్పుడు, మళ్లీ ఆ ఐఏఎస్ అధికారి పిల్లలు అదే రిజర్వేషన్ కోటా కింద పోటీ పడటం ఏ రకమైన న్యాయం అని సుప్రీం కోర్టు ప్రశ్నించడం వందకు వంద శాతం సమర్థనీయమైనది, సమాజానికి అవసరమైనది.

**క్రీమీలేయర్ పరిమితిని దాటేస్తున్న సంపన్న అలిగార్కీ**

రిజర్వేషన్ల వ్యవస్థలో 'క్రీమీలేయర్' అంటే ధనిక, ఉన్నత వర్గాల మినహాయింపు అనే భావనను ప్రవేశపెట్టడంలోని ముఖ్య ఉద్దేశం ఇదే. ఒక వర్గంలో బాగా స్థిరపడిన వారిని మినహాయించి, ఆ వర్గంలోని అసలైన పేదలకు ఆవకాశాలు ఇవ్వాలనేది దీని ప్రధాన లక్ష్యం. కానీ నేడు ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు, కోట్ల రూపాయల వ్యాపారాలు చేస్తున్నవారు, రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నవారు తమ పిల్లలకు కూడా అదే కోటాను వర్తింపజేస్తూ సమాజంలో ఒక కొత్త సంపన్న అలిగార్కీని (కొద్దిమంది చేతుల్లోనే అధికారం కేంద్రీకృతం కావడం) సృష్టిస్తున్నారు. దీనివల్ల రిజర్వేషన్ల వల్ల ఒకే వర్గంలోని కొన్ని వందల లేదా వేల కుటుంబాలు మాత్రమే నిరంతరం ప్రయోజనం పొందుతూ దేశంలోనే అత్యంత శక్తివంతమైన శక్తులుగా ఎదుగుతున్నాయి. అదే సమయంలో, అదే వర్గంలోని కోట్లాదిమంది గ్రామీణ పేదలు, శ్రామికులు, కాయకష్టం చేసుకునే కూలీలు దశాబ్దాలు గడుస్తున్నా ఇంకా ఆ అట్టడుగు స్థానంలోనే మగ్గిపోతున్నారు. సామాజిక పురోగతి సాధించిన తర్వాత కూడా ఒక కుటుంబం పదేపదే కోటా ప్రయోజనాలపైనే ఆధారపడితే, క్రీమీలేయర్ అనే సూత్రానికి పూర్తిగా అర్థం లేకుండా పోతుంది.

**రాజకీయ హోదా, సంపద ముసుగులో కోటా దోపిడీ**

కేవలం ప్రభుత్వ అధికారుల పిల్లలు మాత్రమే కాదు, సమాజంలో అత్యున్నత రాజకీయ పదవులు అనుభవిస్తున్న నాయకుల పిల్లలకు కూడా నేడు రిజర్వేషన్ల రక్షణ లభిస్తోంది. మంత్రులుగా, ప్రజాప్రతినిధులుగా ఉంటూ కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉండి, సమాజంలో అగ్రభాగాన నిలిచే రాజకీయ నాయకుల పిల్లలు రిజర్వేషన్ల ద్వారా సులువుగా అవకాశాలను దక్కించుకోవడం అత్యంత విచారకరం. అధికారం, హోదా, ఆర్థిక బలం అన్నీ ఉన్న వీరు సమాజంలో అణచివేతకు గురైనట్లు ఎలా భావిస్తారు? వీరు రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతిసారీ, ఒక నిజమైన పేద విద్యార్థి లేదా నిరుద్యోగి యొక్క ఉపాధి అవకాశం, ఒక కుటుంబపు భవిష్యత్తు శాశ్వతంగా అంధకారంలోకి నెట్టబడుతోంది.

**నిజమైన అట్టడుగు వర్గాలకు న్యాయం జరిగే మార్గం:** రిజర్వేషన్లు అనేవి ఒక నిర్దిష్ట కుటుంబానికి ఇచ్చే శాశ్వత వారసత్వ హక్కు కాదు. అవి సమాజంలోని అసమానతలను తొలగించడానికి, వివక్షను అణచివేయడానికి రాజ్యాంగం అందించిన ఒక తాత్కాలిక చికిత్స మాత్రమే. రోగికి జబ్బు నయమైన తర్వాత కూడా మందులు ఇస్తూ పోతే అది ఎలా ప్రమాదకరమో, ఒక కుటుంబం సామాజికంగా, ఆర్థికంగా స్థిరపడిన తర్వాత కూడా కోటాను కొనసాగిస్తే అది సమాజ ఆరోగ్యానికే ప్రమాదకరం.

సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు రిజర్వేషన్ల వ్యవస్థను బలహీనపరచడానికి చేసినవి కావు, దాన్ని మరింత పటిష్టం చేసి అసలైన అర్హులకు చేర్చడానికి ఉద్దేశించినవి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకు రాజకీయ లబ్ధిని పక్కనపెట్టి, దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన సూచనలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్థికంగా బాగా స్థిరపడిన వారి పిల్లలను రిజర్వేషన్ల పరిధి నుంచి మినహాయించేలా స్పష్టమైన, కఠినమైన విధి విధానాలను రూపొందించాలి. అప్పుడే గ్రామీణ ప్రాంతాల్లోని, అట్టడుగు వర్గాల్లోని నిజమైన పేద ప్రజలకు, వికలాంగులకు, వృద్ధులకు, వితంతువుల కుటుంబాల పిల్లలకు నిజమైన సామాజిక న్యాయం అందుతుంది. సమాజంలో సమతుల్యత ఏర్పడాలన్నా, రాజ్యాంగ నిర్మాతల కలలు నిజం కావాలన్నా సుప్రీంకోర్టు నిలదీసిన ఈ ప్రశ్నకు చట్టబద్ధమైన సమాధానం దొరకడం అత్యంత ఆవశ్యకం.

### అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో

# మహిళా శక్తి సూపర్ బజార్లు

- సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి
- సచివాలయం నుంచి 8 వేల స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళల ఆర్థిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా ఎదగడానికి అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభించడానికి వీలుగా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లతో పాటు మహిళలు వ్యాపార రంగంలో మరింతగా రాణించడానికి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బ్యాంకుల నుంచి వీటికి అవసరమైన రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం సందర్భంగా నిర్వహిస్తున్న 'మహిళా వారోత్సవాల'లో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి 8 వేల స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి, సిఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఎంఎల్‌ఎలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మహిళలకు అందించే ఇందిరమ్మ చీరల డిజైన్లను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. దేశంలో ఒకేసారి 8 వేల భవనాలకు శంకుస్థాపన చేయడం సంచలనాత్మక నిర్ణయమని సిఎం చెప్పారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలు సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవడానికి మొదటి విడతగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం అవసరమైన స్థలం గుర్తించి మహిళా సంఘాలకు నామినల్ అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజు పైన ఇవ్వడానికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సిఎం చెప్పారు. ఈ సూపర్ బజార్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కార్పస్ ఫండ్ ఇస్తామని, సంఘాల్లోని ప్రతి మహిళ కొంత మేరకు పెట్టుబడిని సమకూర్చుకోవాలని సూచించారు. కార్పొరేట్ కంపెనీలు నడిపిస్తున్న చైన్ సూపర్ బజార్లలో వస్తువులను అత్యధికంగా కొనుగోలు చేసేది మహిళలేనని, నిత్యవసర వస్తువులు, అత్యవసర వస్తువులు ఏవైనా నాణ్యమైన వస్తువులు కొనాలంటే మహిళా శక్తి బజార్లలో కొనాలనే విధంగా బ్రాండ్ ఇమేజీని సాధించాలని, దేశంలోనే అత్యుత్తమ సూపర్ బజార్లుగా రాణించాలని అభిలాషించారు. అందుకు ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. 'రైస్ మిల్లులను స్వయంగా మీరే పెట్టుకోండి. అదే విధంగా లాజిస్టిక్ సెంటర్లను కట్టుకోండి. వాటిని ఆడబిడ్డలకు ఇవ్వడం ద్వారా జవాబుదారీతనంగా ఉంటారు. భవిష్యత్‌లో ప్రతి మండలంలో పెద్ద పెద్ద గోడౌన్లు కట్టడం ద్వారా ధాన్యం వాటిల్లో భద్రపరుస్తాం. మహిళల దగ్గర నుండే మిల్లర్లు తీసుకెళ్లాలి. ప్రతి మండలంలో 2 నుండి 4 స్థలాలను గుర్తించి గోడౌన్లు నిర్మించుకోవడానికి ఏ విధమైన ప్రణాళిక అవసరమో కలెక్టర్లు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశిస్తున్నా. అందుకు అవసరమైన స్థలాలు ఇచ్చే పూచీ నాది. ఇందుకు అవసరమైన రుణాలను జీరో వడ్డీతో బ్యాంక్ లింకేజీ కూడా సహకారం ఇస్తాం' అని సిఎం అన్నారు. మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కేటాయించి తద్వారా అద్దె రూపేణా నెలకు రూ. 70 వేల ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు వేశామని, అందులో భాగంగా జూన్ 5న తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి మరో 553 బస్సులను అందించనున్నామని సిఎం ప్రకటించారు. ఆడబిడ్డలకు బ్యాంకు రుణాల లింకేజీ ఇవ్వడమే కాకుండా, వ్యాపారంలో రాణించడానికి, కావాల్సిన వ్యాపారాలు వారి వృద్ధి చేసుకోవడానికి వీలుగా ఈ నెల 29న వివిధ ద్వారా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ కింద అవసరమైన వ్యాపారాల ప్రణాళికలను అందించే కార్యక్రమం చేపడుతున్నాం. అన్ని జిల్లాల నుంచి కలెక్టర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన జిల్లాల మహిళా ప్రతినిధులతో సిఎం ముఖాముఖి మాట్లాడారు. నారాయణపేట మహిళా సమాఖ్య సభ్యులు పెట్రోల్ బంక్ ద్వారా తాము ఇప్పటివరకు దాదాపు 27 లక్షల సంపాదించామని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. వ్యవసాయ రంగంలో అధిక లాభాలను ఆర్జించిపెట్టే పంటల మార్పిడి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

### ఆగస్టు 15లోగా యాతాలకుంట

# టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు చేరాలి
- డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ఏటూరు నాగారం నుంచి పాపికొండల వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ జలాలను వినియోగించు కోలేకపోయామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఖమ్మం సరిహద్దుల వరకు వచ్చినా సిల్ట్ సమస్యలు, ఇతర ప్రాంతాల ఆయకట్టు కారణంగా జిల్లాకు నీరు అందలేదని అన్నారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ కొంత మేర ఉపశమనం ఇచ్చినా, ఖమ్మం జిల్లా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో గోదావరి జలాలను వినియోగించు కోవాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ మాత్రమే మార్గమని తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరుతూ పోరాడానని పేర్కొన్నారు. 1997–98లో నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం రైట్ లైన్ కెనాల్ వరకు లిఫ్ట్ పనులను రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేశామని, అదే సమయంలో దేవాదుల, దుమ్ముగూడెం లిఫ్ట్ ప్రాజెక్టులను ప్రతిపాదించామని తెలిపారు. నిధుల కొరత కారణంగా అప్పట్లో దేవాదుల ప్రాజెక్ట్ మాత్రమే ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో తీసుకువచ్చారని, రాష్ట్ర విభజన అనంతరం ఇందిరాసాగర్ హెడ్‌వర్క్స్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో పాటు అవసరమైన అనుమతులు కూడా లేకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి దుమ్ముగూడెం ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, ఈ ప్రాంతానికి శ్రీ సీతారాములతో ఉన్న అనుబంధం కారణంగా దీనికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టామని తెలిపారు. 2016లో 13 వేల కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పనులు చాలా నెమ్మదిగా సాగాయని అన్నారు. 100 కిలోమీటర్ల ప్రధాన కాలువ, మూడు పంప్ హౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగుతున్నాయని, వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీకి సూచించారు. భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని, ప్రాజెక్ట్ కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, యాతాలకుంట టన్నెల్ లైనింగ్ అనంతరం జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం అవుతాయని అన్నారు. భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు పూర్తి చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు స్థానిక ఎమ్మెల్యేలు, రైతుల సహకారంపైనే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. గోదావరి జలాలు అందితే ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా పెరుగుతుందని, రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు తక్కువ నీరు సరిపోతుందని, ఒక ఎకరం వరి సాగు నీటితో ఐదు ఎకరాల ఆయిల్‌పామ్ సాగు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వరి సాగులో ఎరువులు, మార్కెటింగ్, అకాల వర్షాలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు.దేశంలో ప్రతి పంటను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, వరి, మొక్కజొన్న, జొన్నలు, సన్‌ఫ్లవర్ వంటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నా యని విమర్శించారు. డీజిల్ సరఫరా, హమాలీల కొరత, గన్నీ బ్యాగుల సరఫరా తగ్గినా తెలంగాణ దేశంలో అత్యధిక ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటిస్తోందే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు ఉపయోగించు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిరుపేదలు, భూమిలేని దళితులకు జీవనాధారంగా ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహా డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులకు ఇప్పటికీ పూర్తి యాజమాన్య హక్కులను కల్పించకపోవడం అన్యాయమన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం కె.ఏసురత్నం అధ్యక్షతన దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సమావేశం జరిగింది. సమావేశంలో బాలనరసింహా మాట్లాడుతూ దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూమిని సాగు చేస్తున్నప్పటికీ అమ్మకం, రుణాలు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఆంక్షలు ఉండటంతో వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడటం లేదన్నారు. అసైన్డ్ భూములను రక్షించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులు, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం పేదల భూములను లాక్కోవడానికి ప్రయత్నించడం ఆందోళనకరమని, భూమిపై పూర్తి హక్కు లేకపోవడం వల్ల దళితులు, బలహీనవర్గాలు నిరంతరం అభద్రత పరిస్థితుల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రత్యేక చట్టపరమైన రక్షణలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దళితుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రకటించిన అంబేద్కర్ దళిత బంధు పథకాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాజకీయ ప్రచార కార్యక్రమాలకే పరిమితం కాకుండా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, దళితుల భూమి హక్కులు, ఆర్థిక హక్కులు పరిరక్షించకుండా సామాజిక న్యాయం సాధ్యంకాదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించడంతో పాటు అంబేద్కర్ దళితబంధు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు బేరర్స్ బోయిని అశోక్, ఆరుట్ల రాజ్‌కుమార్, కె.రత్నకుమారి, దేవి పోచన్న, పొనగంటి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలతో బిజెపి మోసం

- పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతు వ్యతిరేక విధానాలతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడంతో పాటు తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో రైతులపై సాగు వ్యయం భారీగా పెరిగిందని, ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా ఖర్చులు అన్నీ పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు రూ.లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, రైతులకు మాత్రం నయా పైస రుణమాఫీ చేయకపోవడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. ప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు రైతు ఘోస బిజెపి భరోసా పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా అని చమత్కరించారు. వ్యవసాయ చట్టాల పేరుతో దేశవ్యాప్తంగా రైతులను ఇబ్బందులకు గురిచేసి, 700 మందికి పైగా రైతుల ప్రాణాలు పోయే పరిస్థితి తీసుకొచ్చిన బిజెపి ఇప్పుడు రైతులకు భరోసా ఇస్తామని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 53.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, కానీ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## ధరల నియంత్రణలో బిజెపి విఫలం

- పదేపదే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కార్పొరేట్లకు అండగా మోడీ
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం పదేపదే ప్రజలపై భారాలు మోపుతున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 12 రోజుల వ్యవధిలో రూ.8ల వరకు పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. భారతదేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున భారాలు మోపిన ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమేనని తెలిపారు. ధరల నియంత్రణలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలం అయిందని పేర్కొన్నారు. పదేపదే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి కార్పొరేట్‌లకు మోడీ అండగా నిలుస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే కేవలం వాహనాలు నడిపేవారే నష్టపోరని, అది ప్రజల దైనందిన బడ్జెట్‌ను నేరుగా దెబ్బ తీస్తుందని తెలిపారు. లారీలు, రవాణా వాహనాల ఖర్చులు పెరుగుతాయని, దీనివల్ల కూరగాయలు, పాలు, పప్పులు, మందులు వంటి అన్ని నిత్యావసర వస్తువుల ధరలు ఆటోమేటిక్‌గా పెరిగిపోతాయని తెలిపారు. అలాగే వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని, మన దేశంలో వ్యవసాయం చాలా వరకు డీజిల్ ఇంజన్లు, ట్రాక్టర్లపై ఆధారపడి ఉందని, డిజిల్ ధరలు పెరిగితే రైతులకు పెట్టుబడి ఖర్చు భారీగా పెరుగుతుందని, ఇది దేశ ఆహార భద్రతకే ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని చెబుతూనే ప్రజలపై పెను భారాలు మోపుతున్నారని, భారాలు బిజెపి ప్రభుత్వాన్ని, ఆ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

## ఎసిబికి పట్టుబడ్డ ఇరిగేషన్ డిఇ

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండలో ఎసిబి అధికారులకు సోమవారం ఇరిగేషన్ డీఈ పట్టుబడ్డాడు. జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీఈ శ్రీకాంత్‌ను ఎసిబి అధికారులు పట్టుకున్నారు. హనుమకొండ నగరం భవానీ నగర్‌లోని తన ఇంట్లో రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు శ్రీకాంత్ ను పట్టుకున్నారు. అధికారిక పనుల కోసం లంచం తీసుకుంటున్న సమయంలో దాడి చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎసిబి డీఎస్పీ పసునూరి సాంబయ్య తెలిపారు. కాగా ఇటీవల కాలంలో వరుసగా ఏసీబీ అధికారులు అవినీతి అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. అయినప్పటికీ లంచము తీసుకునే అవినీతి పని తీరు మారడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత సంవత్సరం కాలంపైగా ప్రతి వారం ఏదో ఒక చోట అవినీతి అధికారులు పట్టుబడుతుండడం సంచలనం సృష్టిస్తున్నది.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిఎం అనుచరుడు శ్రీరామ్‌రెడ్డికి సిట్ నోటీసులు?

- దర్యాప్తులో కీలక మలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో రాజకీయంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మరో కీలక దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా సిఎం రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా ప్రచారంలో ఉన్న శ్రీరామ్ రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే దీనిపై సిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దర్యాప్తు అధికారులు ఇప్పటివరకు సేకరించిన సమాచారం, పలు వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా వివిధ వ్యక్తుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కేసుకు సంబంధించి సమాచారం ఉన్న వ్యక్తులను విచారణకు పిలిచి వివరణలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో పలువురు మాజీ అధికారులు, రాజకీయ నాయకులు, కీలక వ్యక్తులను సిట్ ప్రశ్నించింది. గతంలో మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లకు కూడా నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించింది. ఈ కేసు కేంద్రంగా ఉన్న ఆరోపణల ప్రకారం గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లపై అక్రమ నిఘా జరిగిందా అనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. సిట్ ఇప్పటివరకు పలువురు పోలీసు అధికారులను కేసులో నిందితులుగా చేర్చి విచారణను ముందుకు తీసుకెళ్తోంది. అయితే ఇప్పటివరకు ఏ రాజకీయ నాయకుడినీ అధికారికంగా నిందితుడిగా ప్రకటించలేదని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. శ్రీరామ్ రెడ్డి అంశంపై అధికారిక ధృవీకరణ వెలువడితే కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

### సొంత చెల్లి, బావ ఫోన్లు ట్యాప్ చేసిన కెటిఆర్‌కు..

## ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సొంత చెల్లి, బావ ఫోన్లను కూడా ట్యాప్ చేసిన వ్యక్తికి ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి ఎక్స్ వేదికగా స్పందించారు. ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, అదే విధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు లేని గ్రామాల్లో బిఆర్ఎస్ కూడా ఓట్లు అడగకూడదని కెటిఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు పొందిన కుటుంబాలను అడిగితే తెలుస్తుందన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉంటే ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయి? అని కెటిఆర్‌పై విమర్శలు గుప్పించారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి వెల్లడించారు. అలాగే హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్‌లలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు ఓడించారని, లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ వంటి స్థానాల్లో కూడా బిఆర్ఎస్ పరాజయం పాలైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు పూర్తిగా వీడ్కోలు పలకడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

## ఖాజా మొయిజుద్దీన్ మరణంతో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ ఉద్యమం ఆగిపోదు

- సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని కఠినంగా దర్యాప్తు జరపాలని, అవసరమైతే నిష్పాక్షిక న్యాయ పర్యవేక్షణలో విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు దారి మళ్లకుండా చూసి నిందితులకు చట్టప్రకారం కఠినశిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అజీజ్ పాషా విజ్ఞప్తి చేశారు. ఖాజా మొయిజుద్దీన్ మరణంతో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ ఉద్యమం ఆగిపోదని, ఆయన ఆలోచనలు మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ ఆస్తులు, ముఖ్యంగా విద్యాసంస్థలకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అని అజీజ్‌పాషా తెలిపారు. కొందరు స్వార్థప్రయోజన వర్గాలు ఆ ఆస్తులను ఏ విధంగానైనా స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించాయని, ఆ క్రమం లో ఆయనను అడ్డంకిగా భావించి కుట్ర పూరితంగా ఈ దారుణానికి పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అజీజ్‌పాషా పేర్కొన్నారు. భవిష్యత్తులో తనపై దాడి జరిగే అవకాశం ఉందని భావించి ఆయన రివాల్వర్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అది తిరస్కరించబడిందని తెలిపారు. సమాజంలో కొందరు వ్యక్తులు ఒకవైపు సంతాపం వ్యక్తం చేస్తూనే మరోవైపు అనుమానాస్పద పాత్రలు పోషించే అవకాశాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

**హత్య దారుణం: ఐఎఎల్ అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్**
హైదరాబాద్‌లో ఖాజా మొహినుద్దీన్ అనే న్యాయవాదిని రెక్కీ నిర్వహించి దారుణంగా హత్య చేయడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఇటీవల కాలంలో మహిళా న్యాయవాదులతో సహా అనేకమందిని హతమార్చడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశమని ఆయన పేర్కొన్నారు. న్యాయవాది వృత్తి లో వృత్తి ధర్మాన్ని పాటిస్తూ కక్ష దారుల ఆస్తుల రక్షణకు తమ వంతు కర్తవ్యం నిర్వహించడం బాధ్యతాయుతమైన పని అని వారన్నారు. ప్రతివాదులు కక్షగట్టి హత్యలకు, దాడులకు పాల్పడడం పౌర సమాజంలో ప్రమాదానికి సంకేతమన్నారు. అదేవిధంగా ఇటీవల తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన న్యాయవాదుల రక్షణ బిల్లును గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టడం భావ్యం కాదని, తక్షణమే ఆ బిల్లును ఆమోదించి చట్టరూపం తీసుకురావాలని, ఇందుకు గవర్నర్ ఆ బిల్లుకు ఆమోదముద్ర వేయాలని బొమ్మగాని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వరరావు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెబుతున్నా కొందరు రాజకీయ నాయకులు ఆయనపై పెట్టిన కేసులు విరమించుకోకపోవడం సరికాదని, వెంటనే వాటిని ఉపసహరించుకోవాలన్నారు.

## ఎవరెస్ట్ అధిరోహించి దిగే క్రమంలో హైదరాబాదీ మృతి

- హిందూపూర్‌కు చెందిన వ్యక్తి కూడా దుర్మరణం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎవరెస్ట్ శిఖరం అధిరోహించి దిగే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వీరిని హైదరాబాద్‌కు చెందిన ఐటి నిపుణుడు అరుణ్ కుమార్ తివారి (53), అమెరికాలోని ఫీనిక్స్‌లో పనిచేస్తున్న హిందూపూర్‌కు చెందిన సందీప్ ఆరే (46)గా గుర్తించారు. వీరిద్దరు ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన తర్వాత దిగివస్తూ వేర్వేరు ఘటనల్లో మరణించారు. నేపాల్‌లోని ఎత్తైన ప్రాంతాల నుంచి మృతదేహాల తరలింపు వాతావరణం, హెలికాప్టర్ అనుమతులు, రక్షణ బృందాల ప్రక్రియ ఆలస్యం కావడంతో మృతదేహాలను ఇంకా తరలించలేదు. వీరి మృతదేహాలు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, ఇస్నాపూర్.**
సంగారెడ్డి జిల్లా

E1/IMP/ENGG/02/2026 | ఆసక్తి వ్యక్తీకరణ | తేది: 25.05.2026

ఇస్నాపూర్ మున్సిపాలిటీ, కింది పనుల కోసం వ్యక్తిగత కన్సల్టెంట్లు / ఏజెన్సీలు / సంస్థల నుండి ప్రతిపాదనల కొరకు ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించడమైనది: **1. గ్రామం అంతటా ఉన్న బోర్‌వెల్ పాయింట్ల సర్వేయింగ్‌ను ఆటో లెవెల్, టోటల్ స్టేషన్, (డిజిటల్ సర్వే) డిజిపిఎస్ ఉపయోగించి నిర్వహించాలి. సర్వే చేసిన పాయింట్ల ఆధారంగా వివరణాత్మక మ్యాప్‌లు, రూట్ మ్యాప్‌లు, బోర్‌వెల్ వివరాలు మరియు రోడ్ నెట్‌వర్క్ డేటా తయారు చేసి, డ్రాయింగ్‌లు మొదలైనవి అందించాలి. 2. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) చేయడం. 3. డ్రైనేజీ కోసం డిజిటల్ లెవెల్స్.** వీటిని తయారు చేయడంలో అనుభవం ఉన్న ఆసక్తిగల పార్టీలు, టెండర్ ప్రతిపాదనకు అర్హత సాధించడానికి, 1. కవరింగ్ లెటర్, 2. పాన్ కార్డ్, జీఎస్టి 3. ఇస్నాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ పేరిట 12,500.00 ఇఎండిని వేర్వేరు కవర్లలో సమర్పించాలి.
కన్సల్టెంట్లు / సంస్థలు తమ సంబంధిత అనుభవ పత్రాలు మరియు అన్ని ఇతర పత్రాలు 29.05.2026 తేదీన ఉదయం 11.00 గంటలలోపు సమర్పించాలి. అదే రోజు ఉదయం 11.30 గంటలకు దీనిని తెరవడం జరుగుతుంది. వివరణాత్మక విధివిధానాలు మరియు ఆర్థిక బిడ్ ఫార్మాట్‌ను ఆసక్తిగల పార్టీలకు అభ్యర్థన మేరకు అందజేయడం జరుగుతుంది. మరిన్ని వివరాల కోసం కార్యాలయ వేళల్లో మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించవచ్చు.

స్థలం: ఇస్నాపూర్
సం/- కమిషనర్
ఇస్నాపూర్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 2979-PP/CL/ADVT/2026-27, Date: 25-05-2026



## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్ రాజర్షిషా

ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ : ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం అధికారుల ప్రధాన కర్తవ్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై మొత్తం 91 ఫిర్యాదులు అందాయి. అనంతరం అధికారులతో సమీక్షిస్తూ ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని ఆదేశించారు. పదే పదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు మూడు రోజుల్లోనే ముగించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, చిత్రు, డీఆర్ఓ స్రవంతి, డీఆర్‌డీవో రవీందర్ పాల్గొన్నారు.

## రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ : రిమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం వల్ల రిమ్స్ కార్మికులకు కనీస వేతనాలు, ప్రమోషన్లలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా 421 మంది కార్మికులకు రావాల్సిన రూ.5 కోట్ల జీతాల బకాయిలను కాంట్రాక్టర్ డిపాజిట్ జప్తు చేసి అయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎఐటియుసిజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, రిమ్స్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.



## మాగి గ్రామంలో కుస్తీ పోటీలు

ప్రజాపక్షం/నిజాంసాగర్ : నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో గ్రామదేవత అయిన ముత్యాల పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుమిత్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించగా సరిహద్దులో ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుండి మల్ల యోధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుస్తీపోటీల్లో తలపడ్డారు. ఈ కుస్తీ పోటీలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గెలుపొందిన మల్లయోధులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్, ఎస్సై శివకుమార్, మెంగారం శ్రీనివాస్, బాల సాయిలు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా బీరప్ప కల్యాణోత్సవం

ప్రజాపక్షం/కోటగిరి : పోతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో అంగరంగ వైభవంగా కురుమల ఆరాధ్యదైవం భీరప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవం, కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ఆశీర్వాదం తీసుకుని, మొక్కులు చెల్లించున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, మాజీ జడ్పీటిసి పుప్పాల శంకర్, ఎజాస్‌ఖాన్, కుర్మ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## రైతన్నకు భరోసాగా 'అల్లోల'

ప్రజాపక్షం/నిర్మల్ : ఉండల మండుతున్నాయి, ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి, అయినప్పటికీ రైతు కష్టాన్ని దగ్గరుండి తెలుసుకోవాలనే తపనతో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, నియోజకవర్గ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా రైతుల పక్షాన నిలబడటమే తన బాధ్యత అన్నట్టుగా గ్రామ గ్రామానికి తిరుగుతూ రైతులతో మాట్లాడుతున్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అక్కడ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ళలో ఎక్కడా ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతుల పట్ల ఆయన చూపుతున్న చొరవతో కొనుగోలు కేంద్రాల వద్ద అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమైందని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురిసేలోపు ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలన్నా లక్ష్యంతో అల్లోల చేస్తున్న పర్యటనలు రైతులో కొత్త నమ్మకాన్ని నింపుతున్నాయి.

## పిఎఫ్ డబ్బులు కాజేశారంటూ మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాపక్షం/రామాయంపేట : మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య కార్మికుల పించన్ డబ్బులు కాజేశారని ఆరోపిస్తూ సోమవారం మున్సిపాలిటీలో ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో కార్మికులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్బంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ గత 9నెలలుగా పించన్ డబ్బులు కట్ చేస్తున్నప్పటికీ జమ చేయడంలేదన్నారు. ప్రతినెలా 2వేల రూపాయలు ఒక్కో కార్మికుని నుండి తీసుకుంటున్నారని, వాటికి మరో 2వేలు మున్సిపాలిటీ నుండి జమ చేయాల్సి ఉండగా చేయడంలేదన్నారు. మున్సిపల్ మేనేజర్ రఘువరణ్ రెండు రోజుల్లో కార్మికులకు రావాల్సిన పించన్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసన దీక్షను విరమించారు.

# కొనుగోలు కేంద్రాల్లో కష్టాల క్యూలు

లారీల జాప్యంతో వడ్ల కుప్పల వద్దే రైతన్నల నిరీక్షణ

ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల దుస్థితి రోజు రోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. పంటను ప్రభుత్వానికి విక్రయించేందుకు ఆశగా కేంద్రాలకు చేరుకుంటున్న అన్నదాతలు, టోకెన్ల కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్నారు. అయితే గంటల తరబడి ఎండలో నిలబడలేని పరిస్థితుల్లో రైతులు తమ వంతు కోల్పోకుండా ఉండేందుకు చెప్పులు, ప్లాస్టిక్ కవర్లు, సంచులు, ఇటుకలను వరుసగా పెట్టి సమీపంలోని చెట్ల నీడలో వేచి ఉండటం కొనుగోలు కేంద్రాల వద్ద కనిపిస్తున్న సాధారణ దృశ్యంగా మారింది. ఉదయం నుంచే కేంద్రాలకు చేరుకున్న రైతులకు సిబ్బంది ఎప్పుడు వస్తారో, టోకెన్లు ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేక పోవడంతో తీవ్ర అసహనం వ్యక్తమవుతుఓంది. కొనుగోలు ప్రక్రియలో నెలకొన్న గందరగోళంతో రైతులు గంటల తరబడి కేంద్రాల వద్దే నిరీక్షించాల్సి వస్తోంది. ఇప్పటికే పంట సాగులో పెట్టుబడులతో నలిగిపోయిన రైతులకు ఈ పరిస్థితి మరింత భారంగా మారింది. మరో వైపు జిల్లా వ్యాప్తంగా అనేక కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పలు రోజుల తరబడి అలాగే ఉండిపోతున్నాయి. లారీలు సకాలంలో అందుబాటులోకి రాకపోవడంతో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంది. వర్షాలు పడితే పంట తడిసిపోతుందన్న భయంతో రైతులు తార్పలిన్లు అద్దెకు తెచ్చుకుని ధాన్యాన్ని కాపాడుకోవాల్సి వస్తోంది. ప్రతీరోజు అద్దెల రూపంలో అదనపు ఖర్చులు భరించాల్సి రావడంతో రైతన్నల జేబుపై మరింత భారం పడుతోంది. పంట పండించడం ఒక కష్టం అయితే, కొనుగోలు కేంద్రాల వద్ద దానిని అమ్ముకునే వరకు మరో యుద్ధమే ఎదురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోకెన్ వ్యవస్థలో అస్తవ్యస్థ సిబ్బంది కొరత, లారీల కొరత కారణంగా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్ళను వేగవంతం చేయాలని, కేంద్రాల వద్ద సిబ్బంది, లారీలను ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.



## లారీలు రావడం లేదని రైతుల రాస్తారోకో

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు తమ గ్రామానికి లారీలు రాక కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం ఎక్కడికక్కడే నిలిచిపోయిందని రైతులు మండల కేంద్రమైన శివ్వంపేటలోని పీఏసీఎస్ కార్యాలయం ముందు ప్రధానరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తమ గ్రామానికి లారీలు రావడం లేదని పీఏసీఎస్ సీఈఓ మధుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని, వర్షం వస్తే తమ ధాన్యం పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. పీఏసీఎస్ సీఈఓ మధు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి లారీలు పంపించి ధాన్యాన్ని తరలించేందుకు లారీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి ఎస్ఐ మధుకర్‌రెడ్డి చేరుకొని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

## ఉత్కంఠగా ఫుట్‌బాల్ టోర్నమెంట్



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ పట్టణంలోని అవుట్‌డోర్ స్టేడియంలో అంతర్జాతీయ ఫుట్బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఘనంగా ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో మాసాయిపేట, మెదక్ రూరల్, వెస్లీ ఫుట్ బాల్‌క్లబ్, మెదక్ ఫుట్ బాల్ క్లబ్ జట్లు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాయి. టోర్నమెంట్ లో మెదక్ ఫుట్ బాల్ క్లబ్ జట్లు ఫైనల్స్‌కు చేరగా, ఉత్కంఠభరితంగా సాగిన తుది పోటీలో మెదక్ ఫుట్ బాల్ క్లబ్ జట్టు 20 గోల్స్ తేడాతో విజయం సాధించి కప్పును కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా జిల్లాలో ఫుట్ బాల్ అభివృద్ధికి కృషి చేసున్నామని తెలిపారు. లక్ష్య ఫౌండేషన్ సహకారంతో బాలికలకు ప్రతిరోజూ ఫుట్ బాల్ శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర అండర్ 17 విభాగంలో నల్లగొండలో జరిగిన పోటీల్లో మూడో స్థానం, బాలికల అండర్14 విభాగంలో వికారాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గోపాల్ గౌడ్, బాలకృష్ణ, నవీన్, మున్నా, శిక్షకులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి




కలెక్టర్ భవేశ్ మిశ్రా

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జూన్ 02 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్‌ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడులక ప్రాంగణంలో పాశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్ తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఏలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు. జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ, ఉపేంద్రా రెడ్డి, ఆర్డీ, రత్నకళ్యాణి, ఇతర అధికారులు , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి



కలెక్టర్ కె.హరిత

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : రైస్ మిల్లర్లు యాసంగి వరి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్‌లో రైస్ మిల్లర్లు, వాహనాల కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందని, ఈ క్రమంలో మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి వేగవంతంగా చేయాలని, ఎక్కడా జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. హమాలీల కొరత లేకుండా స్థానికంగా ఉన్న వారిని వినియోగించుకోవాలని, ధాన్యం తరలింపులో వాహనాల కొరత లేకుండా సంబంధిత కాంట్రాక్టర్లు వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

అద్దె బస్సుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ : సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాన్ని పురస్కరించుకుని మండల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం కేటాయించిన ఆర్టీసీ అద్దె బస్సులను వారికి అందజేసి జెండా ఊపి బస్సులను ప్రారంభించి మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ యూనిఫాంల స్టీచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందిస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్లను, రేషన్ కార్డులను కూడా మహిళల పేరిట మంజూరు చేస్తోందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళల గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసేలా ప్రభుత్వం విస్తృతస్థాయిలో కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే జిల్లాకు 18 అద్దె బస్సులను కేటాయించిందని తెలిపారు. అద్దె బస్సుల నిర్వహణను పక్కాగా పర్యవేక్షణ జరపాలని సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. నగరంలో కలెక్టరేట్‌కు ఆనుకుని అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, మానాల మోహన్‌రెడ్డి, డాక్టర్ కవితారెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్‌డీవీ సాయన్న, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, హేమలత, సభ్యులు పాల్గొన్నారు.



## ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేయాలి

కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రజాపక్షం/శివ్వంపేట : వరి ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు అత్యంత వేగంగా అన్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దొంతి గ్రామంలోని కామాక్షి బాయిల్డ్ రైస్‌మిల్లును కలెక్టర్ సందర్శించి అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్‌మిల్లు యజమానులు హమాలీలను, రవాణాను సమకూర్చుకోవాలని వేగంగా జరపాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద, జగదీశ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధి కూలీలకు టోపీలు, మజ్జిగ పంపిణీ

ప్రజాపక్షం/జన్నారం : జన్నారం మండలం పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనుల వద్ద పనిచేస్తున్న కూలీలకు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టోపీలు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ జక్కు సుష్మా, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జక్కు సుష్మా మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల సంక్షేమం కోసం గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కూలీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కూలీలు పని సమయంలో తప్పనిసరిగా టోపీలు ధరించాలని, ఎక్కువగా నీరు తాగడంతో పాటు మజ్జిగ వంటి పానీయాలను తీసుకోవాలని జక్కు భూమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జలపతి, వార్డు సభ్యులు రజాక్, మొషిన్, పంచాయతీ కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/బోథ్ : తెలంగాణ హైకోర్టు ఆదేశాలనుసారం మొబైల్ లోక్ అదాలత్ అవగాహన సదస్సును బోథ్ పట్టణం కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కుంబ సందీప్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ కుంభ సందీప్ మాట్లాడుతూ, చిన్ని చిన్న సమస్యలకు తక్షణమార్గం లోక్ అదాలతే అని ఖర్చు లేకుండా సమస్యలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అలాగే మోటారు వెహికల్ చట్టం, భూ తగాదాలు, ఉచిత న్యాయం పట్ల అవగాహన కల్పిస్తూ యువత గంజాయి, గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రెటరీ ఠాకూర్ రూపెందర్ సింగ్, న్యాయవాదులు, అడెపు హరీష్, సీడం గంగసాగర, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో భవన నిర్మాణ కూలీ మృతి



ప్రజాపక్షం/జన్నారం : జన్నారం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కూలీ యాట ఇందయ్య (60) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం భవన నిర్మాణ పనులకు వెళ్లిన ఇందయ్య తీవ్ర ఎండల కారణంగా పని చేస్తుండగా వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు జన్నారంలోని ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇందయ్య మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. మృతునికి భార్య దుబ్బరాజు, కుమారులు గంగాధర్, జగన్ ఉన్నారు. ఇందయ్య కుటుంబాన్ని జన్నారం సర్పంచ్ అజ్మీర కళావతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందు నాయక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# నిర్మల్ జిల్లాలో ఉధృతంగా ఐకెపి విఓఎల నిరసనలు

ప్రజాపక్షం/దిలావర్‌పూర్, నిర్మల్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఐకెపి విఓఎల జాయింట్ యాక్షన్ కమిటీ జెఎసి. ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా, దిలావర్‌పూర్ మండలపరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విఓఎల ప్రతినిధులు మాట్లాడుతూ విఓఎలకు కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్.ఆర్. పాలసీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి సిసిలుగా పదోన్నతి కల్పించడంతో పాటు 58 జివోను తక్షణమే సవరించాలని కోరారు.



ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించే వరకు ఈ సమ్మె నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో నిర్మల్ జిల్లా, దిలావర్ పూర్ మండలానికి చెందిన విఓఎలు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

**నిర్మల్ రూరల్‌లో నిరవధిక సమ్మెబాట పట్టిన విఓఎలు** : తెలంగాణ ఐకెపి, విఓఎల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్మల్ మండలం, నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో విఓఎలు నిరవధిక సమ్మెకు దిగారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వారు ఈ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ నిర్మల్ కేంద్రంగా వారు నిరసన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఏసి నిర్మల్ మండల అధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి రజిని, కోశాధికారి సుమలత, సహాయ కార్యదర్శి సునీత, సహాయ కోశాధికారి లలితతో పాటు మండల పరిధిలోని విఓఏలు, జేఏసి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గృహిణి మృతి



ప్రజాపక్షం/పాపన్నపేట : విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దపూర్ గ్రామానికి చెందిన పోలీసు పార్వతి (35) సోమవారం ఉదయం కూతురు స్యారీ పంక్షన్ ఉండడంతో అల్మరలో ఉన్న బట్టలు తీసుకునేందుకు వెళ్లగా ఆల్మరా పై ఉన్న విద్యుత్ తీగలను ఎలుకలు కొట్టడంతో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై అయి అరవడం తో కుటింబికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేసి మెదక్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలుపడంతో వెంటనే కుటింబికులు పాపన్నపేట పోలుసులకు సమాచారం అందివ్వడంతో పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ఖమ్మం కార్పొరేషన్‌లో అడ్డగోలు అనుమతులు

## భూ యజమానులు, ఇంజనీర్ల మాయాజాలం

## కార్పొరేషన్ ఆదాయానికి భారీ గండి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కార్పొరేషన్‌లో పైరవీల పర్వం కొనసాగుతుంది. అధికారులు యథాశక్తి సహకరిస్తుండడంతో అక్రమాలకు అంతు లేకుండాపోతుంది. నీ పని చేస్తా నాకేం చేస్తావన్న రీతిలో అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదునుగా కొందరు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కార్పొరేషన్ నుంచి అక్రమపద్ధతిలో అనుమతులు పొందుతున్నారు. కొందరు లైసెన్స్ ఇంజనీర్లు, భవన, భూ యజమానులు కలిసి అనుమతులను అక్రమ పద్ధతిలో పొందుతున్నారు. భవన నిర్మాణ అనుమతి కోరే సమయంలో భూ యజమాని, లైసెన్స్ ఇంజనీర్ సమర్పించే ధృవపత్రాలను ఆయుధంగా వాడుకుంటున్నారు. భవన విస్తీర్ణం తక్కువగా చూపిస్తూ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తున్నారు. కొందరైతే ఖాళీ స్థలం వదలకుండా వాస్తవ నిర్మాణం ఒకవిధంగా ఉంటే మరోక విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భవన నిర్మాణ ప్లాన్‌ను అప్‌లోడ్ చేసి అనుమతులు పొందుతున్నారు. కార్పొరేషన్‌లో భవన నిర్మాణ అనుమతులపై విచారణ జరిపితే వాస్తవ నిర్మాణానికి అనుమతులు కోరుతూ కార్పొరేషన్‌లో సమర్పించిన ధృవపత్రాలకు మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకోవచ్చు. తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఇంజనీర్, భూ లేదా భవన యజమాని సెల్ఫ్ డిక్లరేషన్ సమర్పించాలి. అందులో సమాచారం తప్పని తేలితే క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనితో పాటు ఏ సమయంలోనైనా భవన అనుమతులను కమిషనర్ రద్దు చేయవచ్చు. అంతే కాదు అవసరమైన పక్షంలో కూల్చివేతలు కూడా చేపట్టవచ్చు. కానీ ఖమ్మం కార్పొరేషన్‌లో మోసపూరితమైన సమాచారం ఇచ్చి అక్రమ పద్ధతుల్లో అనుమతులు పొందిన ఇంత వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కార్పొరేషన్‌కు పన్ను చెల్లించకుండానే ఏళ్ల తరబడి వ్యాపారాలు నిర్వహించినా తగు చర్యలు తీసుకోని అధికారులు అక్రమ నిర్మాణాలు, సరైన అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారనుకోవడం అత్యాశే అవుతుంది. టెక్నికల్ సెక్షన్‌లో పనిచేసే కొందరు వ్యక్తులు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు సాగుతున్నాయి. గతంతో పోల్చినప్పుడు కాస్త మందకొడిగా సాగుతున్న నిర్మాణాలు మాత్రం నిలిచిపోలేదు. జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించి సెల్ఫ్ డిక్లరేషన్‌లో తెలిపిన నిర్మాణాలకు వాస్తవ నిర్మాణాలకు ఉన్న తేడాను గమనించి చర్యలు తీసుకోవాల్సి ఉన్న తీసుకోవడం లేదని ఓ పైరవీల ముఠా హల్‌చల్ చేస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారుల వద్దకు భూ లేదా భవన యజమానుల కంటే పైరవీకారులే ఎక్కువగా తిరుగుతున్నారని ప్రతి ఫైలుకు ఓ రేటు కట్టి కార్పొరేషన్‌లో అనుమతులు మంజూరు చేయిస్తున్నారని సమాచారం. అక్రమమైనా, సక్రమమైనా ఈ ముఠాల ద్వారా మాత్రమే అనుమతులు వస్తున్నాయని సొంతంగా ఏ పని కోసం కార్పోరేషన్‌కు వెళ్లినా పని జరిగే పరిస్థితి లేదని ఎవరినో ఒకరిని ఆశ్రయించి ఎంతో కొంత ముట్టజెబితేనే అనుమతులు లభించే పరిస్థితి. ఒక మాటలో చెప్పాలంటే ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం పైరవీల ముఠా వలలో చిక్కుకుంది. కాదంటే గతంలో తాము ఇచ్చిన లంచం డబ్బుల వివరాలు బహిర్గతం చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలుస్తుంది. మొత్తంగా ఖమ్మం కార్పోరేషన్‌లో కొంత కాలంగా జరిగిన భవన అనుమతుల ఫైళ్లను పునః పరిశీలన చేస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కార్పొరేషన్ ఆదాయానికి కోట్లలో గండికొడుతున్న ఈ వ్యవహారంపై కమిషనర్‌తో పాటు ప్రత్యేకాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## వడదెబ్బతో కూలీ మృతి

### నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

### ప్రభుత్వం ఆర్థికసహాయం చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని దారేడు గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త షేక్ ఇమామ్(45) ఖమ్మం నగరంలో రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ నెల 24వ తేదీన ఎండ తీవ్రతకు గురై అస్వస్థ చెందగా, రాత్రి సమయంలో ఇంటి వద్ద మృతి చెందారు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కూలీ ఇమామ్ వడదెబ్బతో మృతి చెందడం అత్యంత బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి న్యాయం చేయాలి అని డిమాండ్ చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బత్తిని సీతారాములు, షేక్ నూర్జా, షేక్ మీరా, చిన్నప్ప, సుభాని, షేక్ నూరుద్దీన్, షేక్ జాఫర్, పీరు దోస్ తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి రైతుల ధర్నా



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** మధిర పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సాయిబాలాజీ కోల్డ్ స్టోరేజి బాధిత మిర్చి రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఆత్కూరులోని శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధిత మిర్చి రైతులకు ఇన్సూరెన్స్ అందించాలని గత కొన్నినెలలుగా సంబంధిత అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డేవిడ్‌కు వినతిపత్రాన్ని అందేశారు. సంఘటనాస్థలానికి మధిర సిఐ రమేష్ చేరుకుని రైతులతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో ఇతర పోలీస్ సిబ్బంది, రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దు

### కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదువుతున్నందున ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వీలైనంత వరకు చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తల నొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశాలకు తరలించి చల్లని నీటితో శరీరాన్ని తడపాలని తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణం



ఇవ్వాలని అవసరమైతే సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

**ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి**

ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వాగులో ఆయిల్ ప్యాకెట్లు

### రూ.2 లక్షల విలువైన ఆయిల్‌ను

### వాగులో పడేసిన దుండగులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సిద్దారం నుంచి నారాయణ పురం వెళ్లే రోడ్డులో గల తమ్మిలేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు వెయ్యి లీటర్ల బాలాజీ బ్రాండ్ కు చెందిన ఆయిన్ ప్యాకెట్ లు, లీటర్, 3, 5లీటర్ల డబ్బాలను బ్రిడ్జీపై నుండి వాగులోకి విసిరివేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఆయిల్ ప్యాకెట్లు, డబ్బాలను ఇక్కడ వేయటం పలు అనుమానాలకు తావిస్తుంది. సుమారు రూ.2 నుంచి రూ.2.5 లక్షల విలువైన ఆయిల్‌ను ఎందుకు పారబోశారు.ఇవి ఎక్కడి నుండి తెచ్చి ఇక్కడ వేశారు. అనేవి అంతుచిక్కని ప్రశ్నలు.ఆంధ్ర సరిహద్దు ప్రాంతం కావటం, చీకటి పడితే నిర్మానుష్యంంగా ఉండే ప్రదేశంలో గుట్టు చప్పుడు కాకుండా అంత పెద్ద మొత్తంలో ఆయిల్ ప్యాకెట్లను వేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వసతి గృహాలు, హాస్టళ్లకు సరఫరా చేయాల్సిన సరుకును పక్కదారి పట్టించే ప్రయత్నమా లేక వేరే ఏదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. ఈ సరకు ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి సరఫరా కావాల్సింది. అన్న అంశాలపై అధికారుల దర్యాప్తు చేయాలని, ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# లైవ్ అథెంటికేషన్‌కు ప్రత్యేక కౌంటర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో లైవ్ అథెంటికేషన్ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో సామాజిక భద్రత పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాల నిర్ధారణలో భాగంగా వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, లబ్ధిదారులు జీవించి ఉన్నారా? లేదా? అనే అంశాలను ధృవీకరించేందుకు లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక లైవ్ అథెంటికేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగవంతంగా, పారదర్శకంగా అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు ప్రత్యేక కౌంటర్‌ను వినియోగించుకుని తమ వివరాల ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

**ప్రజావాణి సమస్యలపై ప్రత్యేక దృష్టి..**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వ



హించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని కొత్త మున్సిపల్ కార్యాలయంతో పాటు బల్లేపల్లి నార్త్ జోన్ కార్యాలయంలో, పాత మున్సిపాలిటీ సౌత్ జోన్ కార్యాలయంలో, జమలాపురం కేశవరావు పార్కు వెస్ట్ జోన్, మమత రోడ్డు ఈస్ట్ జోన్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు.

## ఐకెపి విఓఎల సమ్మెకు ఏఐటియుసి సంఘీభావం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఐకెపి కార్యాలయం వద్ద విఓఎల నిరవధిక సమ్మెకు ఏఐటియుసి సోమవారం సంఘీభావం తెలిపింది. వారి సమస్యలు వారి డిమాండ్లు న్యాయమైనవేనని వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, వెట్టిచాకి గురి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎం. నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 22 సంవత్సరాలుగా వీరిని వెట్టిచాకిరికి గురి చేస్తూ ఇబ్బందులు పాలు చేస్తుందని అన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా నాయకులు రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, శివరామకృష్ణ, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఓడల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేన్ల రహదారి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు ధర్నా

### కలెక్టర్ హామీతో ధర్నా విరమణ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నాలుగు లేన్ల రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం భారీ రాస్తారోకో నిర్వహించారు. సర్పంచ్ లాకావత్ లక్ష్మీ, పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న రహదారి కారణంగా రోజూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్య క్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రహదారికి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. వెంటనే రహదారి పనులు పూర్తి చేయాలని నినాదాలు చేస్తూ గ్రామస్తులు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ కార్యక్రమానికి వెళ్తుండగా జిల్లా కలెక్టర్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. రహదారి పనులు ఆలస్యం కావడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అంకిత్ త్వరితగతిన రహదారి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో గ్రామస్తులు రాస్తారోకోను విరమించారు. మండల కేంద్రానికి కీలకమైన ఈ రహదారి పనులు నెలల తరబడి నత్తనడకన సాగుతున్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గాలివాన బీభత్సం.. విరిగిపడిన చెట్లు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సంతో చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడి రవాణాకు అంతరాయం కలిగిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఒకవైపు రోహిణి కార్తె ప్రారంభంతో భగ్గుమంటున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, మరోవైపు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమై ఆకస్మికంగా వర్షం కురిసింది. ఈదురు గాలులు బలంగా వీయడంతో మండలంలోని వినోబా నగర్ గ్రామం వద్ద సీతారామ కాలువ వంతెన సమీపంలో ప్రధాన రహదారిపై భారీ చెట్టు



విరిగిపడింది. దీంతో ఖమ్మం కొత్తగూడెం ప్రధాన రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనగా, సమాచారం అందుకున్న అధికారులు చెట్టును తొలగించే పనులు చేపట్టారు.

## వీధి కుక్కల దాడిలో మహిళ మృతి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** లక్ష్మీ దేవిపల్లి మండలం చేతకొండ ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎం రాములమ్మ(40)పై సోమవారం వీధి కుక్కలు ఒక్కసారిగా దాడిచేయడంతో మృతి చెందింది. కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలైన రాములమ్మ హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు శరీరంపై ఉన్న అనేక గాయాలకు ప్రథమ చికిత్సలు చేసి ప్రత్యేక వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందింది. దీంతో రాములమ్మ కుటుంబంతో పాటు ఆగ్రామంలో తీవ్ర విషాధ ఛాయలు అలుముకున్నాయి. చిన్నపిల్లలపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటనలు పలు సందర్భాల్లో చూసినప్పటికీ పెద్ద వారిపై కూడా కుక్కలు దాడిచేసి చంపిన ఘటన జిల్లాలో ఇదే మొదటిది. వీధి కుక్కలతో ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ప్రభుత్వం వీధి కుక్కల బారి నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



## గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాల వైరా (బాలికలు, బూర్గంపాడు(బాలికలు), ఏన్కూరు(బాలురు) నందు 2026–2027 విద్యా సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు గెస్ట్ టీచర్‌లుగా అర్హత కలిగిన అభ్యరులు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల రమ ఓ ప్రకటనలో తెలిపారు. వైరా, బూర్గంపాడు(బాలికలు) పాఠశాలకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. జూనియర్ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రి, బోటనీ, జువాలజి, సంస్కృత సబ్జెక్ట్‌లు, పిజిటి సంబంధిత పోస్టులకు డిగ్రీ, బిఈడి, టెట్ అర్హతలుగా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాల ఏన్కూరు నందు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు 27వ తేదీ సాయంత్రం వరకు మాత్రమే స్వీకరించబడునని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరించునని, ఇతర వివరాల కోసం గురుకుల పాఠశాల వైరా, ఏన్కూరు, బూర్గంపాడు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

## అత్యాచారం కేసులో జీవిత ఖైదు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జీవిత కాలం జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా ఫోక్స్ 1 ఇంచార్జి న్యాయాధికారి బి. శ్రీనివాసరావు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2024 మే 6న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి మైనర్ బాలికపై లైంగిక దాడికి బత్తుల చంద్రశేఖర్ అనే వ్యక్తి పాల్పడ్డారని ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేశారు. పొక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పిపి జమ్ముల శరత్‌కుమార్ రెడ్డి వాదించగా లైజన్ ఆఫీసర్‌గా శ్రీనివాస్, హోంగార్డు చిట్టిబాబు లు సహకరించారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

### అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అధికార్లను ఆదేశించారు. శుక్రవారం ఐడిఒసి కార్యాలయంలో మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తులు జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు నిఘా వ్యవస్థను పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు కండక్టర్లు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచార ం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణ, డిఎస్‌పి ఆదినారాయణ, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వనితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో గత నాలుగు రోజులుగా నిరహార దీక్ష చేస్తున్న దీక్షా శిబిరాన్ని వైరా పట్టణంలో సోమవారం సిపిఐ ఎంఎల్, మాస్ లైన్ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు సి.వై.పుల్లయ్య, యలదండి బాబు మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న గ్రామదీపికలు పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొక్క నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందని అన్నారు. వేతనాలు పెంచకపోవడంతో శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని, వారి యొక్క శ్రమను దోచుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది గ్రామదీపికలు గత నాలుగు రోజులుగా వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా నిరవధిక నిరహార దీక్ష చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు కూడా స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు పెంచాలని హెల్త్ పాలసీ అమలుపరచాలని సీనియారిటీ ప్రాతిపదికన గ్రామదీపికలను సిసిలుగా గుర్తించాలని అన్నారు. హెచ్ఆర్ పాలసీని కూడా అమలు చేయాలని, గౌరవ వేతనం కాకుండా వారికి రూ.20వేలు మంజూరు చేయాలని, గ్రామదీపికలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామదీపికల సమస్యలను పరిష్కారం అయ్యేంత వరకు సంఘీభావం మా మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి కుదురుపాక దర్గయ్య, పి.వై.ఎల్ పట్టణ అధ్యక్షులు పరస బద్రి, నాయకులు కన్నెగంటి అశోక్, పద్మావతి, శైలజ , ప్రభావతి, నిర్మల, మమత, తేజ, సంజు, రమాదేవి, రాధామణి, మల్లీశ్వరి, విజయలక్ష్మి , స్రవంతి, సైనాజ్, గద్దె నీరజ తదితరులు పాల్గొన్నారు.

## గోళ్లపాడులో అగ్నిప్రమాదం

### 10 ఎకరాల్లో పామాయిల్ తోటలు దగ్ధం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ప్రమాదవశాత్తూ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకొని, పామాయిల్ తోటలు సోమవారం మంటల్లో కాలిపోయాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం..శాబాద్ శ్రీనివాస్‌రెడ్డి, శాబాద్ హనుమంతురెడ్డి, మద్ది మల్లారెడ్డిలకు చెందిన సుమారు 10ఎకరాల పామాయిల్ తోట పూర్తిగా దగ్ధమైంది. చేతికొచ్చిన పంట మంటల్లో బూడిద కావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొంత మంది రైతులకు చెందిన మోటార్లు, స్టార్టర్లు, పైపులు కూడా కలిపోవడంతో మరింత ఆర్థిక నష్టం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఖమ్మం రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్ పరిశీలించి, బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో లింగా శ్రీనివాసరావు, శాబాద్ మాధవరెడ్డి, తొండల రవి, సింగిరెడ్డి బోసిరెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, రుద్ర ఉపేందర్, శావిడి కరుణాకర్, ప్రభాకర్, శ్రీను, పరికపల్లి సుదర్శన్, టీం పొంగులేటి పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 'మెహంగాయి మానవ్'
# మళ్లీ తన పని చూపించాడు...

● పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు ● ఎన్నికలప్పుడు వాగ్దానాలు, మిగతా సమయంలో ప్రజల జేబులపై దాడి చేయడమే వారి పని అంటూ మండిపాటు



**న్యూఢిల్లీ :** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెంచడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. 'మెహంగాయి మానవ్' (కృషిపరుడు) మళ్లీ తన పని చూపించాడని, ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం, మిగతా సమయాల్లో ప్రజల జేబులపై దాడి చేయడం తప్ప ఆయనకు వేరే పని లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. మోదీ విడతల వారీగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ, వినియోదారుల జేబులను కొద్దికొద్దిగా నిశ్శబ్దంగా కొల్లగొడుతున్నారని ఎక్స్ వేదికగా కేంద్రం చర్యలను ఎండట్టారు. 'రాబోయే ఆర్థిక సంక్షోభం గురించి నేను నెలల తరబడి హెచ్చరిస్తూనే ఉన్నాను. కానీ మోదీజీ, తన నైజానికి తగ్గట్టుగానే, ఆ సమయంలో ఎన్నికలతో బిజీగా ఉన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే, ఆయన పెట్రోల్, డీజిల్ ధరలను రూ. 8 పెంచారన్నారు. ఈ పెరుగుదల ధోరణి కొనసాగుతూనే ఉంటుందని రాహుల్ హెచ్చరించారు. 'మెహంగాయి మానవ్' మోదీకి ఒకే ఒక పని ఉంది. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం, మిగతా సమయాల్లో ప్రజల జేబులపై దాడి చేయడం' అని అన్నారు.

**రోజువారీ దోపిడీ వల్ల ఎవరికి లాభం : ఖర్గే**

రోజువారీ దోపిడీ వల్ల ఎవరికి లాభం చేకూరుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. 'ఇంధన దోపిడీ రూపంలో జరుగుతున్న ఈ రోజువారీ దాడి ఇంకా ముగియలేదు! కేవలం 10 రోజుల్లోనే ఇది నాలుగో పెంపు! పెట్రోల్ ధర లీటరుకు రూ. 7.35, డీజిల్ ధర లీటరుకు రూ. 7.53 పెరిగింది. సామాన్య ప్రజల పొదుపును దహించివేయడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లింది. యుపిఎ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు 175.34 శాతం పెరిగాయని, అయితే మోదీ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్క సెంట్ కూడా పెరగలేదని కాంగ్రెస్ అధినేత పేర్కొన్నారు. అంతర్జాతీయ ధరలు పెరగకపోయినప్పటికీ, మోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలను 2014లో లీటరుకు రూ. 71.41 నుండి 2026 నాటికి రూ. 102.12కు పెంచింది. ఇది 43.01 శాతం పెరుగుదల. అలాగే డీజిల్ ధరలను లీటరుకు రూ. 56.71 నుండి రూ. 95.20కు పెంచింది. ఇది 67.87 శాతం పెరుగుదల అని ఆయన తెలిపారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం రూ. 43 లక్షల కోట్లు దోచుకుందని, అంటే రోజుకు రూ. 1,000 కోట్ల చొప్పున దోపిడీకి పాల్పడిందని ఆయన ఆరోపించారు. 'పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో, ఈ రోజు హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసి సంస్థల షేర్లు వరుసగా 5.8%, 4.44%, 3.90% మేర లాభపడ్డాయి. ప్రజల కంటే లాభాలకే ప్రాధాన్యత ఇవ్వడం బిజెపి నైజం అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఇంధన ధరల పెంపు ప్రతిసారీ కుటుంబ బడ్జెట్‌లపై మరో తీవ్రమైన దెబ్బగా మారుతోంది, అంతే కాక ఆర్థిక వ్యవస్థలోని ప్రతి అంశంపై ఇది గొలుసుకట్టు ప్రభావాన్ని చూపుతోందన్నారు. రైతుల నుండి ఎంఎస్‌ఎంఇల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బిజెపి దోపిడీ దుష్ఫలితాలను అనుభవిస్తోందని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. 'మేము మళ్ళీ అడుగుతున్నాము: ఈ రోజువారీ దోపిడీ వల్ల ఎవరికి లాభం చేకూరుతోంది? ఖర్గే తన పోస్ట్‌లో ప్రశ్నించారు.

# పద్మ పురస్కారాల ప్రదానం

ధర్మేంద్ర తరఫున పద్మ విభూషణ్ అందుకున్న హేమమాలిని



**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు పాల్గొన్నారు. బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు మరణానంతరం, శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, వయోలిన్ విద్వాంసురాలు ఎన్. రాజంకు పద్మవిభూషణ్ పురస్కారాలను రాష్ట్రపతి ముర్ము ప్రదానం చేశారు. కళారంగంలో చేసిన విశేషమైన, విశిష్ట సేవలకు గాను ధర్మేంద్రకు లభించిన ఈ పురస్కారాన్ని ఆయన సతీమణి, ఎంపి హేమా మాలిని స్వీకరించారు. భారతీయ శాస్త్రీయ సంగీతానికి, ముఖ్యంగా వయోలిన్‌పై గాత్ర సంగీతాన్ని అనుకరించే 'గాయకీ అంగ్' శైలి ద్వారా దాని ప్రదర్శనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినందుకు రాజం చేసిన మార్గదర్శక కృషికి గాను ఆమెను సత్కరించారు. ఉత్తరాఖండ మాజీ ముఖ్యమంత్రి భగత్ సింగ్ కోష్యారి; సవాలుతో కూడిన భారతీయ శాస్త్రీయ కళారూపం 'అవధానం'ను పునరుద్ధరించిన ప్రఖ్యాత బహుముఖ ప్రజ్ఞాశాలి శతావధాని ఆర్. గణేష్; కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ సురేష్ కుమార్ కోటక్; జీర్ణాశయ వైద్య నిపుణుడు కల్లిపట్టి రామస్వామి పళనిస్వామిలకు కూడా పద్మభూషణ్ పురస్కారాలను ప్రదానం చేశారు. పీయూష్ పాండే, మాజీ పార్లమెంటేరియన్ విజయ్ కుమార్ మల్హోత్రాలకు కూడా మరణానంతరం ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పాండే భార్య, మల్హోత్రా కుమారుడు ఈ పురస్కారాలను అందుకున్నారు. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, నటుడు ప్రొసెన్‌జిత్ ఛటర్జీ, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, మాజీ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) డైరెక్టర్ జనరల్ కె. విజయ్ కుమార్ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన ఈ కార్యక్రమం, 'వందేమాతరం' జాతీయ గీతం వాయిద్య సంగీతంతో ప్రారంభమై, అనంతరం 'జన గణ మన' జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఉ పరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధాన మంత్రి నరే ంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. 2026 సంవత్సరానికిగాను, 131 పద్మ పురస్కారాల ప్రదానానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. వీటిలో ఐదు పద్మ విభూష ణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉంటాయి. ఈ పురస్కారాలను రెండు వేర్వేరు పౌ ర పురస్కార ప్రదానోత్సవాలలో ప్రదానం చేస్తారు. ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ పురస్కారాలను ప్రకటిస్తారు. ఈ ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారాలను కళ, సాంఘిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, ఇంజనీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, సివిల్ సర్వీస్ వంటి వివిధ రంగాలలో ప్రదానం చేస్తారు.

## శానిటరీ ప్యాడ్స్, టాయిలెట్స్ లేవని
# బాలికలు చదువు ఆపేయొద్దు

● సుప్రీంకోర్టు స్పష్టీకరణ ● తమ ఉత్తర్వులు అక్షరాలా పాటించాలని కేంద్రానికి ఆదేశం



**న్యూఢిల్లీ :** పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్, ప్రత్యేక మరుగుదొడ్లు లేవనే ఒకే ఒక్క కారణంతో బాలికలు చదువు మధ్యలో వదిలేయకూడదని సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. ఈ విషయంపై తాము ఇచ్చే ఆదేశాలను అక్షరాలా, పూర్తి నిబద్ధతతో అమలు చేసేలా చూడాలని కేంద్రానికి స్పష్టం చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు, బాలబాలికలకు విడివిడిగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని జనవరి 30న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీనితో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానికి తెలియజేసిన నేపథ్యంలో, సోమవారం సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. బాలికలు అందరూ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మరుగుదొడ్లను, శానిటరీ ప్యాడ్స్‌ను చక్కగా ఉపయోగించుకోవాలని, ఇది ఈ దేశంలోని మహిళల, బాలికల శ్రేయస్సు కోసం ఉద్దేశించిందని తెలిపింది. కేవలం ఇవి లేవనే కారణంతో బాలికలు చదువు ఆపేసి, ఇళ్లలోనే ఉండిపోయి ఇంటి పనులకు పరిమితం కాకూడదని జస్టిస్ జెబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ అర్చన పాఠక్ దవేను ఉద్దేశించి, 'మా తీర్పు ప్రకారం, సదరు ప్రయోజనాలు అందరికీ అందేలా చూడడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత' అని సుప్రీంకోర్టు పేర్కొంది.

# లోయలో పడ్డ ఎస్‌యువి

● 8 మంది దుర్మరణం, మహారాష్ట్రలోని రాయ్‌గడ్‌లో ఘటన
● ప్రమాదం పట్ల సిఎం ఫడ్నవీస్ దిగ్భ్రాంతి





**ముంబయి :** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రాయ్‌గడ జిల్లాలో ఒక స్పోర్ట్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యువి) 1,000 అడుగుల పైనుంచి లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ముంబయికి సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలాద్‌పూర్–మహాబలేశ్వర్ రహదారిలోని అంబెనాలి ఘాట్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. బాధితులు దాపోలి నుండి సతారాకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఉదయం ఆ వాహనం లోయలో కనిపించిందని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 19 నుండి 35 ఏళ్ల వయస్సు గల బాధితులు, ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటలకు దాపోలిలోని హర్నే నుండి ఎస్‌యువిలో బయలుదేరారు. వారు సతారాకు చేరుకోకపోవడంతో, వారి బంధువులు మధ్యాహ్నం గాలింపు చర్యలు చేపట్టారు, ఆ తర్వాత పోలీసులను సంప్రదించారు. దర్యాప్తులో భాగంగా, పోలాద్‌పూర్ సమీపంలోని ఒక మొబైల్ టవర్ సిగ్నల్ ద్వారా బాధితుల చివరి లొకేషన్‌ను గుర్తించారు. అంబెనాలి ఘాట్ ప్రాంతంలో గాలిస్తుండగా, సోమవారం ఉదయం పోలీసులు ఎస్‌యువిని లోతైన లోయలో గుర్తించారని ఆ అధికారి తెలిపారు. ఘాట్ ప్రాంతంలో వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, తద్వారా వాహనం లోయలోకి పడిపోయిందని పోలీసులు అనుమానిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎనిమిది మంది మరణం పట్ల ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. ఆ ఎనిమిది మంది స్నేహితులు ఒక విహారయాత్రకు వెళ్తుండగా, కొండ ప్రాంతంలోని లోయలో వారి వాహనం దాదాపు 1,500 అడుగుల లోతుకు పడిపోయిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే సహాయక, పునరావాస చర్యలను ప్రారంభించిందని, మృతదేహాలను వెలికితీసేందుకు ఏడుగురు సభ్యులతో కూడిన ఐదు బృందాలను ఏర్పాటు చేసిందని ముఖ్యమంత్రి తెలియజేశారు. కడపటి వార్తలు అందే సమయానికి మూడు మృతదేహాలను వెలికితీశారని, మిగిలిన మృతదేహాలను వెలికితీసేందుకు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్ఎఫ్) స్వచ్ఛంద సహాయక బృందాల సహకారంతో ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. మరణించిన వారిలో ఒకరు రత్నగిరి జిల్లాకు చెందినవారని, మిగిలిన ఏడుగురు సతారా జిల్లాకు చెందినవారని ఫడ్నవీస్ పేర్కొన్నారు. 'ఇది అత్యంత విషాదకరమైన సంఘటన. మరణించిన వారికి నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను, వారి కుటుంబాల దుఃఖంలో నేను పాలుపంచుకుంటున్నాను' అని ముఖ్యమంత్రి అన్నారు. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో రాయ్‌గఢ్, సతారా పోలీసులు సమన్వయం చేస్తున్నారని ఆయన తెలిపారు. బాధితులను సతారా నివాసితులు రితేష్ లోఖండే (22), సుహాస్ లోఖండే (20), ఉత్కర్ష్ షింగ్టే (21), నిఖిల్ షింగ్టే (25), మహేశ్ పవార్ (25), ఆదిత్య సలుంఖే (21), రాజేష్ కట్కర్ (35), రత్నగిరికి చెందిన అన్ష్ చవాన్ (19)గా గుర్తించారు.

# విద్యామంత్రి రాజీనామా చేయాలి

ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎందుకు తొలగించడం లేదో ప్రధాని సమాధానం చెప్పాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** నీట్ పరీక్ష పేపర్ లీక్, సిబిఎస్ఇ ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) విధానంలో అవకతవకలు నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖమంత్రిని బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఫలితాల అనంతర సేవల పోర్టల్‌లోని సాంకేతిక సవాళ్లను పరిష్కరించేందుకు సిబిఎస్ఇ, ఐఐటి మద్రాస్, ఐఐటి కాన్పూర్ నిపుణులను నియమించుకోనున్న నేపథ్యంలో, ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. 'మంత్రి ప్రధాన్' పదవి నుంచి వైదొలగాలని, మంత్రిని ఎందుకు కొనసాగనిస్తున్నారనే దానిపై ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. 12వ తరగతి బోర్డు పరీక్షలకు సిబిఎస్ఇ ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానం, దేశవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లల విద్యా భవిష్యత్తును అస్తవ్యస్తం చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. '12వ తరగతి ఉత్తీర్ణత శాతం అపూర్వమైన రీతిలో 3 శాతం పాయింట్లు (88% నుండి 85%కి) పడిపోయింది. అంతేకాకుండా, ఈ ప్రక్రియ అనేక అవకతవకలతో నిండిపోయింది. అస్పష్టంగా, చదవడానికి వీలులేకుండా ఉన్న జవాబు పత్రాలు, తప్పుడు మార్కింగ్, విద్యార్థులకు తప్పు జవాబు పత్రాలను కేటాయించడం, చెల్లింపులలో జాప్యం, విద్యార్థుల నుండి అధిక రీవాల్యుయేషన్ ఫీజులు వసూలు చేయడం వంటివి ఇందులో ఉన్నాయి' అని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'సంస్థాగత సంపూర్ణ పతనానికి' సారథ్యం వహిస్తున్న విద్యాశాఖ మంత్రి, ఈ విషాదం వెలుగులోకి వచ్చిన వారం రోజుల తర్వాత ఎట్టకేలకు మేల్కొన్నారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'ఈ సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి ఐఐటికాన్పూర్‌ను తీసుకురావడం ద్వారా ఆయన తనను తాను ఒక రక్షకుడిగా చిత్రీకరించుకుంటున్నారు. అసలు ప్రశ్న ఏమిటంటే, ఈ సమస్యలను ఎందుకు ముందుగా ఊహించలేదు? ఈ ఒఎస్ఎంవ్యవస్థను అవలంబించే ముందు సిబిఎస్ఇ, మంత్రిత్వ శాఖ ఎందుకు జాగ్రత్తగా ప్రణాళిక వేయలేదు? ఈ సమస్యపై స్పందించడానికి మంత్రికి ఎందుకింత సమయం పట్టింది? అని రమేష్ ప్రశ్నించారు. ప్రధాన మంత్రి దేశానికి తన రాజీనామాను ఇవ్వాలని, అలాగే, తన అసమర్థతతో భారత విద్యార్థుల భవిష్యత్తును బహిరంగంగా దెబ్బతీస్తున్న ఈ మంత్రిని ఇంతకాలం పదవిలో కొనసాగడానికి ఎందుకు అనుమతించారో ప్రధాన మంత్రి మాకు సమాధానం చెప్పాలన్నారు. ఫలితాల అనంతర సేవల పోర్టల్‌లోని సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్, ఐఐటి కాన్పూర్‌ల నుండి నిపుణులను నియమించుకుంటుందని విద్యా మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. సిబిఎస్ఇ పునర్మూల్యాంకన ప్రక్రియలోని లోపాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఈ ఏడాది పరీక్షల అనంతర పునర్మూల్యాంకన సేవలు ప్రారంభమైనప్పటి నుంచి నమోదైన అన్ని సాంకేతిక సమస్యలను పరిశీలించి, ఎలాంటి ఆటంకాలు లేని ప్రక్రియను నిర్ధారించడంలో సిబిఎస్ఇకి సహాయపడటానికి, ఐఐటిమద్రాస్, ఐఐటికాన్పూర్ నుంచి ప్రొఫెసర్లు, సాంకేతిక నిపుణుల బృందాలను నియమించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదేశాలు జారీ చేశారని మంత్రిత్వ శాఖ తెలిపింది.

# క్యూట్ యుజి పరీక్ష వాయిదా

**న్యూఢిల్లీ :** బక్రీద్ సెలవు తేదీలో మార్పు కారణంగా, ఈనెల 28న రెండు షిఫ్టులలో జరగాల్సిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ అండర్ గ్రాడ్యుయేట్ (సియుఇటి యుజి) 2026 పరీక్షలను జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) వాయిదా వేసింది. ప్రభావిత అభ్యర్థుల కోసం సవరించిన పరీక్ష తేదీలను తర్వాత ప్రకటిస్తామని ఏజెన్సీ తెలిపింది. ఈద్–ఉల్–అజ్హా (బక్రీద్) సెలవు తేదీ సవరణకు సంబంధించి 22న సిబ్బందిష శిక్షణ శాఖ (డిఒపిటి) జారీ చేసిన కార్యాలయ మెమోరాండం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం జారీ చేసిన ఒక పబ్లిక్ నోటీసులో ఎన్‌టిఎ పేర్కొంది. 5వ తేదీ నాటి పబ్లిక్ నోటీసుకు కొనసాగింపుగా, 28న రెండు షిఫ్టులలో జరగాల్సిన సియుఇటి (యుజి) 2026 పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు తెలియజేస్తున్నట్లు ఆ నోటీసులో పేర్కొన్నారు.అభ్యర్థులకు సూచించించారు.

# ముగ్గురు ఎఐఎడిఎంకె తిరుగుబాటు ఎమ్మెల్యేలు రాజీనామా

మరో ఐదుగురు పార్టీ శాసనసభ్యులు తిరిగి పళనిస్వామి వర్గంలో చేరిక



**చెన్నై:** తమిళనాడులో రాజకీయాలు రసవత్తరం గా మారుతున్నాయి. సీనియర్ నాయకులు సి.వి. షణ్ముగం, ఎస్.పి. వేలుమణి నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి చెందిన ముగ్గురు ఎఐఎడిఎంకె శాసనసభ్యులు సోమవారం శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్‌ను కలిసి తమ రాజీనామాలను సమర్పించారు. అయితే అసమ్మతి వర్గానికి చెం దిన మరో ఐదుగురు సభ్యులు తిరిగి పార్టీ అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి శిబిరంలో చేరారు. ఎఐఎడిఎంకె టికెట్లపై మధురాంతకం నుంచి గెలుపొం దిన మరకతం కుమారవేల్, ధారాపురం నుంచి గెలిచిన పి. సత్యభామ, పెరుందురై అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎస్. జయకుమార్ సచివాలయంలో స్పీకర్‌ను కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ధారాపురం (తిరుప్పూర్), పెరుందురై (ఈరోడ్) నియోజకవర్గాలు, పశ్చిమ తమిళనాడులోని ఎఐఎడిఎంకెకు కంచుకోటగా భావించే కొంగునాడు ప్రాంతంలో భాగంగా ఉన్నాయి. మధురాంతకం నియోజకవర్గం చెన్నైకి సమీపంలో ఉంది. కాగా, రాజీనామా సమర్పించిన తరువాత వారు టివికె మంత్రి ఆధవ్ అర్జున్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (టివికె) పార్టీలో వీరు చేరే అవకాశం ఉంది. ఈనెల 13న జరిగిన బలపరీక్ష సమయంలో, పార్టీ ఆదేశాలను ధిక్కరించి టివికె ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేసిన 25 మంది శాసన సభ్యులలో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఇదే సమయంలో, షణ్ముగం–వేలుమణి వర్గంలో ఉన్న ఐదుగురు ఎఐఎడిఎంకె ఎమ్మెల్యేలు తమ విధేయతను మార్చుకుని తిరిగి పార్టీ అధినేత పళనిస్వామి శిబిరంలో చేరారు. దీంతో, అసెంబ్లీలో పళనిస్వామికి మద్దతు తెలిపే ఎమ్మెల్యేల సంఖ్య 27కు చేరింది. వేలుమణి వర్గాన్ని వీడి పళనిస్వామి శిబిరంలో చేరిన శాసనసభ్యులలో ఎస్.ఎం. సుకుమార్ (ఆర్కాట్) కూడా ఉన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలు, మరో ఐదుగురు ఎమ్మెల్యేలు తిరిగి పళనిస్వామి శిబిరంలో చేరడంతో తిరుగుబాటు వర్గం బలం 25 నుంచి 17కు పడిపోయింది.

# లైంగిక నేరాలకు పాల్పడితే వెంటనే కేసులు

● దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలి
● పోలీసులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఆదేశం



**చెన్నై :** లైంగిక నేరస్థులపై తమిళనాడు ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. అత్యాచారాలకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని, దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా కోయంబత్తూరులో 10 ఏళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి, దారుణ హత్య నేపథ్యంలో ఉన్నతాధికారులతో కలిసి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించిన విజయ్, ఘోరమైన నేరాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని, అనుమానితులకు తీవ్ర శిక్షలు విధించాలని ఆదేశించారు. టివికె ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. వరుస హత్యలు, లైంగిక నేరాలపై ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకెతో సహా పలు రాజకీయ పార్టీలు టివికె ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ సమీక్షా సమావేశంలో, మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించిన కేసులలో విచారణను వేగవంతం చేయాలని, ముందుజాగ్రత్త చర్యలు, అవగాహన కల్పించేలా చూడాలని ముఖ్యమంత్రి అడ్వకేట్ జనరల్‌ను ఆదేశించారు. లైంగిక దాడి కేసులను త్వరితగతిన విచారించి, ఇతరులకు గుణపాఠంగా ఉండేలా కేసును సక్రమంగా నడిపి, దోషులకు కఠిన శిక్ష విధించాలని విజయ్ అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన తెలిపింది. కోయంబత్తూరులో లైంగిక దాడికి గురై హత్యకు గురైన బాలిక కుటుంబంతో ఆదివారం ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి, వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సూలూరులో బాలికపై జరిగిన లైంగిక దాడి, దారుణ హత్య తమిళనాడు వ్యాప్తంగా దిగ్భ్రాంతిని, ఆగ్రహాన్ని రేకెత్తించింది. ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి విజయ్ కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి బాలికకు తెలిసిన వ్యక్తితో సహా ఇద్దరిని అరెస్టు చేశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య కార్యదర్శి ఎం. సాయికుమార్, హోం కార్యదర్శి కె. మణివాసన్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్, సామాజిక సంక్షేమ, మహిళా హక్కుల శాఖ కార్యదర్శి మరియం పల్లవి బల్దేవ్, డిజిపి సందీప్ రాయ్ రాథోర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత 15 రోజుల్లో తమిళనాడులో 25 హత్యలు, 4 జంట హత్యలు, 19 లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయని అసెంబ్లీలోని ప్రతిపక్ష డిఎంకె నాయకుడు ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారు. పరివర్తన తీసుకువస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన వారి పాలనలో శాంతిభద్రతలు ఎలా మారిపోయాయో చెప్పడానికి ఈ ఘటనలే నిదర్శనమని ఉదయనిధి ఎక్స్ ఛానెల్‌లో వ్యంగ్యంగా అన్నారు. ఇదిలా ఉండగా, మదురైలోని విళక్కుతూన్ పోలీసులు నేరం జరిగిన కొన్ని గంటల్లోనే ఐదుగురు అనుమానితులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారని పోలీసులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# బందీలైన ఆరుగురిని తక్షణమే విడుదల చేయాలి

ఇంఫాల్‌లో వందలాది మంది నాగాలు నిరసన ర్యాలీ



**ఇంఫాల్ :** అనుమానిత కుకీ మిలిటెంట్లు బందీగా చేసుకున్న ఆరుగురు పౌరులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో సోమవారం వందలాది మంది నాగాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాగా పీపుల్స్ యూనియన్ ఇంఫాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మైతేయ్ వర్గానికి చెందిన పలువురు సభ్యులు కూడా పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ట్రైబల్ మార్కెట్ ప్రాంతం నుండి ప్రారంభమై ముఖ్యమంత్రి బంగ్లా వైపు సాగింది. దాదాపు 300 మీటర్లు ముందుకు సాగిన తర్వాత, ముఖ్యమంత్రి నివాసానికి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న ప్యాలెస్ గేట్ సమీపంలో భారీ సంఖ్యలో మోహరించిన భద్రతా సిబ్బంది నిరసనకారులను అడ్డుకున్నారని అధికారులు తెలిపారు. అయినప్పటికీ, ముఖ్యమంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్‌కు వినతిపత్రం సమర్పించేందుకు యూనియన్ ప్రతినిధి బృందానికి అనుమతి లభించింది. ఆరుగురు నాగా పౌరుల అపహరణలో పాల్గొన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సాయుధ కుకీ మిలిటెంట్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో ఆ సంస్థ డిమాండ్ చేసింది. ఉప ముఖ్యమంత్రి నెమ్చా కిప్గెన్ భర్త కుకీ నేషనల్ ఫ్రంట్ (ప్రెసిడెన్షియల్) అనే ఉగ్రవాద సంస్థకు నాయకత్వం వహిస్తున్నారని, అపహరణకు ఆయనే బాధ్యుడని ఆరోపిస్తూ, ఆమెను మంత్రివర్గం నుండి తొలగించాలని కూడా ప్రతినిధి బృందం కోరింది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, కుకీ ఉగ్రవాద గ్రూపుల మధ్య ఉన్న కార్యకలాపాల నిలిపివేత ఒప్పందాన్ని రద్దు చేయడంతో పాటు, కుకీ శరణార్థులను దేశం నుండి బహిష్కరించాలని కూడా ఆ డిమాండ్ చేసింది. నిరసనకారులు 'నెమ్చా కిప్గెన్ డౌన్ డౌన్, షరతులు లేకుండా ఆరుగురు నాగాలను విడుదల చేయండి. కార్యకలాపాల నిలిపివేత ఒప్పందాన్నిరద్దు చేయండి వంటి నినాదాలు చేశారు. కిప్గెన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఒక పోస్టర్‌లో 'ఒక ఉగ్రవాది భార్య ఉప ముఖ్యమంత్రి ఎలా అవుతుంది' అని రాసి ఉంది. కాంగ్‌పోక్పి జిల్లాలో జరిగిన దాడిలో ముగ్గురు చర్చి నాయకులు హత్యకు గురైన కొన్ని గంటల తర్వాత, ఈనెల 13న కాంగ్‌పోక్పి, సేనాపతి జిల్లాల్లో సాయుధ గ్రూపులు 38 మందికి పైగా ప్రజలను అపహరించి బందీలుగా పట్టుకున్నారు. వారిలో 12 మంది నాగ మహిళలు, 16 మంది కుకీలతో సహా 32 మందిని అప్పటి నుండి విడుదల చేశారు. అయితే, ఆరుగురు నాగ పురుషులు ఇప్పటికీ కనిపించకుండా పోయారు, వారి ఆచూకీ తెలియరాలేదు.

## పోలీసులపై దాడి...
# అల్కా లంబాను దోషిగా తేల్చిన కోర్టు

**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్ వద్ద 2024లో జరిగిన నిరసన సందర్భంగా పోలీసు సిబ్బందిపై దాడికి సంబంధించిన కేసులో కాంగ్రెస్ నాయకురాలు అల్కా లంబాను ఢిల్లీ కోర్టు సోమవారం దోషిగా నిర్ధారించింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అశ్వనీ పన్వార్ లంబాను దోషిగా నిర్ధారించి, ఆమె శిక్షపై వాదనలు వినడానికి జూన్ 5వ తేదీని నిర్ణయించారు. వివరణాత్మక ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. 2024 జూలై 29న జంతర్ మంతర్ వద్ద మహిళా రిజర్వేషన్‌కు మద్దతుగా నిరసన తెలుపుతున్నప్పుడు, అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలైన లంబా పోలీసులను అడ్డుకున్నారని, ఒక ప్రజా రహదారిని దిగ్బంధించారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. గత డిసెంబర్‌లో ఒక ప్రభుత్వ అధికారిని విధి నిర్వహణ నుండి నిరోధించడానికి దాడి లేదా నేరపూరిత బలప్రయోగం, ఒక ప్రభుత్వ అధికారిని అడ్డుకోవడం, ఒక ప్రభుత్వ అధికారి జారీ చేసిన ఉత్తర్వును ధిక్కరించడం, ప్రజా మార్గంలో ప్రమాదం లేదా అడ్డంకి కలిగించడం వంటి నేరాలకు గాను లంబాపై అభియోగాలు నమోదు చేయాలని మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వుకు వ్యతిరేకంగా లంబా దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను ఫిబ్రవరి 6న కొట్టివేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
26-05-2026
www.prajapaksham.in



# రాజీ ఒప్పందాన్ని అంగీకరించం:పెజెష్కియన్



**టెహ్రాన్:** ఇరాన్ గౌరవ మర్యాదలతో రాజీపడే ఒప్పందాన్ని తాము అంగీకరించబోమని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలు తుది దశకు చేరాయని వార్తలు వెలువడిన నేపథ్యంలో పెజెష్కియన్ నుండి ఈ ప్రకటన వెలువడింది. ''శత్రువు దురాగతాలకు ఇరాన్ లొంగిపోదు, ఇరాన్ జాతి హక్కులను పూర్తిగా అమలు చేయాలి'' అని పెజెష్కియన్ పేర్కొన్నట్లు ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ పేర్కొంది.
అణ్వాయుధాన్ని తమ దేశం కోరుకోవడంలేదని కూడా ఆయన చెప్పారు. అణ్వాయుధం తయారు చేయడానికి ఇస్లాం వ్యతిరేకమని ఆయన గతంలో కూడా చెప్పినప్పటికీ ట్రంప్ దానిని తోసిపుచ్చారు. అణ్వాయుధాన్ని తయారు చేసే హక్కు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించిందని, ఇరాన్ దగ్గర ఉన్న శుద్ధిచేసిన యురేనియంను బయటకు తరలించడానికి కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని అనధికార వార్తలు వెలువడిన నేపథ్యంలో పెజెష్కియన్ ప్రకటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ, ఇరాన్ డ్రోన్, క్షిపణి కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని చెప్పారు. తమ డ్రోన్, క్షిపణి కార్యక్రమం అభివృద్ధి కోసమేనని, మా నిధులలో కొంత భాగాన్ని దీనికోసం ఖర్చు చేస్తామని, దీనికోసం ఎవరి అనుమతి అడగాల్సిన అవసరం లేదన్నారు. తాము డ్రోన్లు, క్షిపణులు తయారుచేసుకోకపోతే ప్రపంచ పెత్తందార్లు తమపై ఆధిపత్యం చెలాయిస్తారని ఆయన అన్నారు.
చర్చలు కీలక తరుణంలో ఉండగా అమెరికా నుండి పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారంలో అమెరికా నాయకులు నిర్ణయ రాహిత్యంతో వ్యవహరిస్తున్నారని, కొన్ని గంటల వ్యవధిలోనే అమెరికా అధికారుల నుండి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వెలువడటం ఏ చర్చల ప్రక్రియనైనా సంక్లిష్టంగా మారుస్తుందని అన్నారు. ఇరాన్‌తో ఒప్పందంపై చర్చలు పూర్తిగా జరగలేదని ట్రంప్ చెప్పిన తర్వాత విదేశాంగమంత్రి మార్కో రుబియో ఢిల్లీలో మాట్లాడుతూ, ఇరాన్‌తో పూర్తి ఒప్పందం సోమవారం జరిగే అవకాశం ఉందని చెప్పడంపై బఘాయి పైవిధంగా స్పందించారు.

**ట్రంప్ చెప్పిన యుద్ధానికి కాలం చెల్లింది:పోప్**
ట్రంప్ చెప్పిన యుద్ధానికి కాలం చెల్లిందని పోప్ లియో అన్నారు. మాగ్నిఫికా హ్యూమానిటాస్ అనే ఎన్‌సైక్లికల్స్‌లో ఆయన రాస్తూ, ట్రంప్ చెరిబుతున్న న్యాయబద్ధమైన యుద్ధం అనే సిద్ధాంతానికి కాలం చెల్లిందని పేర్కొన్నారు. ఇరాన్‌లో ఇంటర్నెట్ బ్లాకౌట్ 87వ వారంలోకి ప్రవేశించింది. ఇరాన్‌లో తిరుగుబాటు, ప్రజాందోళన మొదలైనప్పటినుండీ ఇంటర్నెట్‌ను తొలగించారు. దేశంలో పౌరులమధ్య అనుసంధానం లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇప్పటికి 2,064 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ లేదని నెట్‌బ్లాక్స్ తెలిపింది.

## మధ్యవర్తిత్వ పాత్రపై పాకిస్థాన్‌కు జిన్‌పింగ్ ప్రశంస

**బీజింగ్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సడలిపోవడానికి పాకిస్థాన్ చేసిన మధ్యవర్తిత్వ పాత్రను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రశంసించారు. సోమవారం బీజింగ్‌లో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రధానమంత్రిపై జిన్‌పింగ్ ప్రశంసలు కురిపించారు. మధ్యవర్తిత్వపాత్ర పోషించేందుకు చొరవ తీసుకున్న పాకిస్థాన్‌ను జిన్‌పింగ్ ప్రశంసించారని షరీఫ్ పేర్కొన్నారు. పాకిస్థాన్ నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వంలో చైనా మొదటినుండీ తమకు మద్దతు ఇస్తోందని, ఈ మేరకు తాము అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితిపై జిన్‌పింగ్ చేసిన నాలుగు ప్రతిపాదనలు శాంతిని సాధించడానికి మార్గనిర్దేశం చేస్తాయన్నారు.



ఇదిలా ఉండగా, బీజింగ్‌లో చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావోనింగ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ, అమెరికా–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం కుదిరే అవకాశాలు కనిపిస్తున్నాయని, యుద్ధం ముగింపు దశకు చేరుకునే సూచనలు కనిపిస్తున్నందువల్ల చర్చల ప్రక్రియను ఆపకుండా ముందుకు తీసుకువెళ్ళాలని కోరారు. ''ఇరాన్ విషయంలో చైనా వైఖరి సుస్పష్టం, ఇది ఎప్పటికీ జరగకూడని సంఘర్షణ, ఇక జరగకూడదు, ముందస్తు పరిష్కారం ప్రాంతీయ దేశాలతోపాటు ప్రపంచదేశాలకు కూడా లాభిస్తుంది'' అన్నారు.

## ఆయుధాలు విడిచిపెట్టేందుకు హెజ్బొల్లా తిరస్కృతి

### వచ్చేనెల మళ్ళీ లెబనాన్– ఇజ్రాయెల్ ముఖాముఖీ

**బీరూట్:** ఇజ్రాయెల్–లెబనాన్ దేశాల మధ్య నాలుగో విడత ముఖాముఖీ చర్చలు జూన్ 2, 3 తేదీలలో జరుగుతాయి. ఇప్పటివరకూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తూ వచ్చినప్పటికీ లెబనాన్‌లో ఇజ్రాయెల్ పూర్తిస్థాయిలో ఉల్లంఘనలకు పాల్పడుతూ హింస, విధ్వంసం సృష్టిస్తోంది. మరోవైపు ఇరాన్ అనుకూల హెజ్బొల్లా సైన్యాధిపతి ఆయుధాలు వదిలిపెట్టేందుకు తిరస్కరిస్తున్నారు.హెజ్బొల్లాను నిరాయుధుల్ని చేసేవరకూ తాము లెబనాన్ వదిలివెళ్ళేదలేదని ఇజ్రాయెల్ మంకు పట్టు పడుతున్నది. అదేసమయంలో అమెరికా–ఇరాన్ మధ్య దాదాపు ఒక ఒప్పందం కుదిరే పరిస్థితులు కనిస్తున్నందువల్ల లెబనాన్‌లో యుద్ధం ముగింపు కూడా ఈ ఒప్పందంలో ఉండాలని ఇరాన్ పట్టుబడుతున్నది. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం లెబనాన్,ఇరాన్ నుండి తన స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఇజ్రాయెల్‌కు పూర్తి దాడి హక్కులు ఉన్నాయని అన్నారు. ఈ పరిస్థితుల మధ్య లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ మాట్లాడుతూ, లెబనాన్ నుండి ఇజ్రాయెల్ వైదొలగడం బేరసారాలకు అతీతమైనదని, దీనిని తమ యంత్రాంగం చర్చల ద్వారానే పరిష్కరించాల్సి ఉందన్నారు. హెజ్బొల్లా కారణంగా లెబనాన్ ఈ యుద్ధ వలయంలో చిక్కుకుందని అన్నారు. గతంలో రెండు దశాబ్దాలపాటు లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఆ తర్వాత 2000 సంవత్సరంలో ఆక్రమణ నుండి వైదొలగింది. ఈ పరిణామాలను ఆయన గుర్తుచేసుకుంటూ లెబనాన్ బాధాకరమైన వాస్తవంలో మునిగి ఉందన్నారు.

## రుబియో మాటలతో ఒప్పందంపై ఆశలు
# భారీగా తగ్గిపోయిన చమురు ధరలు

### చమురు మార్కెట్లకు మరో ఏడాది ఒత్తిడి తప్పదు



**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య ఒక ఒప్పం దం కుదురుతుందని, శుభవార్త అందుతుందని మార్కో రుబియో చెప్పిన ప్రకారం సోమవారమే ప్రకటన వెలువడుతుందని అంచనాలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రపంచ చమురు మార్కెట్‌లో ఆయిల్ ధరలు భారీగా ఐదు శాతం మేరకు తగ్గిపోయాయి. గడచిన రెండు వారాలలో ఎన్నడూలేని విధంగా ఈ ధర క్షీణించింది. స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. ఆసియా స్టాక్ మార్కెట్లు బాగా పుంజుకున్నాయి. ఐతే ఎంత ఆశాభావం ఉన్నప్పటికీ, ఒప్పందం కుదిరినప్పటికీ చమురు మార్కెట్లు పుంజుకుని నిల్వల పునరుద్ధరణ జరగాలంటే 2027 వరకు చమురు మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కోవాల్సిందేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ప్రపంచ చమురు ధరలకు ప్రామాణికంగా భావించే బ్రెంట్ క్రూడాయిల్ ధర సోమవారం నాడు బ్యారెల్‌కు 97.77 డాలర్లకు తగ్గిపోయింది. ఈ ధర మే 22వ తేదీన బ్యారెల్‌కు 103.54 డాలర్లుగా ఉండేది. అంటే దాదాపు ఐదుశాతం మేరకు తగ్గాయి. మే నెల ఏడో తేదీ తర్వాత ఆయిల్ కాంట్రాక్టులు బాగా తగ్గాయి. అమెరికాలో ట్రేడెడ్ క్రూడాయిల్ ధర 5.9 శాతానికి తగ్గి బ్యారెల్ ధర 90.93 డాలర్ల వద్ద నిలబడింది. అదేసమయంలో చైనాలో ఘోరమైన గని ప్రమాదం కారణంగా వంట బొగ్గు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.
ప్రపంచ దేశాలకు అవసరమైన ముడి చమురు, ద్రవీకృత ఇంధనం ఇరవై శాతం మేరకు హోర్ముజ్ జలసంధి మీదుగానే ప్రయాణం చేసి వస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీ అమెరికా దాడుల్లో హత్యకు గురికావడంతో యుద్ధం మొదలైంది. హోర్ముజ్ జలసంధి మూసుకుపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఐతే తాము 31 నౌకలను హోర్ముజ్ ద్వారా బయటకు పంపామని ఇరాన్ ప్రకటించింది. పాకిస్థాన్, చైనాలకు చమురు నౌకలు వెళ్ళాయని కూడాప్రకటించింది.
వాస్తవానికి హోర్ముజ్ జలసంధిని ఉపయోగించుకోవడానికి ప్రయత్నం చేసిన నౌకలను ఇరాన్ బెదిరించడం ప్రారంభించాక మార్చినెల నుండి ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో హెచ్చుతగ్గులు ఆరంభమయ్యాయి. డి చమురు ధరలు తగ్గినప్పటికీ ఈ ధరలు యుద్ధం ముందునాటికంటే చాలా హెచ్చు స్థాయిలో కొనసాగుతున్నాయి. ఏప్రిల్ నాటికి బ్యారెల్ ధర 100 డాలర్లకంటే చాలా ఎక్కువస్థాయికి పెరిగిపోయింది. రికార్డుదశకు ఈ ధర చేరుకుంది. ఈ ఘర్షణలకు ముందు ఫిబ్రవరిలో చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల వద్ద ట్రేడింగ్ జరిగేది. ఇప్పుడు కూడా భారీగా తగ్గిందని భావించినప్పటికీ యుద్ధం ముందు కంటే ఇరవై డాలర్లు అధికంగానే ఉంది. ''ఈనాడు సంక్షోభం చివరి దశలో కొంత వెలుగు కనిపిస్తోంది, భవిష్యత్తులో కొంత ఉపశమనం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి'' అని ఎంఎస్‌టి ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ సౌల్ కవోనిక్ వ్యాఖ్యానించారు. యుద్ధంవల్ల వివిధ చమురు దేశాల్లో మౌలిక సదుపాయయాలు ధ్వంసమయ్యాయి. వాటిని అనివార్యంగా మరమ్మతులు జరగాలి, మార్కెట్ మళ్ళీ వేగం పుంజుకోవాలి, రాకపోకలు, విశ్వసనీయత, సమృద్ధిగా పెరగాలి. వివిధ దేశాలలో ఆర్థిక పరిస్థితులు మెల్లిగా చక్కబడటానికి సమయం పడుతుంది. అందువల్ల 2027 వరకూ చమురు మార్కెట్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదురోవాల్సిందేనని కవోనిక్ అన్నారు. జలసంధిలో అనేక పేలుడు పదార్థాలను అమర్చారని, వాటిని తొలగించాల్సి ఉందని, వాటివల్ల పెద్ద ప్రమాదం పొంచి ఉందని, అందువల్ల హోర్ముజ్ నుండి బయటకు వచ్చిన నౌకలు తిరిగి లోడింగ్ కోసం వెళ్ళేందుకు సంకోచిస్తాయని అన్నారు.

# కాంగోలో 900 ఎబోలా కేసులు

### వైరస్ మృతదేహాలకోసం బంధువుల ఘర్షణ: కాల్పులు

**న్యూయార్క్:**డి.ఆర్.కాంగోలో ఎబోలా విజృంభన శరవేగంగా కొనసాగుతోంది. కొత్తగా మరో 900 కేసులు నమోదైనట్లు ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఎబోలా మృతుల సంఖ్య కూడా 200 దాటింది. దీంతో ఆఫ్రికా దేశాలలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా తూర్పు కాంగో మోంగ్వాలులోని ఎబోలా చికిత్సా కేంద్రం వద్ద మరణించిన తమ కుటుంబీకుల మృతదేహాలు స్వాధీనం చేయాలని బంధువులు ఆగ్రహంతో ఘర్షణలకు పాల్పడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఒక ఐసోలేషన్ టెంట్‌కు బంధువులు నిప్పుపెట్టారు. పోలీసులు చివరకు గాలిలోకి కాల్పులు జరపాల్సివచ్చింది. రోజంతా చికిత్సాకేంద్రంవద్ద ఈ ఘర్షణ కొనసాగింది. తీవ్రమైన వైరస్‌తో ఉన్న మృతదేహాలను స్వాధీనం చేసేందుకు అధికారులు తిరస్కరిస్తున్నారు. వాటిని బంధువులకు ఇస్తే వైరస్ మరింతగా వ్యాపిస్తుందని అధికారుల ఉద్దేశం.ఈ వ్యాధి కరోనా తరహాలో వ్యాపించకపోయినప్పటికీ, అపరిశుభ్రతవల్ల శరవేగంగా వ్యాధి విస్తరిస్తోంది. ఐతే కాంగో ప్రభుత్వానికి మార్గదర్శనం చేస్తున్నామని, ప్రభుత్వం నిఘా పెంచడంవల్ల కొత్త కేసులను గుర్తించగలుగుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనోమ్ ఘెబ్రియేసస్ చెప్పారు. ఈ వ్యాధి మొదటిసారి ఇటూరీ రాష్ట్రంలో ప్రబలిందని, ఈ ప్రాంతం తిరుగుబాటుదారుల అధీనంలో ఉందని, వారు క్వారంటైన్‌ను అమలు చేస్తున్నారని, ఈ ప్రాంతంలో నివసిస్తున్న 50 లక్షలమంది ప్రజల్లోని ప్రతి నలుగురిలో ఒకరికి వైద్య సహాయం,పర్యవేక్షణ అవసరం ఉందని, ప్రతి ఐదుగురిలో ఒకరు నిరాశ్రయులయ్యారని క్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో తిరుగుబాటుదారుల హింసవల్ల సామాన్య ప్రజలతోపాటు వైద్య సహాయ బృందాలు కూడా పారిపోయే పరిస్థితి వచ్చిందని ఆందోళన చెందారు. ఈ ప్రాంతానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ ప్యాకేజీని అందించాల్సిన అవసరం ఉందన్నారు.మే 16వ తేదీన డి.ఆర్.కాంగో, ఉగాండాలలో ప్రబలిన బుండిబుగ్యోరకం ఎబోలా వ్యాధి అంతర్జాతీయ అంత్యవసర పరిస్థితిని సృష్టించిందని గతంలో ఆయన ప్రకటించారు.1976లో బయటపడిన ఎబోలా వ్యాధి ఆరంభంలో గినియా,సియెర్రా లియోన్, లైబీరియా దేశాలకు కూడా వ్యాపించింది.

**బంగ్లాదేశ్‌లో 528కి పెరిగిన మీజిల్స్ మృతులు**
బంగ్లాదేశ్‌లో గడచిన ఇరవైనాలుగ్గంటలలో మీజిల్స్ వ్యాధి లక్షణాలతో 16 మంది మరణించారు. దీంతో ఈ వ్యాధి లక్షణాలతో మరణించినవారి సంఖ్య 528కి చేరింది. ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ సమాచారం ప్రకారం గడచిన ఒక్కరోజులో ఈ లక్షణాలతో కొత్తగా 1300 కేసులు నమోదయ్యాయి.

## వ్యోమగాములు
(మొదటి పేజీ తరువాయి)

అనే ముగ్గురు వ్యోమగాములు అంతరిక్షకేంద్రంలోకి ప్రవేశించి అప్పటికే అక్కడ ఉన్న తమ ముగ్గురు సహచరులను కలుసుకున్నారు. తర్వాత ఆరుగురూ కలిసి గ్రూప్ ఫొటో దిగారు. కాగా హాంకాంగ్ నుండి మొదటిసారి ఒక వ్యోమగామి అంతరిక్ష కేంద్రానికి వెళ్ళాడు. ఆదివారం రాత్రి గోబీ ఎడారిలో ఉన్న చైనా జియా క్వాన్ శాటిలైట్ సెంటర్ నుండి చైనా లాంగ్ మార్చ్–2 ఎఫ్‌వై 23 వాహకనౌక ఆదివారం రాత్రి షెంఝూ–23 అంతరిక్ష నౌకను విజయవంతంగా మోసుకువెళ్ళి పది నిమిషాల వ్యవధిలోనే నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని, తర్వాతి నౌక సోమవారం తెల్లవారుజామున చైనా అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమైందని సిఎంఎస్ఎ ఏజన్సీ ప్రకటించింది. కాగా ఒక వ్యోమగామి ఏడాదికాలంలో చైనా అంతరిక్ష కేంద్రంలోనే ఉండి పరిశోధనలు చేస్తూ రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం అంతరిక్ష కేంద్రానికి వెళ్ళిన వ్యోమగాముల బృందానికి ఝూ యాంగ్ ఝూ నాయకత్వం వహించారు.

## వడగాడ్పులు
(మొదటి పేజీ తరువాయి)

పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 'వేడి రాత్రులు' నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. రాత్రిపూట కూడా ఉక్కపోత తీవ్రంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన**
తీవ్రమైన వేడి కారణంగా స్థానిక వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చి, సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. గంటకు 4050 కి.మీ వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం కూడా ఉందన్నారు. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. హైదరాబాద్‌లో సాయంత్రం నుంచి రాత్రివేళల వరకు తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడే అవకాశం ఉందని చెప్పారు.

**వడదెబ్బ లక్షణాలు – వైద్యుల సూచనలు**
శరీరంలో సాధారణ ఉష్ణోగ్రత (98ఓఎఫ్) కంటే వేడి పెరిగినప్పుడు నీరసించి వడదెబ్బకు గురవుతారు. వడదెబ్బల కారణంగా రాష్ట్రంలో మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. వడదెబ్బ లక్షణాల్లో తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, చెమట రాకపోవడం, వాంతులు, నీరసం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు తెలిపారు. బాధితులను వెంటనే నీడ ప్రాంతానికి తరలించి, చల్లని నీరు లేదా ద్రవ పదార్థాలు ఇవ్వాలని సూచించారు. ప్రజలు రోజుకు కనీసం 6 నుంచి 8 లీటర్ల నీరు తాగాలని, కొబ్బరి నీరు, పండ్ల రసాలు, కర్బూజ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపీ, గుడ్డ లేదా కూలింగ్ గ్లాసెస్ ధరించాలని, పలుచటి తెలుపు రంగు దుస్తులు ఉపయోగించాలని సూచించారు. ఎండలో పనిచేసే కార్మికులు తరచూ నీళ్ల తాగుతూ, మధ్యమధ్యలో పావు గంట నీడలో విశ్రాంతి తీసుకోవాలి. చిన్న పిల్లలను చల్లని ప్రదేశాల్లోనే ఉంచాలి.

## కనీస వేతనం పెంచండి
(మొదటి పేజీ తరువాయి)

వెంటనే రబీకి సంబంధించి రైతు భరోసా ఇవ్వాలని సిఎంకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్న కొనుగోలు చేయడం అభినందనీయమని, రైతులకు వెంటనే మొక్క జొన్న డబ్బులు చెల్లించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకతీతంగా పేదలకు అందేందుకు గ్రామసభలలో అర్హులను గుర్తించి, ఆ గ్రామానికి కేటాయించిన ఇండ్లకు లబ్ధిదారులను లాటరీ ద్వారా గుర్తించాలని సిపిఐ ప్రతినిధుల బృందం సిఎంను కోరింది. భూదాన్ భూములలో, ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలివ్వాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో 20 వేల మంది గుడిసెలు వేసుకున్న పేదలకు కోర్టు కేసులు పరిష్కరించి ఇండ్ల పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొనసాగించి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని సిఎంవారు కోరారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**కేంద్రం సహకరించక పోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం: సిఎం**
కేంద్రం సహకరించక పోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి సిపిఐ ప్రతినిధి బృందానికి వివరించారు. మొక్క జొన్న దిగుబడి బాగా వచ్చిందని, కేంద్రం మొక్కజొన్న కొనుగోలు చేయడంలేదన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్క జొన్న కొనుగోలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## సమన్వయంతో ముందుకు
(మొదటి పేజీ తరువాయి)

మధ్య కృష్ణా జలాల వినియోగం, తాగు, సాగునీటి అవసరాలపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కర్ణాటక రాష్ట్ర చిన్న తరహా నీటి వనరుల శాఖ మంత్రి బోసురాజు భేటి అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాయచూర్ ఎంపి జి.కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవితో పాటు రాయచూర్ రూరల్ ఎంఎల్‌ఎ బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంఎల్‌ఎలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, శివకుమార్ రెడ్డి, వంశీకృష్ణ, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇఎన్‌సి రమేశ్ బాబు, కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖ కార్యదర్శి బి.కె.పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలు వినియోగించుకునే విషయంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు. తెలంగాణ సాగునీటి, తాగునీటి హక్కుల పరిరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధివిధానలపై ప్రాథమికంగా చర్చించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో అనుసరించనున్న విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. అంతర్‌రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు మంత్రి చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణ రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## నేర్చుకోవడం లేదు
(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ఇది బాధాకరం. గత ఘటనల నుంచి వారు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు. ఈ అంశం ఇప్పటికే కోర్టు ముందుకు వచ్చింది. అప్పట్లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పలు సూచనలు చేసింది. ఇప్పుడు ఆ సూచనల అమలుపై స్పష్టత కావాలి' అని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యుడిఎఫ్) సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. నీట్ పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని పిటిషనర్లు వాదించారు. ఈ నేపథ్యంలో ఎన్‌టిఎను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని లేదా దాని స్థానంలో స్వతంత్ర, పారదర్శక సంస్థను ఏర్పాటు చేయాలని కోర్టును కోరారు. ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్‌యుజి పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ పరీక్షను ఎన్‌టిఎ నిర్వహించింది. అయితే లీక్ ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో మే 12న పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాదులు కోర్టులో కీలక వాదనలు వినిపించారు. ఇప్పటికే 22 లక్షలకుపైగా విద్యార్థులు ఈ వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. వరుసగా జరుగుతున్న లీక్ ఘటనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులపై నేరుగా దాడి చేసినట్లేనని వాదించారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఇంకా, మళ్లీ నిర్వహించే పరీక్షలను ఒక హైపవర్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించాలని పిటిషనర్లు కోరారు. ఆ కమిటీలో మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తిని ఛైర్మన్‌గా నియమించాలని, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలను సభ్యులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరగకుండా అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వం వహించిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. ఆ కమిటీ సూచనల అమలుపై కూడా వివరాలు ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు పరిస్థితిని తెలియజేస్తూ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్‌గా కె. రాధాకృష్ణన్ నివేదిక సమర్పించాలి అని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రత అంశాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశాల కోసం ఈ పరీక్ష రాస్తుంటారు. ఇలాంటి కీలక పరీక్షల్లో వరుసగా లీక్ ఆరోపణలు రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది.

## పెట్రో మోత
(మొదటి పేజీ తరువాయి)

పడిపోయింది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు, కీలకమైన ప్రపంచ చమురు రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి అంతరాయం కలగడంతో, ఫిబ్రవరి చివరి నుండి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, దేశీయ వంటగ్యాస్ ఎల్‌పిజి ధరలను 14.2 కేజీల సిలిండర్‌కు రూ. 60, కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలను కిలోకు రూ. 4 చొప్పున మే మధ్య నుండి పెంచారు. ఈ వరుస పెంపులు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మరింత పెంచి, ఆర్థిక వ్యవస్థ వ్యాప్తంగా రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులను పెంచుతాయని అంచనా. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలో 3.40 శాతం నుంచి ఏప్రిల్‌లో 3.48 శాతానికి పెరగగా, ప్రధానంగా పెరిగిన ఇంధన, శక్తి ఖర్చుల కారణంగా టోకు ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠ స్థాయి అయిన 8.3 శాతానికి చేరింది.

## కొత్త కోర్సుల 'పంచాయితీ'
(మొదటి పేజీ తరువాయి)

కూడా విశ్వవిద్యాలయాలే అని కళాశాల కమిషనరేట్ స్పష్టం చేసింది. మరోవైపు డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులకు విశ్వవిద్యాలయాల నుంచి అనుమతులు పొందామని, కోర్సులు కూడా సిద్ధమేనని ఉన్నత విద్యామండలి చెబుతుంది. కొత్త కోర్సుల నేపథ్యంలో సిలబస్ తదితర అంశాలపైన కళాశాల కమిషనరేట్ రెండు సార్లు సమావేశాలను నిర్వహించినప్పటికీ ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి చైర్మన్ హాజరుకాలేదని,కనీసం ఉన్నత విద్యామండలి నుంచి ఏ ఒక్కప్రతినిధి కూడా హాజరుకాలేదని కళాశాల కమిషరేట్ వర్గాలు చెబుతున్నాయి. కళాశాల కమిషనరేట్, ఉన్నత విద్యా మండలి మధ్య ఆదిపత్య పోరు కొనసాగడం విద్యా వ్యవస్థకు మంచిది కాదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కొత్త కోర్సులు, సిలబస్ అంశాలు విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంశాలలో అధికార యంత్రాంగం జోక్యాన్ని విద్యా మండలి జీర్ణించుకోలేకపోతున్నది.

**'దోస్త్' రెండో విడతలో కొత్త కోర్సులా...?**
డిగ్రీలో ప్రవేశల నిమ్మితం చేపట్టే 'దోస్త్' రెండవ విడతలోనైనా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలనే యోచనలో ఉన్నత విద్యా మండలి ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సిలబస్‌కు సంబంధించిన ప్రక్రియను కూడా పూర్తి చేసినట్టు తెలిసింది. కళాశాలల కోర్సులకు అనుమతుల విషయం పక్కన పెడితే 'దోస్త్' రెండవ విడత ప్రవేశాలలో హడావుడిగా కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏముందనే వాదన కూడా వినిపిస్తోంది.

**ఆ కళాశాలలకు 'బిబిఎ,బిబిఎం'కు అనుమతులు ఉన్నట్టేనా..?**
రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు కళాశాలలో బిబిఎ, బిబిఎం కోర్సుల విషయంలో అనుమతుల పునరుద్ధరణపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కోర్సుల విషయంలో అనుమతుల పునరుద్ధరణ విషయాన్ని పట్టించుకోకుండానే కళాశాల కమిషనరేట్ దోస్త్‌లో చేర్చినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే అనుమతులు పునరుద్ధరణ అనే అంశం తమకు సంబంధం లేదని, ఇది వరకు తమ జాబితాలో ఉన్న కళాశాలలు, కోర్సులకు సంబంధించి సీట్లను దృష్టిలో పెట్టుకుని తాము 'దోస్త్'లో పొందుపర్చినట్టు కళాశాల కమిషనరేట్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే యుజిసి నిబంధనలు ప్రకారం ప్రభుత్వ కళాశాలలో కొత్త కోర్సుల విషయంలో విద్యార్థుల అడ్మీషన్ నుంచి ఆ కోర్సులను పూర్తి చేసే లోపు ఎప్పుడైనా అనుమతి పొందవచ్చునని కళాశాల కమిషనరేట్ స్పష్టం చేసింది. న్యాక్ అనుమతి పొందిన కళాశాలలో మాత్రమే కొత్త కోర్సులకు అనుమతి ఉంటుందని తెలిపింది. ప్రైవేటు కళాశాలలు మాత్రం ముందుగానే అనుమతులు పొందాల్సి ఉంటుంది.

## 'సంతకాలు సాధ్యంకాదు'
(మొదటి పేజీ తరువాయి)

ఒక బలమైన ఒప్పందం కోసం ఖతార్ ప్రధానమంత్రితో చర్చలు జరుపుతారు. హోర్ముజ్ జలసంధిని తెరవడం, శుద్ధిచేసిన యురేనియం భవితవ్యం వంటి విషయాలపై చర్చిస్తారని భావిస్తున్నారు. కానీ అవగాహన ఒప్పందం (ఎంఓయు)లోని కొన్ని క్లాజులను అమెరికా వ్యతిరేకిస్తోందని, యుద్ధం ముగించేందుకు ఇరాన్ కృషిలో పురోగతి ఉన్నప్పటికీ ఈ ఎం.ఓ.యును ఇప్పటికీ ఇంకా రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని తస్నీం న్యూస్ ఏజన్సీ ప్రకటించింది. లెబనాన్‌లో యుద్ధం ముగించే అంశం కూడా ఈ ఒప్పందంలో జోడించాలని ఇరాన్ కోరుతోంది. కానీ ట్రంప్ మాత్రం, ఒప్పందం కుదిరినప్పటికీ, ఇజ్రాయెల్ తన స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఇరాన్–లెబనాన్‌పై ప్రతిఘటనకు అవకాశం ఉందని అన్నారు. ప్రతిపాదిత ఒప్పందం ఒక తుది పరిష్కారం కాదని అమెరికా మీడియా అభివర్ణించింది.
మధ్యవర్తిదేశం పాకిస్థాన్ పత్రిక సోమవారంసాయంత్రం చెప్పిన సమాచారం ప్రకారం, ''యుద్ధాన్ని ముగించేందుకు జరిగిన చర్చల్లో అమెరికా–ఇరాన్ అనేక అంశాలపై అవగాహనకు వచ్చాయి,మేం చాలా అంశాలలో ఒక ముగింపు దశకు వచ్చామని చెప్పడం సరైనదే, ఐతే తక్షణం ఒప్పందంపై సంతకాలు సాధ్యంకాదు''అని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయెల్ బఘాయి హెచ్చరించారు. ''అమెరికా పరస్పర విరుద్ధంగా మాట్లాడుతోంది, వైఖరులు మారుస్తోంది, అందువల్ల ఒక అవగాహనకు వచ్చినాగానీ తక్షణం ఒప్పందం కుదురుతుందని సంతకాలు జరుగుతాయని ఎవరూ వాదించలేరు'' అన్నారు. ప్రజల దృష్టిని తప్పుతోవ పట్టించేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. ఇరు దేశాలు ఒక ముసాయిదాపై ఒప్పందానికి వచ్చిన తర్వాతే అణను కార్యక్రమాన్ని చర్చల్లో ఒక భాగంగా చేరుస్తామని ఆయన చెప్పారు. ఏప్రిల్ 13 నుండి ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, హోర్ముజ్ జలసంధి నిర్వహణకు సంబంధించిన అంశాలన్నీ ఈ ముసాయిదాలో చేర్చాం, నౌకా దిగ్బంధనం పేరుతో అమెరికా తీసుకుంటున్న చర్యలు ఆపాలి, హోర్ముజ్‌లో రాకపోకల సురక్షిత భద్రత గురించి ఇరాన్ చర్యలు తీసుకుంటుంది అని బఘాయి చెప్పారు. జలసంధిలోంచి ప్రయాణించే నౌకలపై ఇరాన్ సుంకాలు విధించడంలేదని, నౌకాయాన సేవలకుగాను రుసుములు మాత్రమే వసూలు చేస్తోందని చెప్పారు. ''ఇరాన్ సుంకాలు వసూలు చేయడంలేదు, హోర్ముజ్ జలసంధిం, పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రాలలో పర్యావరణ పరిరక్షణ సేవలు, నౌకలకు చేసే సేవలకు రుసుములు వసూలు చేయడం అవసరం, టోల్స్ వసూలు చేసే ప్రయత్నం చేయడంలేదు'' అని చెప్పారు. జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని ఇరాన్ మొదటినుండీ చెబుతోంది.ఈ అవగాహన ఒప్పందంలో 60 రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు,హోర్ముజ్‌ను తిరిగి తెరవడం,అణు కార్యక్రమం వంటివి ఉన్నాయని చెబుతున్నారు. తుది ఒప్పందం కుదరడానికి 30 నుండి 60 రోజులు గడువు విధించారని నిన్నటినుండీ వార్త వెలువడుతోంది. యుద్ధాన్ని ముగించేందుకు 14 అంశాల చట్రాన్ని (ఫ్రేమ్‌వర్క్)ను ఖరారు చేస్తున్నట్లు ఇరాన్ చెప్పిన తర్వాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఒప్పందం చేసుకోవడానికి కంగారు పడవద్దు అని సంధాన కర్తలకు ట్రంప్ ఒకవైపు చెబితే, భారత్ పర్యటనలో ఉన్న మార్కో రుబియో మాత్రం ఇరాన్‌తో సోమవారం ఒక పూర్తిస్థాయి ఒప్పందం కుదురుతుందని ఢిల్లీలో పాత్రికేయులతో అన్నారు.

**మొజ్తాబా వల్ల కొంత జాప్యం?**
తీవ్రంగా గాయపడి భూగృహంలో చికిత్స పొందుతున్న మొజ్తాబా ఖమేనీకి చర్చల సమాచారం చేరవేయడంలో జాప్యం జరుగుతోందని, ఆయన ఆమోదం జాప్యం జరుగుతోందని వార్తలు వెలువడ్డాయి.ఈ విషయాన్ని అమెరికా కూడా అంగీకరించింది. మొజ్తాబా నుండి తుది సమాధారం రాలేదు. దానికోసం కూడా ఇరాన్ నాయకులు ఎదురుచూస్తున్నారు. ఈ ఎంఓయును మొజ్తాబా ఖమేనీ చూశారని తమకు సమాచారం అందిందని, దూతల ద్వారా ఆయనకు సమాచారాన్ని చేరవేస్తున్నారని అమెరికా గూఢచారి వర్గాలు పేర్కొన్నాయి.

**రిపబ్లికన్‌పార్టీలో విభేదాలు**
ఒప్పందం కుదురుతుందని వార్తలు వస్తున్న తరుణంలో రిపబ్లికన్‌పార్టీలో ఎంపీలు,నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. వారిలో విభేదాలు మొదలయ్యాయి. కొందరు ఇరాన్ పట్లబాహాటంగానే ఉదారంగా ప్రకటనలు చేస్తుండగా, మరికొందరు ఈ ఒప్పందం వినాశకరమైనదని తీవ్ర విమర్శలు చేస్తున్నారు. సెనేటర్ టెడ్ క్రూజ్ ఈ ఒప్పందాన్ని వినాశకరమైనదిగా విమర్శించారు. సెనేట్ సాయుధ సేవల కమిటీ అధ్యక్షుడు రోజర్ వికర్ మాట్లాడుతూ, 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించడమంటే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ద్వారా సాధించిన దంతా వృథా చేసినట్లేనన్నారు. ఈ విమర్శలకు ట్రంప్ సమాధానం చెబుతూ ఇది తుది ఒప్పందం కాదని అన్నారు. తాము ఈ ఒప్పందాన్ని ఇంకా ఖరారు చేయలేదన్నారు. ఒబామా చర్చలు జరిపిన జెసిపిఓఎ ఒప్పందానికి ఖచ్చితంగా ఇది వ్యతిరేకం, ఇరాన్ చేతికి అణ్వాయుధం ఇచ్చే ఒప్పందం నేను చేసుకోను'' అని ట్రంప్ సోషల్ మీడియాలో రాశారు.

# ప్లే ఆఫ్స్‌లో నువ్వానేనా..

## రెండోసారి విజేత ఎవరో?



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ లీగ్ దశలో అదరగొట్టిన నాలుగు జట్లు ప్లే ఆఫ్స్ పోరుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఓసారి టైటిల్‌లను కొల్లగొట్టిన నాలుగు జట్లు రెండోసారి విజేతగా నిలిచేందుకు సర్వశక్తులు ఒడ్డనున్నాయి. క్వాలిఫయర్ 1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్.. ఎలిమినేటర్లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. మంగళవారం నుంచి నాకౌట్ సమరం మొదలవ్వనుండగా.. ఆర్‌సిబి, గుజరాత్, సన్‌రైజర్స్, రాజస్థాన్ బలాబలాలు ఏంటో చూద్దాం...

### బ్యాట్‌తో కోహ్లీ.. బంతితో భువి

తొలి టైటిల్ కోసం 18 ఏళ్లు నిరీక్షించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండో ట్రోఫీని పట్టేయాలని ఉవ్విళ్లూరుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా 19వ సీజన్‌లో అడుగు పెట్టిన ఆర్‌సిబి.. టాప్ ఆర్డర్ విధ్వంసం, స్వింగ్ కింగ్ భువనేశ్వర్ విజృంభణతో 9 విజయాలతో టాప్‌లో నిలిచింది. ప్రతిసీజన్‌లో కుర్రాడిలా చెలరేగే విరాట్ కోహ్లీ(557 పరుగులు) ఈసారి పరుగుల వరద పారించగా.. మూడో స్థానంలో దేవ్దత్ పడిక్కల్, రజత్ పటిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో బెంగళూరును నిలబెడుతున్నారు. ఓపెనర్‌గా వెంకటేశ్ అయ్యర్ రాణించగా.. ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా(73, ముంబై ఇండియన్స్), టిమ్ డేవిడ్(70, చెన్నై సూపర్ కింగ్స్‌పై )లు ఒకట్రెండు మ్యాచుల్లో మెరిశారు. బౌలింగ్‌లో భువనేశ్వర్ పవర్ ప్లేలో నిప్పులు చెరుగుతున్నాడు. 24 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ముందున్న భువి.. క్వాలిఫయర్ 1లో కీలకం కానున్నాడు. హేజిల్వుడ్ సైతం ప్రత్యర్థులను వణికిస్తుండగా.. రసిక్ దార్ సలాం సైతం వికెట్ల వేటతో యశ్ దయాల్ లేని లోటును భర్తీ చేయడం బెంగళూరుకు కలిసొచ్చింది.

### గుజరాత్ బలం వీళ్లే

అరంగేట్రం సీజన్ 2022లో హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ఐపిఎల్ ట్రోఫీని ఒడిసిపట్టిన గుజరాత్ టైటాన్స్ రెండో కప్‌ను తన్నుకుపోవాలనే కసితో ఉంది. ఈసారి కెప్టెన్ శుభ్మన్ గిల్(616 పరుగులు) జట్టును ముందుండి నడిపిస్తుండగా.. తమిళ తంబీ సాయి సుదర్శన్(638 పరుగులు) బ్యాటింగ్ యూనిట్‌కు వెన్నెముకలా నిలుస్తున్నాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో ఇద్దరూ ఒకట్రెండు స్థానాల్లో ఉన్నారంటే ఏ స్థాయిలో చెలరేగుతున్నారో అర్థమవుతుంది. అయితే.. మిడిలార్డర్లో బట్లర్ .. సుందర్ మాత్రమే రాణిస్తుండడం గుజరాత్‌ను కొంత కలవరపరుస్తోంది. నిరుడు డ్రగ్స్ తీసుకొని పునరావాస కేంద్రంలో గడిపిన పేసర్ కగిసో రబడ(24 వికెట్లు) ఈసారి బెంబేలెత్తిస్తున్నాడు. సిరాజ్ జతగా కొత్త బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను భయపెడుతున్నాడు. టెస్టు బౌలర్లైన ఈ ఇద్దరూ లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను బోల్తా కొట్టిస్తూ గుజరాత్ గెలుపు గుర్రాలుగా అవతరించారు. ఆల్‌రౌండర్‌గా జేసన్ హోల్డర్ నూరుపాళ్లు న్యాయం చేస్తుండగా, మిస్టరీ స్పిన్నర్ రషీద్ ఖాన్ (19 వికెట్లు) మళ్లీ లయ అందుకోవడం గుజరాత్‌కు కొండంత బలం చేకూరింది.

### సన్‌రైజర్స్ కొత్తగా..

గత మూడు సీజన్లలో టాప్‌ఆర్డర్‌లనే నమ్ముకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి బౌలర్ల ప్రదర్శనతో విజయాలు సాధిస్తోంది. సొంతగడ్డపై వరసగా ఐదు.. మొత్తంగా 9 విజయాలతో అదరగొట్టిన ఆరెంజ్ ఆర్మీకి ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్లు విఫలమైనా కోలుకుంటోంది. అందుకు కారణం ఇషాన్ కిషన్(569 పరుగులు), హెన్రిచ్ క్లాసెన్. ఈ ఇద్దరూ మిడిల్ ఓవర్లలో తుఫాన్ ఇన్నింగ్స్‌తో స్కోర్ బోర్డును ఉరికిస్తున్నారు. ఇదివరకులా 300లకు పైగా స్ట్రయిక్ రేటుతో కాకుండా సమయోచితంగా ఆడుతున్న క్లాసెన్ 606 పరుగులతో ఆరెంజ్ క్యాప్ రేసులో నిలిచాడు. ఆఖర్లో సలీల్ అరోరా, నితీశ్‌రెడ్డి, స్మరణ్, అనికేత్లు దంచికొట్టగల సమర్థులే. బౌలిం గ్ దళంలోని కుర్రాళ్లు ప్రఫుల్ హింగే, షకీబ్ హుస్సేన్లు అద్భుతంగా రాణిస్తున్నారు. కెప్టెన్ కమి న్స్, ఇషాన్ మలింగలు ఓ చేయి వేస్తుండగా.. స్పిన్నర్ శివాంగ్ పొదుపుగా బౌలింగ్ చేస్తూ పరుగులను నియంత్రిస్తూ విజయాల్లో కీలకం అవుతున్నారు. 2016లో డేవిడ్‌వార్నర్ సారథ్యంలో ట్రోఫీని ముద్దాడిన సన్‌రైజర్స్.. కమిన్స్ సారథ్యం లో 2024లో ఫైనల్ చేరినా రన్నరప్‌గా సరిపెట్టుకుంది.

### వైభవ్.. ఆర్చర్

తొలి సీజన్ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయంతో ప్లే ఆఫ్స్ బెర్త్ పట్టేసింది. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ (583 పరుగులు, 37 బంతుల్లో శతకం) సుడిగాలి ఇన్నింగ్స్‌లతో ప్రత్యర్థులను భయపెట్టింది రాజస్థాన్. ప్రపంచస్థాయి బౌలర్లు బుమ్రా, కమిన్స్, స్టార్క్, హేజిల్వుడ్లను సైతం అలవోకగా ఎదుర్కొన్న ఈ చిచ్చరపిడుగు ఏకంగా 53 సిక్సర్లు బాదడం విశేషం. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ దూకుడు.. ధ్రువ్ జురెల్, ఫెరీరా మెరుపులు తోడవ్వగా జైపూర్ ఫ్రాంచైజీ నాకౌట్ బరిలో నిలిచింది. చావోరేవో పోరులో జోఫ్రా ఆర్చర్ తానొక ఆల్‌రౌండర్ అనిపించుకున్నాడు. వాంఖడేలో ముంబై ఇండియన్స్‌పై విలువైన 32 పరుగులు.. ఆపై మూడు వికెట్లతో రాజస్థాన్‌ను ఎలిమినేటర్‌కు చేర్చిన ఈ స్పీడ్స్టర్తో సన్‌రైజర్స్ బ్యాటర్లకు ముప్పే. బ్రిజేశ్ శర్మ, స్పిన్నర్ యశ్ రాజ్ పంజాలు సైతం అద్భుతంగా రాణిస్తున్నారు. సీజన్ మధ్యలోనే రెండుసార్లు చేతులు మారిన రాజస్థాన్‌ను.. ఉక్కు దిగ్గజం లక్ష్మి నివాస్ మిట్టల్ రూ.15,660 కోట్లకు హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం క్వాలిఫయర్ 1, బుధవారం ఎలిమినేటర్ ఆపై క్వాలిఫయర్ 2ను దాటిన జట్లు మే 31న అహ్మదాబాద్‌లో జరుగనున్న ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

## యువతరంగం

# విద్యార్థులపై ఒత్తిడి తగ్గేనా.. ఆత్మహత్యలు ఆగేనా!

విద్యార్థుల ప్రయాణం నేడు ఒక అంతర్గత యుద్ధంలాగా మారింది. మొదటి తరగతి నుంచే మార్కుల భారం, మూడో తరగతి నుంచే పరీక్షల బెంగ, ఐదో తరగతి నాటికే ట్యూషన్ల బడి ప్రారంభం, ఎనిమిదో తరగతి వరకే కలలన్నీ భవిష్యత్తుకు తార్కికంగా కట్టివేయాల్సిన ఒత్తిడి, పదో తరగతి నుంచే భయం, ఇంటర్ నుంచే ఆందోళన, డిగ్రీ నుంచే అనిశ్చితి, పీజీ నుంచే నిస్సహాయత, పరిశోధన దశలో ఒంటరితనం పెరుగుతూ వస్తున్నాయి. ప్రతి దశలో ఒక కొత్త భారమూ, కొత్త అంచనా, కొత్త భయం. చిన్న వయస్సు నుంచే పిల్లల మనసు ఇంతభారాన్ని మోయడానికి సిద్ధంగా ఉండదు. స్నేహం, ఆట, ఆసక్తి, సృజన అన్నీ గతపు విలాసాల్లా కనిపిస్తున్నాయి. జీవితం అంటే చదువు మాత్రమే అని భావించే కుటుంబసామాజిక వాతావరణం విద్యార్థి మనసును విచ్ఛిన్నం చేస్తోంది. విద్యార్థుల జీవితం నేడు ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన ఒత్తిడిలో నడుస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచే పరీక్షల పరంపర మొదలై, హైస్కూల్ దశలో మరింత తీవ్రంగా, కళాశాల దశలో ఇంకా కఠినంగా, విశ్వవిద్యాలయ దశలో భవిష్యత్తు అనిశ్చితితో కలిసిపోయి మనసును ముంచెత్తుతున్న పరిస్థితే కనిపిస్తోంది. వయస్సుకు మించిన బాధ్యతలు, సరితూకం లేని అంచనాలు, నియంత్రణ లేని పోటీ వాతావరణం విద్యార్థుల జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. పాఠశాల స్థాయిలో దాదాపు 61 శాతం విద్యార్థులు చదువు కారణంగా ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు జాతీయ బాలహక్కుల సంఘం వివరించింది. హైస్కూల్, ఇంటర్ దశలో ఈ శాతం మరింత పెరిగి 75 శాతానికి చేరుకుంటోంది. కోచింగ్ కేంద్రాల కల్చర్ పెరిగిన నగరాల్లో ఈ శాతం 82 శాతం దాటింది. మానసికంగా సున్నితమైన వయస్సులో ఈ స్థాయి ఒత్తిడిని భరించడం పిల్లల భావోద్వేగ ప్రపంచాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. కళాశాల దశలో పరిస్థితి ఇంకా సంక్లిష్టంగా మారింది. 62 శాతం డిగ్రీ విద్యార్థులు భవిష్యత్తు అనిశ్చితి, పరీక్షల భారంతో ఒత్తిడిని అనుభవిస్తున్నారు. పీజీ దశలో పరిశోధన, ఉద్యోగ పోటీ, ప్రాజెక్టు బాధ్యతలు కలిపి ఈ శాతం 68 శాతానికి చేరుకుంది. విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన విద్యార్థులలో 72 శాతం ఒత్తిడిని వాస్తవ సమస్యగా గుర్తించారు. ఐటీ, మెడికల్, ఇంజినీరింగ్ రంగాల్లో ఈ శాతం మరింత ఎక్కువ. ఈ సంఖ్య లు విద్యా వ్యవస్థలోని లోతైన సమస్యలను సూచిస్తున్నాయి. ఒత్తిడికి మూలకారణాల్లో పెద్దవిభాగం కుటుంబ వాతావరణం. సర్వేల ప్రకారం తల్లిదండ్రుల అంచనాల ఒత్తిడికి 65 శాతం విద్యార్థులు గురవుతున్నారు. కొంతమంది కుటుంబాల్లో చదువు పేరుతో నియంత్రణ, పోలికలు, భయం, అపహాస్య వ్యాఖ్యలు




సాధారణ ప్రక్రియగా మారాయి. పిల్లల సామర్థ్యం, ఆసక్తి, నేర్పు, భావోద్వేగ స్థితి అన్నివాటిని పక్కనపెట్టి కేవలం ఫలితాల ఆధారంగా పిల్లల విలువను నిర్ణయించే తీరుతో విద్యార్థులు లోపభావనలోకి నెట్టబడుతున్నారు. లక్ష్యాలు నెరవేరకపోతే పిల్లలలో పశ్చాత్తాపం, భయం, నిస్సహాయ స్థితి పెరుగుతోంది. ఈ ఒత్తిడికి అత్యంత దురదృష్టకర ఫలితం ఆత్మహత్యలు. జాతీయ నేర గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపు 13వేల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అంటే రోజుకు దాదాపు ఒకింట్లో 35 కుటుంబాలు ఈ విషాదాన్ని ఎదుర్కొంటున్నాయి. మొత్తం ఆత్మహత్యల్లో 11 శాతం విద్యార్థులవి. ఇది ఒక సంఖ్య కాదు, ఇది భారమైన ప్రశ్న. విద్యార్థి మనసు ఇంత భారాన్ని ఎందుకు మోయలేకపోతోంది? విఫలత భయం, కుటుంబ అంచనాల ఒత్తిడి, కోచింగ్ కల్చర్లోని కఠిన వాతావరణం, స్నేహసంబంధాల కొరత, భావోద్వేగ నిర్లక్ష్యం. కొన్ని పట్టణాల్లో పరిస్థితి మరింత భయంకరమై ఉంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు దేశానికి మేల్కొలుపు పిలుపుగా నిలిచింది. 2025 జులై 25న వెలువడిన తీర్పులో విద్యార్థుల మానసిక ఆరోగ్యం రాజ్యాంగంలోని జీవన హక్కులో భాగమని స్పష్టం చేయడం అత్యవసర చర్యగా మారింది. విద్యా సంస్థలు, కోచింగ్ కేంద్రాలు, హాస్టళ్లలో మానసిక రక్షణ వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యాలపై పడింది. విద్యార్థుల సమస్యలను వింటూ, నిజమైన సహాయం అందించే మానసిక నిపుణులు విద్యా వ్యవస్థలో భాగం కావాలి. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు సమగ్ర రక్షణ పద్ధతులు అవసరం. అయితే అసలు మార్పు కుటుంబాల్లో మొదలవాలి. పిల్లల జీవితాన్ని ర్యాంకుల పరిమితిలో చూసే పద్ధతి ఆగాలి. విఫలత అనేది అంతం కాదని, మరో అవకాశం అని భావించే ఆలోచన పిల్లలలో పెరిగితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

## స్వప్నానికి సార్థకత



మనలో చాలా మందికి ఒక అనుభవం ఉంటుంది. రాత్రి చూసిన స్వప్నం, మేల్కొన్న తర్వాత కూడా మనసును వదలదు. దానిలో తర్కం ఉండదు, సరైన క్రమం ఉండదు, కానీ ఏదో ఒక చిన్న దృశ్యం మాత్రం స్పష్టంగా గుర్తుంటుంది. అదేకొన్నిసార్లు ఆలోచనలను రగిలించే జ్వాలగా కూడా మారుతుంది. అలాంటి స్వప్నమే ఒక ఆవిష్కర్త జీవితాన్ని మార్చింది. ఆ ఆవిష్కర్త పేరు ఎలియాస్ హోవె. ఆధునిక కుట్టుయంత్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి. అతను తన యంత్ర నమూనాను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు సూది నిర్మాణం ఎలా ఉండాలనే సమస్య అతనిని వేధించింది. సాధారణ చేతి కుట్టు సూదిలో కన్ను పైభాగంలో ఉంటుంది. కానీ యంత్రంలో అదే విధానం పనిచేయలేదు. కాగా, ఒక రాత్రి హోవె ఒక భయానక స్వప్నం చూశాడు. తాను ఒక గిరిజన గూడెంలో బంధించబడి ఉండగా, శిక్ష విధించడానికి అక్కడి వారు సిద్ధమయ్యారు. అతని చుట్టూ ఉన్న యోధుల చేతిలో ఉన్న కర్రల చివర భాగంలో చిన్న రంధ్రాలు కనిపించాయి. ఆ స్వప్నంలో భయం ఎక్కువైనా, అతని దృష్టిని ఆకర్షించింది. ఆయుధం అగ్రభాగానికి దగ్గరగా ఉన్న రంధ్రం అతడికి గుర్తుండిపోయింది. మేల్కొన్న తర్వాత కూడా అతని మెదడు ఆ దృశ్యాన్ని విడిచిపెట్టలేదు. సూది కన్ను పైభాగంలో కాకుండా అగ్రభాగానికి దగ్గరగా ఉంటే? అనే ప్రశ్న అతనిలో పుట్టింది. సూది ముందుభాగంలో రంధ్రం ఉంచడం వల్ల దారం వస్త్రం గుండా సులభంగా కదలగలిగింది. ఈ నిర్మాణమే లాక్‌స్టిచ్ విధానానికి పునాది అయింది. ఆ చిన్న మార్పు కుట్టు యంత్రాల సామర్థ్యాన్ని విప్లవాత్మకంగా మార్చింది. స్వప్నాలు తర్కానికి లోబడవు. అవి ఉపచేతనలో నిల్వైన భావాలు, ప్రయత్నాలు, విఫలాలు అన్నిటినీ విచిత్రమైన రూపాల్లో కలిపేస్తాయి. కొన్నిసార్లు మనం జాగరూక స్థితిలో పరిష్కరించలేని సమస్యను, మన మెదడు నిద్రలో వేరే కోణంలో చూసే అవకాశం కల్పిస్తుంది. హో విషయంలో అదే జరిగింది. భయానక స్వప్నం ఒక సాంకేతిక పరిష్కారంగా మారింది. స్ఫూర్తి ఎప్పుడూ సౌకర్యవంతమైన రూపంలో రాదని, అది సందిగ్ధతలో, విఫల ప్రయత్నాలలో, లేదా ఒక అసంబద్ధమైన స్వప్నంలో దాగి ఉండవచ్చని హోవె ఆవిష్కరణ మనకు గుర్తుచేస్తుంది.

## పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు




**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వరంగల్ కలెక్టర్ సత్య శారదకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, స్కావెంజర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని, మహిళా సంఘాల విలతో సంబంధం లేకుండా నేరుగా పాఠశాల అకౌంట్ నుంచి స్కావెంజర్ల అకౌంట్‌లోకి జీతాలను వేయాలని, పాఠశాలల్లోని పారిశుద్ధ్య కార్మికులతో రిజిస్టర్ మెయింటైన్ చేయాలని ప్రతి నెల ఏ నెల జీతం ఆ నెల నేరుగా స్కావెంజర్ అకౌంట్లోకి వేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కనీసం వేతనం కింద రూ. 26000 కార్మికునికి అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రాళ్ల బండి నిర్మల, కొల్లూరి మేరీ, ఎండి పాషా, సునీత, పోలేపల్లి పద్మ, కాసాని రామారావు, వెండి రవి, భూక్య రవి, కాసాని విజయ, సముద్రాల పాపయ్య, అర్జుల శ్వేత, విజయ, ఐలమ్మ, రాధ, అరుణ, రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలతో కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి లేదు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రభుత్వ నిబంధనలతో కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి లభించడం లేదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్మిక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల్లో నుండి మట్టిని తీసి ఇటుక బట్టీలకు కొద్ది రోజులు ఇచ్చి ఇటుక బట్టీ కార్మికులకు ఉపాధి కల్పించారని, ఇప్పుడు మట్టికి అనుమతులు , వారం, 15 రోజులకు ఒకటి, రెండు సార్లు ఇసుకకు, మొరంకు అనుమతులు ఇస్తున్నారన్నారు. ప్రతిరోజూ ఇసుక మొరంకు అనుమతి ఇచ్చి కార్మికులకు, గృహనిర్మాణ యజమానులకు ఊరట కల్పించాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, జిల్లా నాయకులు తోడేటి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్







**ప్రజాపక్షం/భువనగిరి :** స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం ఎలగందుల అంజయ్య అధ్యక్షతన భువనగిరిలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు సరైన మద్దతు ధరను కల్పించటంలో పాలకులు విఫలం చెందుతున్నారని, పంటలను కొనుగోలు చేయటంలో జరుగుతున్న జాప్యాన్ని నివా రించాలని కోరారు. పంట కొనుగోలు కాక నిరాశ నిస్పృహలతో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని కోరారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వం నామమాత్రంగా కంటి తుడుపు చర్యగా పెంచిన ధరల పత్రాలను, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను భువనగిరిలో గంజి చౌరస్తా వద్ద దహనం చేశారు. సమావేశానికి ఎలగందుల అంజయ్య అధ్యక్షతన వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంఘం నిర్మాణ పటిష్టం చేయాలని, గ్రామ శాఖల సభ్యత్వాలు చేర్పించి గ్రామ కమిటీలు మండల కమిటీలు వేయాలని కోరారు. స్థానిక సంస్థలపై ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొల్లు రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పల కొమురయ్య, పేరు అయినా బంగారు, ఆంజనేయులు, అంబటి అంజయ్య, పకీరనాయక్, మొగుళ్ల తిరుపతిరెడ్డి, బి.సుదర్శన్‌రెడ్డి, సంఘం గణేశా, ఊట్కూర్ కృష్ణ, సిద్ధిరాములు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## అల్పాహారం పాత బిల్లులను తక్షణమే విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



**ప్రజాపక్షం/ములుగు :** పాఠశాలలో జూన్ నుండి ప్రారంభమయ్యే అల్పాహారం పథకం సవ్యంగా జరగాలంటే 2023 ..2024 సంవత్సరానికి సంబంధించిన, అల్పాహారం పాత బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు కమిటీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్, సంపత్‌రావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంపాల రవీందర్ మాట్లాడుతూ 2023....2024 సంవత్సరానికి సంబంధించిన అల్పాహారం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, తద్వారా జూన్‌లో ప్రారంభించే అల్పాహార పథకం సజావుగా జరుగుతుందన్నారు. అలాగే ఈ పథకం వంట కార్మికులతోనే నిర్వహించాలని హరే రామ హరే కృష్ణ లాంటి సంస్థలకు అప్పచెప్పరాదన్నారు. లక్షలాది రూపాయలు కార్మికులకు బకాయిలుగా రావాల్సి ఉంటే వారు జీవించేది ఎలా అన్నారు. కలెక్టర్ స్పందించి పథకం సజావుగా జరగాలంటే పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, ముత్యం కొమురయ్య, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, నాయకులు గున్నాల రాజకుమారి, అంకం పద్మ, భవాని, జనగాం శోభ, మద్దిబోయిన భారతి, భాగ్య, సంగు పోషమ్మ, నార్లగిరి సరిత పాల్గొన్నారు.

## పంటకు మద్దతు ధర కల్పించటంలో పాలకులు విఫలం

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాధం

**ప్రజాపక్షం/పాల్వంచ :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు సరైన మద్దతు ధరలను కల్పించటంలో పాలకులు విఫలం చెందుతున్నారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాధం విమర్శించారు. దాన్యానికి మద్దతు ధర పెంచాలని, రైతుల వద్ద నుండి పంటలను తక్షణమే కొనుగోలు చేయాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కేఎస్‌పి రోడ్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ స్వామినాధన్ కమిటీ సిఫారసులను వెంటనే అమలు చేసి రైతాంగ, వ్యవసాయ రంగాన్ని పటిష్టపరచాలని కోరారు. పంటల మద్దతు గ్యారెంటీచట్టం అమలు చేస్తే కాని వ్యవసాయంలో రైతులు నిలబడగలుగుతారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయటంలో పాలకులు కుంటి సాకులు చెపుతూ ఆలస్యం చేయటం సరికాదని, తక్షణమే పూర్తి పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పది రోజుల వ్యవధిలో నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచబోమని అబద్దాలను ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తూ ఎన్నికల తరువాత నిస్సిగ్గుగా ధరలను పెంచుతూ దేశ ప్రజలను మోసం చేస్తున్నాడని






మండిపడ్డారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయంటూ ధరలను పెంచుతున్నామని చెపుతున్న బిజెపి ప్రభుత్వం ధరలు తగ్గినపుడు ఎందుకు ఎందుకు తగ్గించలేదని ప్రశ్నించారు. ఇప్పటికే వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్న టిఫిన్ సెంటర్లు, హోటళ్ళు మూతపడ్డాయని దీంతో పలువురు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకటరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు కొంగర అప్పారావు, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు బదావత్ శ్రీనివాస్, సాయిలి శ్రీను, పోతుమర్తి కొమురయ్య, కాకటి రవీందర్, ఎస్‌కే. అమీర్, సాయిలు వెంకన్న, ఎస్‌కే. లాల్‌పాషా, అల్లి వెంకటేశ్వర్లు, వాంకుడోత్ సురేష్, భూక్యా విజయ్, బానోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**జవహర్‌నగర్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. రైతు సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు మాట్లాడుతూ మద్దతు ధరల పెంపు ఓ కంటి తుడుపు చర్య అంటూ విమర్శించారు. సామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంటలకు మద్దతు ధరలను పెంచాలన్నారు. అదే విధంగా సామాన్య జనంపై భారం పడనున్న పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. దీని ప్రభావం వ్యవసాయ రంగంపై పడుతుందన్నారు.

# పాత కక్షలతోనే మధు హత్య

## ఐదుగురు నిందితుల అరెస్టు : వివరాలు వెల్లడించిన ఎస్‌పి కె. నరసింహా



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మండలంలోని యల్కారం గ్రామ మాజీ సర్పంచ్ చింతలపాటి మౌనిక భర్త మధు హత్య పాత కక్షలతోనే జరిగినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఈ హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా మరో మహిళ నిందితురాలు పరారీలో ఉంది. నిందితుల నుండి హత్యకు ఉపయోగించిన కత్తి, ఒక కారు, ఒక బైకు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె. నరసింహ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం వెల్లడించారు. మధును శనివారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్ళగడ్డలోని ఓ నివాసంలో అత్యంత దారుణంగా హత్య చేసి యర్కారం గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పి కల్వర్టు కింద గోనె సంచిలో కట్టి పడవేయగా అదే రోజు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. నింధితులను పట్టుకునేందుకు పోలీసులు 5 బృందాలుగా ఏర్పడి గాలించారు. దీనిలో భాగంగా సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో మండలంలోని గ్రామం 65వ జాతీయ రహదారిపై ఖమ్మం హైవే టిజంక్షన్ వద్ద సోమవారం ఉదయం 6 గంటలకు మిద్దె జీవన్, మిద్దె ఆనంద్‌లను అదుపులోకి తీసుకొని వారు చెప్పిన సమాచారంతో ఉదయం 10 గంటలకు అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోని 65వ జాతీయ రహదారి రాజీవ్ పార్కు సమీపంలో చింత సైదులు, మేదరి ప్రసాద్, కక్కిరేణి భరత్ చంద్‌లను అరెస్టు చేశారు. అనంతరం వీరిని విచారణ చేయగా 2007వ సంవత్సరములో ఆ గ్రామ సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య చేసిన కేసులో ప్రధాన నింధితుడుగా ఉన్న చింతలపాటి మధుపై ప్రతీకారం తీర్చుకునేందుకు అతని కొడుకు మిద్దె జీవన్ గత కొన్ని సంవత్సరాలుగా అదునుకోసం ఎదురుచూస్తున్నాడు. దీనిలో భాగంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న మధును కారుతో యాక్సిడెంట్ చేసేందుకు 2020/21లో ప్రయత్నించి విఫలం కాగా మరోమారు ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ దండుమైసమ్మ సమీపంలోని ఫంక్షన్ హాల్ వద్ద హత్యచేసేందుకు విఫలయత్నం చేశాడు. మధును ఎలాగైనా చంపాలని తాళ్ళగడ్డలో తన మిత్రుడు చింత సైదులుకు ఇల్లును అద్దెకు ఇప్పించి మధు హత్యకు సహకరిస్తే రూ. 3 లక్షలు ఇస్తానని సైదులు, అతని భార్య భవానిని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందే వేసుకున్న ప్రణాళికలో భాగంగా హత్యకు కొన్ని రోజుల ముందు సైదులు తాను కిరాయికి ఉంటున్న ఇంటికి అర్వపల్లి మండలం రామన్నగూడెం మేదరి ప్రసాద్, మృతుడు చింతలపాటి మధును దావత్ ఉందని పిలిపించాడు. ఈ ముగ్గురు చికెన్, మటన్‌తో మందుతో దావత్ చేసేవారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం కూడా దావత్ ఉంది రమ్మని సైదులు, ప్రసాద్‌లు మధును ఫోన్ చేసి పిలవగా కుడకుడ రోడ్డులోని తన ఇంటి నుండి సైదులు అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్ళడం జరిగింది. వీరు దావత్ ఖర్చు మొత్తం జీవన్ పెట్టుకున్నాడు. మద్యం ఫుల్‌గా సేవించిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కాపుగాస్తున్న జీవన్‌కు ఫోన్‌చేసి తెలుపడంతో యర్కారం గ్రామానికి చెందిన మిద్దె ఆనంద్‌లు ఇద్దరు రాత్రి 7.30 గంటలకు వారు ఉన్న ఇంటి వద్దకు కారులో చేరుకున్నారు. ప్రసాద్ మధు కాళ్ళు చేతులు పట్టుకోగా అప్పటికే సిద్ధంగా పెట్టుకున్న మటన్ కొట్టే కత్తితో సైదులు మధుపై దాడి చేయగా వెంటనే జీవన్ అదే కత్తిని తీసుకొని మధు మెడ, ముఖం, భుజములపై తీవ్రంగా దాడిచేసి హత్య చేశాడు. అనంతరం మృత దేహాన్ని గోనె సంచిలో కట్టి యర్కారం గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పి కల్వర్టు కింద పడవేశారు. మధు బైక్‌ను ఆనంద్ తీసుకొని బాలెంల శివారులోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో వదిలివేయగా, ప్రసాద్, సైదులు ఓ బైక్‌పై పరారు అయ్యారు. హత్యకు ఉపయోగించిన కత్తి, మధు సెల్‌ఫోన్‌ను అడివెంల శివారులో ఉన్న ఎస్ఆర్ఎస్‌పి కెనాల్‌లో పడేసి అక్కడి నుండి పరారైనట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ హత్య కేసులో నింధితులపై పిడి యాక్ట్ నమోదు చేస్తున్నామని శిక్షలు కఠినంగా పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కేసును త్వరితగతిన చేధించిన సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ, రూరల్ సిఐలు వెంకటయ్య, రాజశేఖర్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు ఏడుకొండలు, శివతేజ, మహేంద్రనాథ్, బాలు నాయక్‌ల తోపాటు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, పట్టణ పోలీసులు, టెక్నికల్ టీమ్‌ను అభినందించారు.

## సాగర్‌లో అగ్నికీలల కలకలం.. దగ్ధమైన జింకల పార్క్...

### ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు దగ్ధం.. విజయ్ విహార్‌కు తప్పిన ప్రమాదం



ప్రజాపక్షం/నందికొండ: మున్సిపాలిటీ పరిధిలోని సిల్క్ కాలనీలో తెలంగాణ పర్యాటక శాఖకు చెందిన విజయ్ విహార్ సమీప జింకల పార్క్‌లో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు మూడువేల మీటర్ల చుట్టుకొలత కలిగిన ఈ పార్క్‌లో ఎండిపోయిన చెట్లు,పొదలు, చెత్త ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో వేగంగా వ్యాపించి విస్తారమైన ప్రాంతం దగ్ధమైంది.మంటలు ఎగసిపడటంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న టూరిజం అధికారులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.జింకల పార్క్ పరిసరాల్లోనే పర్యాటక శాఖ అతిథి గృహాలకు విద్యుత్ సరఫరా చేసే భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.మంటల ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన హై టెన్షన్ విద్యుత్ వైర్లు దగ్ధమైనప్పటికీ, సిబ్బంది సకాలంలో స్పందించడంతో విజయ్ విహార్ హోటల్‌తో పాటు అతిథి గృహాలకు పెను ప్రమాదం తప్పింది.అగ్నిప్రమాదం కారణంగా పార్క్‌లోని వృక్ష సంపద, పొదలు, పూర్తిగా దగ్ధమయ్యాయి.అయితే మంటలు ఎలా చెలరేగాయి ప్రమాదానికి గల అసలు కారణం ఏమిటి అనేది ఇంకా స్పష్టతకు రాలేదు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్,నిర్లక్ష్యంగా పడేసిన అగ్ని అవశేషాలు లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి





ప్రజాపక్షం/మునగాల: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని మొద్దుల చెర్వు స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన గీత రాజయ్య (57), కీత సునిత (40) మునగాల బ్యాంకుకు పని చేసుకుని మాధవరం వెళ్తుండగా మొద్దులచెర్వు స్టేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎక్స్ఎల్ బైకును వెనుక నుండి కారు ఢీకొట్టడంతో తండ్రి, కూతురు లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రత్నం తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం



ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ : వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 85 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 45, జిల్లా గ్రామీణాభివృది 12, సర్వే ల్యాండ్ 17, హౌసింగ్ 3, మున్సిపాలిటీ 4, జిల్లా గ్రామీణాభివృది, పంచాయతీ, యస్‌సి కార్పొరేషన్, విద్యా, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: సామాన్యుడి నడ్డి విరిగేలా కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇటువంటి కాలంలో మద్దతు ధరలను నామమాత్రంగా పెంచి వరి ధాన్యానికి 73 రూపాయలుమాత్రమే పెంచారని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడి ప్రభుత్వం డాక్టర్ స్వామి నాధన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి నేటికి అమలు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు మామిడి నర్సయ్య, జక్కుల రమేష్, ఎల్లావుల రమేష్, అంజయ్య, జక్కుల రమణ పాల్గొన్నారు.

## సహజ కాన్పులను ప్రోత్సహించాలి

ప్రజాపక్షం/అర్వపల్లి : ప్రభుత్వ ఆసుపత్రిలో సహజ కాన్పులు జరిగేలా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రత్యేకంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వైద్యశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. మొబలైజేషన్ ఎయిడ్ సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను క్షయ, కుష్టి వ్యాధిగ్రస్తులకు అందించే సేవల రిజిష్టర్లను, పలు రికార్డులను పరిశీలించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉందని తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్ధ, ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నగేష్ నాయక్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి సుధాకర్, సిహెచ్ఓ బిచ్చు నాయక్, కామేశ్వరరావు, లలిత, సునీత పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 92 దరఖాస్తులు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రజావాణి దరఖాస్తులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రజావాణిలో మొత్తం 92 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌డిఓ సన్యాసయ్య, హౌసింగ్ పిడి సిద్ధార్థ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



ప్రజాపక్షం/చింతపల్లి : ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తక్షణమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద నాగార్జున సాగర్ రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నా మండల పరిధిలో ఏర్పాటు చేసిన చింతపల్లి, తీదేడు, కుర్మేడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వరి ధాన్యం తరలించేందుకు సరిపడ లారీలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు, హమాలీల కొరత ఏర్పడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవైపు ఇప్పటికైనా వందలాది వరి ధాన్యం కుప్పలు మార్కెట్లలో నిలువ ఉండడంతో ఎప్పుడు వర్షం వచ్చి ధాన్యం తడుస్తుందేమోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు అధికారులు, ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పండించిన పంటను సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడి వరి ధాన్యం అక్కడే మిగిలిపోయిది. నెల రోజుల నుంచి మార్కెట్ యార్డులలో వరి ధాన్యం ఉంచినప్పటికీ కొనే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోనె సంచులు ఇవ్వకుండా, వరి ధాన్యం తరలించుటకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచ కుండా, హమాలీలను ఏర్పాటు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి సకాలంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరారు.



## విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

### ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల కేంద్రంలోని మహిళా శక్తి భవన్ ఎదుట 8వ రోజుకు చేరిన వివోఏల సమ్మెకు మద్దతుగా అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ సంపూర్ణ సంఘీభావ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వీవోఏలు నిరుపేద మహిళలకు పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అనేక సేవలు చేస్తూ మహిళలకు పెద్దపీట వేస్తున్నాం అంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఓఏ ల పై చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలలో వివోఏలకు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేటికీ వారి సమస్యలు పరిష్కరించకపోగా గత 8 రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న వివోఏ ల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సెర్ప్ ఉద్యోగుల గుర్తించి, కనీస వేతనం 20వేల రూపాయలు ఇస్తూ, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని అన్నారు. సంఘాల డాటా ఎంట్రీ చేయడానికి ట్యాబ్లు అందించాలని, వివోఏ ల కాలపరిమితి 58 జీవోను సవరించాలని వీరి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు అధ్యక్షులు చెగూరి బాలమణి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహ చారి, కనక బోయిన నందు, వివోఏలు మద్దెల ఇందిర, బత్తిని పద్మ, గాదె లక్ష్మి, ఎడమ లావణ్య, కళ్లెం సబిత,కొత్త మానస, చాడ అలివేలు, అన్నెపర్తి బిక్షపతి, నవనీత తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫ్ నెహర్ కాలువ మరమ్మతుల్లో జాప్యం- ఆందోళనలో రైతులు



ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని గ్రామాల గుండా వెళ్ళే పురాతన ఆసిఫ్ నెహర్ కాలువ మరమ్మతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంకా పూర్తికాక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాలువ మరమ్మతుల పేరుతో నీటి సరఫరాను నిలిపివేసిన అధికారులు పనులను వేగంగా పూర్తి చేయడంలో విఫలమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరి నారు పోసుకొవడానికి కృత్తిక, రోహిణి కార్తెలను ఉత్తమమైనవిగా రైతులు భావించి తమ వ్యవసాయ పనులు మొదలూ పెడతారు. మే 25 నుండి రోహిణి కార్తె మొదలైంది.కానీ సాగు పనులు ప్రారంభించాల్సిన సమయంలో నీరు అందకపోవడంతో పంటల సాగుపై అనిశ్చితి నెలకొంది.ఖరీఫ్ సీజన్కు ముందే కాలువ మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉండగా, ఈసారి పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. కాలువల్లో పూడిక తొలగింపు, గండ్ల పూడ్చివేత, చెదిరిపోయిన గోడల మరమ్మతులు వంటి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీనివల్ల రైతులు నారుమడులు వేయడం, భూమి దున్నడం వంటి వ్యవసాయ పనులు చేపట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.నీటి కోసం పూర్తిగా సాగునీటి కాలువలపైనే ఆధారపడే రైతులకు ఈ పరిస్థితి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. సమయానికి నీరు అందకపోతే విత్తనాల విత్తకం ఆలస్యం అవడంతో దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఎరువులు, విత్తనాల ధరలు పెరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో సాగునీటి సమస్య మరింత భారంగా మారింది. అధికారులు కేవలం మరమ్మతుల పేరుతో పనులు ప్రారంభించడం కాకుండా వాటిని నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలి. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను వేగవంతం చేయాలి. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. కాబట్టి ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే కాలువ మరమ్మతులు పూర్తి చేసి సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజావాణికి వస్తే తాగునీరు కరువు

### కలెక్టర్ కార్యాలయంలోనే దారుణ పరిస్థితి

### పట్టించుకోని అధికారులు..ప్రజల్లో ఆగ్రహం



ప్రజాపక్షం/నల్లగొండ :ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కనిపించింది.ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్న తరుణంలో సాక్షాత్తు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే మంచినీటి సౌకర్యం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వృద్ధులు,మహిళలు,వికలాంగులు,రైతులు తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తుంటారు. గంటల తరబడి కార్యాలయ ప్రాంగణంలో వేచి ఉండాల్సి వస్తున్నా తాగేందుకు సరిపడా మంచినీరు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్లు పని చేయకపోవడం,కొన్ని చోట్ల నీరు లేక ఖాళీగా ఉండడం వల్ల ప్రజలు నీటి కోసం అల్లాడిన పరిస్థితి కనిపించింది.ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు కనీస అవసరమైన త్రాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రజావాణి వంటి ముఖ్యమైన కార్యక్రమానికి వచ్చే ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

## నిర్దేశిత గడువులోగా భూముల మార్కెట్ విలువల నవీకరణ

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం భూముల మార్కెట్ విలువల నవీకరణను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.ఈప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు.సోమవారం ఉదయాదిత్య భవనంలో సబ్ రిస్ట్రార్లు, తహసిల్దార్‌లు,ఎంపీడీవో లతో భూముల మార్కెట్ విలువల పై సమీక్ష నిర్వహించారు.జీవో నెం.41 ప్రకారం భూముల మార్కెట్ విలువల (మార్కెట్ వాల్యూ) నవీకరణ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అర్బన్, రూరల్ కేటగిరీలుగా విభజించి ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి 1,2,3,4 ఫారమ్‌ల ఆధారంగా ప్రాంతాల వారీగా రహదారులు,మండల కేంద్రాలు, నియోజకవర్గ పరిధులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని భూముల విలువలను అంచనా వేస్తున్నట్లు చెప్పారు.ల్యాండ్ విలువలను పరిశీలించి ఆర్డీవో స్థాయిలో అప్లోడ్ చేస్తున్నామని,అనంతరం మార్కెట్ విలువలను ఫైనల్ చేసి కమిటీ ఆమోదానికి పంపనున్నట్లు తెలిపారు. అర్బన్ కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా ఉండగా,మున్సిపల్ కమిషనర్, జెడ్పీసీఈఓ,సబ్‌రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. రూరల్ కమిటీలో ఆర్డీవో చైర్మన్‌గా,సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, ఎంపీడీవో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు.అగ్రికల్చర్ భూములకు కనీస మార్కెట్ విలువ రూ.2.75 లక్షలు,మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు,హెచ్‌ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు ఉండాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి,మిర్యాలగూడఆర్‌డిఓ రమణా రెడ్డి,దేవరకొండఆర్‌డిఓ ప్రియదర్శిని,సబ్ రిజిస్ట్రార్లు,తహసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## బాధితులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బాధితులు నేరుగా ఎటువంటి మధ్యవర్తులు లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించి ఆయన మాట్లాడారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రోడ్డుపై బైఠాయించి అన్నదాతల ధర్నా



ప్రజాపక్షం/కాటారం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్నదాతలు సోమవారం కాటారం మార్కెట్ యార్డు వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. జయశంకర్ జిల్లా కాటారం మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం రోజుల తరబడి నిల్వ ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం కాంటా వేసి లారీలు రాకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండడంతో వర్షాలుపడితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. మిల్లులకు తరలించేందుకు లారీలు లేకపోవడంతో కొందరు రైతులు ప్రయివేటు లారీలు, ట్రాక్టర్లను మాట్లాడుకుని మిల్లులకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా పలు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని రోజుల తరబడి లారీలకోసం నిరీక్షిస్తూ కాపలా కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్దిరోజుల క్రితం ధన్వాడ బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించిన రైతులు ధర్నాకు దిగి నిరసన తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ ఖాన్ 42 వడదెబ్బకు గురై ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం తీవ్ర ఎండల కారణంగా అస్వస్థతకు గురైన సయ్యద్ ఖాన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గత రాత్రి మృతి చెందాడని వివరించారు. మృతునికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి అండగా నిలిచే పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## గూడూరు పోలీసులు కార్డన్ సెర్చ్

భారీగా గుడుంబా సామగ్రి స్వాధీనం



ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పోలీసులు నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.జిల్లా ఎస్పీ డా శబరీష్ ఆదేశాల మేరకు గూడూరు సీఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి పోలీసులు సిబ్బంది సోమవారం తెల్లవారుజామున ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో గ్రామంలోని సుమారు 180 ఇండ్లు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు తనిఖీల సమయంలో సరైన పత్రాలు నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా నిల్వ ఉంచిన 80 కిలోల నల్లబెల్లం 25 లీటర్ల గుడుంబా 20 కిలోల పట్టిక 8 బీర్ బాటిళ్లు ఒక ఫుల్ లిక్కర్ బాటిల్ ను పోలీసులు పట్టుకున్నారు.గుడుంబా తయారీలో ఉపయోగిస్తున్న సుమారు 380 లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల అనంతరం గ్రామస్తులు సమావేశమైన పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణ గంజాయి మత్తు పదార్థాల దుష్ప్రభావాలు గ్రామాల్లో సీసీ కెమెరాల అవసరంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.గ్రామ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా గంజాయి విక్రయాలు దుడుంబా తయారీ లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్ టీజీఎస్పీ ఏఆర్‌ఫోర్స్‌కు చెందిన మొత్తం 56 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/మరిపెడ: బడుగు బలహీన వర్గల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు.సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆడిటోరియంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి 78 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లడుతూ,సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలుస్తూ ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని అన్నారు.పేదల సంక్షేమానికి అనేక పథకాలు కొనసాగిస్తున్నామ్,అధిక నిధులు తెచ్చి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటు సేవ చేస్తున్నానని అన్నారు.అనంతరం మరిపెడ బిసి డిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన వంటల పోటీల కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం లచ్చతండ జిపి లో 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గ్రామ సంఘం పేదరికం భవనానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల అధ్యక్షులు రఘువీర్ రెడ్డి,రాంలాల్,తహసిల్దార్ కృష్ణవేణి,సిడిపిఓ ఎల్లమ్మ,ఆర్ఐ శరత్ చంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి



ప్రజాపక్షం/బచ్చన్నపేట: జనగామ పట్టణంలోని పంచకోసిల్ల సమీపంలో సోమవారం హైవే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చంపక్ హిల్స్‌లోని ఎంసీహెచ్ ఆసుపత్రి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో బచ్చన్నపేట మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల వెంకటేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు బసిరెడ్డిపల్లి సర్పంచ్ మల్లయ్య కుమారునిగా స్థానికులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో బసిరెడ్డిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మహిమాన్వితం...కాళేశ్వర క్షేత్రం

### సరస్వతి అంత్య పుష్కరాలకు తండోపతండాలుగా తరలి వస్తున్న జనం

పుష్కర స్నానాలతో భక్తి పారవశ్యంలో భక్తులు

పుష్కర స్నానం ఆచరించిన పీఠాధిపతి యోగానంద సరస్వతి

భక్తులకు అసౌకర్యం కల్గకుండా పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్





ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వర నివాసోవా, కాళేశ్వర నీరిక్షణం, కాళేశ్వరస్య స్మరణం సర్వ పాప వినాశనం అని స్తుతిస్తూ భక్తులు త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం కాళేశ్వరం క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి ఉదయం నుండే తరలివచ్చిన భక్తులు త్రివేణి సంగమ పుణ్య నదిలో పుష్కర పుణ్యస్నాణాలు ఆచరించారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమ తీరం భక్తుల తాకిడి పెరిగి కిక్కిరిసిపోయింది. మూడు నదుల కలయికతో సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమ తీరానికి భక్తులు తమ కుటుంబాలతో తండోపతండాలుగా చేరుకుని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలాచరించారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానాలాచరించిన భక్తులు పులకించి నదీమాతల్లికి నీరాజానాలు అర్పిస్తున్నారు. కాగా 5వ రోజు కూడా పుష్కర భక్తుల తాకిడీ భారీగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నమయ్యారు. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది ప్రవాహంలోకి వెళ్లకుండా ఉండేందుకు,లోతు ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు,గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను పహరా ఏర్పాటు చేసి బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు నదీ తీరంలో భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**పుష్కర స్నానం ఆచరించి పీఠాధిపతి**

కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాల్లో భాగంగా సోమవారం ఆదిలాబాద్ కు చెందిన రామకృష్ణ గోపాలమఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య త్రివేణి సంగమ సరస్వతీ నదిలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుభానంద, సరస్వతీ మాతలను దర్శించుకున్నారు. పీఠాధిపతికి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి శేష వస్త్రలు అందించి సన్మానించారు. అనంతరం భక్తులకు పీఠాధిపతి మంగళ శాసనాలు అందించారు.

**పుష్కర భక్తులకు అసౌకర్యం కల్గకుండా పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం త్రివేణి సంగమ తీరానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు త్రివేణి సంగమ పుణ్య నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీ కొనసాగుతున్నప్పటికీ, ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భక్తులకు తాగునీరు, శానిటేషన్, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే భక్తులు సహకరించి, అధికారులు సూచనలు పాటిస్తూ పుష్కర స్నానాలు ఆచరించాలని కలెక్టర్ సూచించారు. ఏదైనా అస్వస్థతకు గురైతే వెంటనే 108, అత్యవసర వైద్య సేవల కేంద్రాల్లో వైద్య సేవలు తీసుకోవాలని తెలిపారు.

## అగ్ని ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నాం: ఎస్పీ



ప్రజాపక్షం/మహాదేవపూర్: మేడిగడ్డవద్ద జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వెల్లడించారు.సోమవారం మండలంలోని అంబట్ పల్లి గ్రామ సమీపంలో ఎల్ అండ్ టి గెస్ట్ హౌజ్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించారు.ఈ సందర్భంగా అగ్ని ప్రమాదానికి గల కారణాలు,జరిగిన నష్ట వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఘటనపై పూర్తిస్థాయి విచారన చేపడుతున్నామని తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబందిత అధికారులకు సూచించారు.అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం అందిన వెంటనే సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తగిన చర్యలు చేపట్టారని అన్నారు.అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారం అందించిన వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు.డిఎస్పీ సూర్యనారాయణ, ఎస్సై పవన్ కుమార్ఉన్నారు.

## కబ్జాకోరులను ఉపేక్షించేది లేదు

రూ.103 లక్షలతో 30,31 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని



ప్రజాపక్షం/హనుమకొండ: మహా నగరంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపడుతున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున 30,31 డివిజన్ పరిధిలలో రూ 103 లక్షలతో సైడ్ డ్రైనేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్ణీత గడువులోగా పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా చూడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాయంపేట డివిజన్ గ్రామీణ వాతావరణంలో నుంచి పట్టణ వాతావరణం దిశగా అభివృద్ధి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా హయాంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నియోజవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు, నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో ప్రజలను మోసం, ఎన్నో భూములను కబ్జా చేసి ఇంకా సరిపోలేదని ఇప్పుడు తప్పడు ప్రచారాలతో దేవుడి పేరుతో భూములను కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంట్లో కుటుంబ సభ్యులకు అన్యాయం వేసిన మీరు నాపై మాట్లాడటం సిగ్గుచేటు. గడిచిన రెండున్నర ఏళ్లలో ఎక్కడైనా భూములు ఖబ్జాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. భద్రఖాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా అడ్డుపడుతున్నావ్, నీ హయాంలో శాయంపేట జరిగిని కబ్జాలు అన్ని ప్రజలకు తెలుసు. తాను 5 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న పర్వాలేదు కానీ నా హయాంలో భూ కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా సరే క్షమించను అన్నారు. ప్రజల నుంచి మాట రాకుండా,మచ్చ లేని పరిపాలన అందివ్వడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. రాజకీయంగా పరిపాలన పరమైన విమర్శలు చేయాలి కానీ ఇష్టమొచ్చిన మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మీరు మారుతారని ఆశిస్తు ఇన్ని రోజులు ఓపికపట్టామని అన్నారు. ఇలాంటి భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వం మరియు వ్యక్తిగత భూములను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో మహిళా వారోత్సవాలలో భాగంగా ఖిలా వరంగల్ మండలంలోని పుప్పాలగుట్ట పిహెచ్‌సిలో నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంప్‌ను జిల్లా కలక్టర్ డాక్టర్ సత్య శారద సోమవార సందర్శించారు. ఈ సందర్భనలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణితో కలిసి క్యాంపులో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలను పరిశీలించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొంటూ ప్రతి మహిళా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమశాఖ అధికారి రాజమణి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సాంబశివ రావు, ఖిలా వరంగల్ తహసీల్దారు ఇక్బాల్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు సరైన పోషకాహారం తీసుకునేలా అవగాహన

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/హనుమకొండ: గర్భిణీలు సరైన పోషకాహారం తీసుకునే విధంగా అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25 నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని పోషణ మేళా, వంటల పోటీ, గర్భిణులకు రక్త పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లా మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో జరుగుతున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. గర్భిణులు సరైన పోషక ఆహారాన్ని తీసుకునేవిధంగా అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. రెండు సంవత్సరాల వరకు పిల్లలకు నూనె, సాల్ట్, షుగర్ ఇవ్వకూడదన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రతిరోజు పోషకాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ మాట్లాడుతూ సమతుల ఆహారం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అయ్యేవరకు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరైన సమయంలో గర్భిణీలు టీకాలు వేసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని అందించిన వాళ్ళవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు స్వరూప, స్వాతి, ఏసిడిపిఓ సింధూరాణి, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ డిసి సుమలత, డిపిఏ, బీసీ లు డిఎంసీ కళ్యాణి,సిబ్బంది అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

## పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం రక్షణ కవచం

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ప్రజాపక్షం/ములుగు: పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం ఒక రక్షణ కవచంలా ఉంటుందని, పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం...2013పై ప్రతి మహిళలను వేధిస్తే చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడతాయని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో భాగంగా మహిళల భద్రత... రక్షణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. పోష్ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయం లో 10 మందికి పైగా ఉద్యోగులు ఉంటే అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వేధింపులకు గురైన మహిలలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై నిర్దేశిత గడువులోపు చర్యలు తీసుకునేలా చూస్తామని అన్నారు. పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. మహిళా ఉద్యోగుల భద్రతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమాధికారి ప్రేమలత మాట్లాడుతూ జిల్లాలో మే 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఘనంగా మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోష్ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. బాల్య వివాహం..బతుకు ఆగం అనే నినాదంతో బాల్య వివాహాల రహిత ములుగు జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ చంద్రకళ, ఆర్‌డిఓ వెంకటేష్, డిఎస్‌పి కిషోర్, జిల్లా అధికారులు, సిడిపిఓలు, మండలాల ఎంఆర్ఓలు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించాలి

కలెక్టర్‌ను కోరిన టియుడబ్ల్యూజె (ఐజెయు) నాయకులు

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను కోరింది.ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో జర్నలిస్టుల పిల్లలు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తోందని పేర్కొన్నారు.ప్రస్తుతం విద్యా ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో జర్నలిస్టు కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అందువల్ల గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరానికి కూడా జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా సంబంధిత అధికారులకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి డీఈఓను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జిల్లా కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ బొల్లారం, కోశాధికారి అమర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కంకణాల సంతోష్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## బాల్యాన్ని బలోపేతమే అంగన్‌వాడీల ప్రధాన లక్ష్యం

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి: ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు గల ఆహారం అందించి బాల్యాన్ని బలోపేతం చేయడం అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో తొలి రోజు సోమవారం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సే నో టు జంక్ ఫుడ్ అనే నినాదంతో ప్రత్యేక ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, ఇతర పోషకాహార పదార్థాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలను వివరించారు. ఈ స్టాల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి వివిధ వంటకాల తయారీ విధానం, వాటి పోషక ప్రయోజనాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి అనే నినాదంతో నేటి నుండి ఈ నెల 30వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన, సమతుల్య ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బయట మార్కెట్లో లభించే జంక్ ఫుడ్‌ను చిన్నపిల్లలకు ఇవ్వకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న తాజా కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు వంటి పోషకాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు ఈ దిశగా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళలు, చిన్నపిల్లల కోసం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పనిచేస్తున్న ఆయాలు, టీచర్లు, పిల్లల తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి మల్లీశ్వరి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహణ: కలెక్టర్

ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరం క్షేత్రంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం సరస్వతి ఘాట్ వద్ద భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్ మరియు అత్యవసర వైద్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ భక్తులతో కలిసి ఫోటోలు దిగారు. పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి మరియు సాంస్కృతిక కార్యక్రమాలను తప్పక వీక్షించాలని భక్తులకు సూచించారు. అనంతరం ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ వైద్యులతో మాట్లాడారు. అత్యవసర సేవల కోసం వచ్చే భక్తులకు తక్షణమే చికిత్స అందించి,పూర్తిగా కోలుకున్న తరువాత మాత్రమే వారిని పంపించాలని వైద్యులకు ఆదేశించారు. అలాగే పుష్కరాలకు వచ్చే ప్రతి భక్తునికి ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత మరియు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిపిఆర్వో శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, దేవాదాయ శాఖ డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్
మంగళవారం
26-05-2026
www.prajapaksham.in

‘ తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహా సభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికపై కళాకారులు తమ ఆట పాటలతో సభికులను మైమరిపించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ప్రజానాట్యమండలి కళాకారుల బృందం ప్రదర్శించిన ఒగ్గు కథలో భాగంగా రేణుక ఎల్లమ్మ కథా పర్వంతో సభికులను ఆకట్టుకున్నారు. ’











# కళాకారుడి గళం

(మొదటి పేజీ తరువాయి)

నారాయణగూడలోని మార్వెల్ పంక్షన్‌హాల్‌లో సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ తెలంగాణ ప్రజానాట్యమండలి పతాకాన్ని ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. మహాసభల ఆహ్వానం సంఘం ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగంహేమంతరావు, కలవేన శంకర్, వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్‌లు పాల్గొన్నారు. సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు కుల వివక్షత, వెట్టిచాకిరి, భూస్వాముల దురాగతాలు, దౌర్జన్యాలు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ నాయకుడి కంటే ముందు కళా కారుడి గొంతు వెళ్లి నిలబడిందన్నారు. ఎక్కడ ఇబ్బందులు జరిగిన వాటిలో నుంచే కళా రూపాలను సృష్టించి పాటల రూపంలో ఎండగడుతూ వస్తోందని తెలిపారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇప్టా)పై నిషేధం విధించిన క్రమంలో తమ గొంతులను ఇతర వేదికల ద్వారా వినిపించేందుకు అనేక మంది ప్రజానాట్యమండలి కళాకారులు సినీ రంగం వైపు వెళ్లి అందులో రాణించారని గుర్తు చేశారు. అంత గొప్ప చరిత్ర గలిగిన ప్రజానాట్యమండలి కళాకారులంతా అణగారిన ప్రజల సమస్యలపై కళా రూపాలతో గొంతెత్తి నినాదించాలని సూచించారు. మనిషి పుట్టుక నాటి నుంచే కళలు ఉన్నాయని, కానీ వాటికి ఓ రూపం ఇచ్చి ప్రజా కళలుగా మార్చింది ప్రజానాట్యమండలి అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల భావాలకు కళా రూపం అందించి వారి గొంతుకగా మారిందన్నారు. ఆట, పాట, డప్పు, దరవు, జానపథం ప్రతి కళకు రూపమించింది ప్రజానాట్యమండలేనని, రాష్ట్రంలో పుట్టిన ప్రతి సంస్కాతిక, కళా సంస్థలకు మాతృక ప్రజానాట్యమండలేనని గుర్తు చేశారు. సాంస్కృతిక పరంగా కళలు ఎన్ని రూపాల్లో ఉన్నా అంతిమంగా మనిషికి మంచి జరగాలన్న గొప్ప లక్ష్యం ప్రజానాట్యమండలిదన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ దేశంలో ఇప్టా దానికి అనుబంధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజా నాట్యమండలి ఒక గొప్ప ఆశయంతో పుట్టిన సంస్థలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన తెలంగాణ ప్రజానాట్యమండలి ఈ ప్రాంత విముక్తికి వెన్నదన్నుగా నిలిచిందన్నారు. సమస్యలను ఎవరో ఒక్కరూ పరిష్కరిస్తునే ఉంటారని, కానీ సమస్యలే లేకుండా అధికారం చేపట్టేందుకు మహాత్తర శక్తి, ధైర్యం ఉన్న సంస్థ ప్రజా నాట్యమండలి కళాకారులుగా సమ సమాజ స్థాపన అశయంతో ముందుకు సాగాలని సూచించారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మట్టి మనుషులతో బందూకులు పట్టించిన మహాత్తర శక్తి కళా రూపాలదని, ప్రజానాట్యమండలిదని పేర్కొన్నారు. తుపాకీ ‘తుటా’ కంటే ‘పాట’ పదునైనదని, అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రజల గొంతుకను వినిపించాలని సూచించారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తిలోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భాభంలో సైతం ప్రజానాట్యమండలి కీలక పాత్ర పోషించిందని, ఆ దిశగా ఎప్పుడు ముందుకు కొనసాగాలని ఆకాంక్షించారు. సభలో తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్రఅధ్యక్షులు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న తెలంగాణ ప్రజానాట్యమండలి కళా ప్రదర్శన ‘ప్రజా కళాకారులం’ అని డబ్బు దరువుల మధ్య ఆట పాటలతో కళాకారులు ప్రదర్శనగా ముందుకు సాగారు. కళా ప్రదర్శనలో అనేక కళారూపాలను ప్రజానాట్యమండలి కళాకారులు పరిచయం చేశారు. తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్రమహాసభల సందర్భంగా సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం నుంచి నారాయణగూడలోని మార్వెల్ ఫంక్షన్ హాల్ వరకు కళా ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒగ్గు కళాకారులు, యక్షగానం, బుర్రకథ, వీధి బాగోతాల కళా బృందాలు తమ ప్రదర్శనలతో ఆలరించాయి. రెండు కిలో మీటర్ల మేరకు సాగిన కళా ప్రదర్శనను ప్రయాణికులు రోడ్డుకు ఇరువైపుల బారులు తీరి తిలకించారు.

**ఆట పాటలతో అదిరిపోయిన బహిరంగ సభ వేదిక**

తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహా సభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికపై కళాకారులు తమ ఆట పాటలతో సభికులను మైమరిపించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ప్రజానాట్యమండలి కళాకారుల బృందం ప్రదర్శించిన ఒగ్గు కథలో భాగంగా రేణుక ఎల్లమ్మ కథా పర్వంతో సభికులను ఆకట్టుకున్నారు. హనుమకొండ జిల్లాకు చెందిన మహిళా కళాకారుల బృందం సినిమా సన్నివేశాలను తలదన్నేలా కోలాట నృత్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన కళాకారులు తమ ఆట పాటలతో సభను ఉత్తేజపరిచారు. ఖమ్మం జిల్లాకు చెందిన కళాకారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై చిలక జోస్యంతో సభికులను ఆలోచింపజేశారు. నల్లగొండ జిల్లా బుర్రకథ కళాకారులు తమ కళా ప్రదర్శనతో అదరహో అనిపించారు.











## దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే కీలక షెడ్యూల్ పూర్తి

దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం తన 41వ చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. రవి నెలకుడితి దర్శకత్వంలో నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బ్యానర్ నుంచి వస్తున్న 10వ చిత్రం. దుల్కర్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, అద్భుతమైన భావోద్వేగాలతో కూడిన అందమైన ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కుతోంది.తాజాగా చిత్ర బృందం మంచుతో కప్పుకున్న అద్భుతమైన ప్రకృతి మధ్య కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసింది. సెట్స్ నుంచి విడుదలైన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. వింటర్ అవుట్ ఫిట్స్‌లో దుల్కర్ ఆకట్టుకున్నారు, పూజా హెగ్డే కూడా తన అందమైన ప్రెజెన్స్‌తో ప్రత్యేకంగా కనిపించారు.ఈ ఫోటోలు షూటింగ్ సమయంలోని రియల్ మూమెంట్స్‌ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఒక ఫోటోలో వర్షపు జల్లుల మధ్య గొడుగుల కింద దుల్కర్, పూజా కలిసి నవ్వులు పంచుకుంటూ కనిపిస్తే, మరో ఫోటోలో బ్యాక్‌ప్యాక్స్, తాడుపై వంతెన, పర్వత ప్రాంత ప్రార్థనా జెండాల మధ్య ట్రావెల్ మూవీ ఫీల్‌ను తీసుకొచ్చేలా ఉంది. మరో ఫోటోలో అడవుల మధ్య ఉన్న ఆలయం ముందు మొత్తం చిత్ర బృందం కలిసి కనిపించింది. దుల్కర్, పూజా కలిసి నటిస్తున్న తొలి చిత్రమిది. వారి మధ్య కనిపిస్తున్న సహజమైన కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రానికి అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డిఒపి: అనయ్ ఓం గోస్వామి.

## గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ కానున్న ‘దీవాన’



శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘దీవాన’. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా జూన్ 19 న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల కానుందని నిర్మాతలు ప్రకటించారు. దీవాన పోస్టర్‌తో ఇది ఒక వన్ సైడ్ లవ్ స్టోరీలో ఉన్న మ్యాడ్‌నెస్ చూపించబోతున్నారు. ఈ వన్ సైడ్ లవ్ స్టోరీ ఇప్పటికే సాంగ్, టీజర్ వంటి ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ‘దీవాన‘ సినిమా టీజర్‌కు, పాటలకు మంచి లభిస్తోంది. సింగర్ కార్తీక్ పాడిన ఇది ప్రేమా .. ఇది ప్రేమా..’ సాంగ్ ఛాట్ బస్టర్‌గా మారింది. యూత్ ఆడియెన్స్‌లో ‘దీవాన’ సినిమా పట్ల మంచి క్రేజ్ ఏర్పడుతోంది.ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై మరియు దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. హర్షిత్ రెడ్డి సరసన స్నేహ మణిమేగలై హీరోయిన్. నటిస్తున్నారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్స్ మానస, ప్రొడక్షన్ డిజైనర్ ఝాన్సీ గోజల, ఎడిటర్ హృషికేశ్ పాస్పల్, డిఒపి వంశీ పచ్చిపులుసు, మ్యూజిక్ ఈశ్వర్ చంద్. ప్రొడ్యూసర్స్ వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి, స్క్రిప్ట్, డైరెక్షన్ శ్రీకాంత్ సంగిశెట్టి.

## 28న థియేటర్‌లలోకి ‘బ్లాస్ట్ జోన్’

రీల్



యాక్షన్ కింగ్ అర్జున్, ప్రీతి ముకుందన్, అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘బ్లాస్ట్ జోన్’ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా విడుదల చేస్తోంది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రానికి ‘కెజిఎఫ్’ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించడం విశేషం. మే 28న ఈ చిత్రం థియేటర్‌లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా యాక్షన్ కింగ్ అర్జున్ మాట్లాడుతూ ఈ ‘బ్లాస్ట్ జోన్’ సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది. మన తల్లిదండ్రులకో, మన వాళ్ళకో అన్యాయం జరిగితే న్యాయం కోసం మనం ఖచ్చితంగా పోరాడతాం. అయితే ఈ సమాజంలో ఎవరికీ అన్యాయం జరిగినా పోరాడాలి అనే సందేశాన్ని ఈ సినిమా చెబుతుంది. ఎవరో వచ్చి మనల్ని కాపాడతారు అని ఎదురు చూడకుండా, మనలని మనం కాపాడుకోవడానికి ఏం చేయాలి? తల్లిదండ్రులుగా ఆడబిడ్డల్లో ధైర్యాన్ని ఎలా నింపాలి? వంటి అద్భుతమైన అంశాలు ఇందులో ఉంటాయి. నేను ఎన్నో సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు చేశాను. కానీ, ఈ సినిమాలో అభిరామి, ప్రీతి ముకుందన్ నాకంటే బాగా ఫైట్లు చేశారు. ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొంది, ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ‘బ్లాస్ట్ జోన్’ సినిమాలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. రవి బస్రూర్ అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు. నేపథ్య సంగీతం కోసం ఏకంగా 4045 రోజులు కేటాయించారు. ఇది మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రం 'బ్లాస్ట్ జోన్'. ఈ సినిమాను మీరందరూ మే 28న థియేటర్‌లలో చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. నటి అభిరామి, దర్శకుడు సుభాష్ కె రాజ్, అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఐశ్వర్య కల్పాత్తి మాట్లాడారు.

## ‘సింగిల్ రాజు’ టైటిల్ గ్లింప్స్ విడుదల



టాలీవుడ్‌లో మరో అందమైన గ్రామీణ ప్రేమ కథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మౌనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, యువ దర్శకుడు ఎస్.ఎస్. వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం ‘సింగిల్ రాజు’. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ విడుదల కార్యక్రమం ‘మా ఈవెంట్స్’ సహకారంతో హైదరాబాద్‌లోని ప్ర సాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా ‘సింగిల్ రాజు’ టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ ఎస్.ఎస్. వర్మ, విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమా కథ వినగానే చాలా ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఎంతో ధృడ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించారు. చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. చిత్ర యూనిట్ మొత్తం మంచి కష్టపడి పనిచేస్తోంది. ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మాట్లాడుతూ వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. ప్రేక్షకులను తప్పకుండా అలరించే మంచి ఎంటర్‌టైనర్‌గా ‘సింగిల్ రాజు’ నిలుస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.హీరో విశ్వస్ మాట్లాడుతూ దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మేము ఎంతో ఫ్యాషన్ తో చేస్తున్న సినిమా. ఈ చిత్రానికి పాటలు: గోరటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్,ఛాయాగ్రహణం: సాయితేజ కుందారపు, నితీష్,ఎడిటింగ్: యునిక్ బొజ్జపల్లి, ప్రొడక్షన్ డిజైనర్: రాజ్ మామిడి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాఘవేందర్ వర్మ.

## ‘సింగ్ గీతం’ లాంటి కాన్సెప్ట్‌తో ఇప్పటివరకు రాలేదు

### సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ ‘సింగ్ గీతం’ తో ముందుకు వస్తున్నారు. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సంగీతం, 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్ లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. ఐకానిక్ మూకీ చిత్రం 'పుష్పక్' నుంచి విజనరీ సైన్స్ ఫిక్షన్ క్లాసిక్ 'ఆదిత్య 369' వరకు ఆయన క్రియేటివిటీకి పర్యాయపదంగా నిలిచారు. కమల్ హాసన్‌తో ఆయన చేసిన 'విచిత్ర సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' బెంచ్ మార్క్ సినిమాలుగా నిలిచాయి. ఇప్పుడు, భారతదేశపు మొట్టమొదటి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందించబడిన 'సింగ్ గీతం'తో అలరించబోతున్నారు.వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజెండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, ‘హలో బాసు’ టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ‘సింగ్ గీతం’ జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది మీట్ అవర్ వైజాగ్ హీరో ఈవెంట్ నిర్వహించారు.లైవ్ వీడియో కాల్‌లో దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో పనిచేయడం నిజంగా ఒక అదృష్టం. అలాంటి అవకాశం చాలా అరుదుగా వస్తుంది. ఆయన కోసం అయినా ఈ సినిమా తప్పకుండా చూడాలి. ‘సింగ్ గీతం’ ఒక కంప్లీట్ మ్యూజికల్ ఫిల్మ్. ఈ సినిమా కోసం మేమంతా ఎంతో మనసుపెట్టి పనిచేశాం. ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమాను ఎంతో ఇష్టపడతారని నమ్ముతున్నాను అని అన్నారు. హీరో ఈవెంట్ లో హీరో అయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి. తులసి పాల్గొన్నారు.

## ‘సోల్ ఆఫ్ ‘సహా’ గ్లింప్స్ రిలీజ్



కొన్ని కథలు మనసులో ఎప్పటికీ నిలిచిపోతాయి.మన జీవితంలో ఎప్పుడో అనుభవించిన భావోద్వేగాలు, జ్ఞాపకాలు, కలలను అవి మళ్లీ గుర్తు చేస్తాయి. అలాంటి హృదయాన్ని తాకే అనుభూతిని అందించేందుకు వస్తోంది ‘సహ (లైఫ్ ఆఫ్ సంజు)’. నిషాంత్ దోటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కుమార్ కసారం హీరోగా నటిస్తుండగా, శ్వేత లక్ష్మ ణ్, వ్రజనా పాండ్యా కథానాయికలుగా కనిపించనున్నారు. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజేశ్వర్ వెల్పుచర్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ‘ది సోల్ ఆఫ్ సహ’ పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ కథలో సంజు అనే వ్యక్తి తన జీవితంలోని అత్యంత అందమైన దశలను తిరిగి గుర్తు చేసుకుంటాడు. చిన్ననాటి జ్ఞాపకాలు, స్కూల్ రోజులు, కాలేజ్ ప్రేమ, వివాహ జీవితం, ఆ తర్వాత జరిగిన భావోద్వేగ క్షణాలు అన్నీ అతని ప్రయాణంలో భాగమవుతాయి. అయితే కథ అనూహ్య మలుపు తిరిగేది ‘సహ’ అనే యువతిని కలిసినప్పుడు. ఆశ్చర్యకరంగా ఆమె పేరు మాత్రమే కాదు, తన గత ప్రేమను గుర్తు చేసే ఎన్నో లక్షణాలు కూడా ఆమెలో కనిపిస్తాయి.ఈ పరిచయం విధి, గమ్యం, అసంపూర్తిగా మిగిలిపోయిన భావోద్వేగాలు, మళ్లీ జీవితంలోకి తిరిగి వచ్చే బంధాల గురించి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతుంది. సహజమైన భావోద్వేగాలు, ప్రతి ఒక్కరూ తమ జీవితంతో అనుసంధానం చేసుకోగలిగే కథనమే ఈ చిత్రానికి ప్రధాన బలం. దర్శకుడు నిషాంత్ దోటి ఈ కథను ఎంతో ఆత్మీయంగా, హృదయాన్ని తాకేలా ఆవిష్కరించిన తీరు ప్రత్యేకంగా నిలుస్తుంది.సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర అందించిన సంగీతం అందించగా, కరుణాకర్ కె సినిమాటోగ్రఫీ, దినేష్ పెద్ది ఎడిటింగ్ చిత్రానికి అదనపు బలంగా నిలిచాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com